రాజ్యశ్రీ

చరిత్రాత్మకమగు నొక చక్కని నవల.

గ్రంథకర్త.

పండిత.

ఈ. భాష్యకాచార్యులు

ప్రధానాంధ్రోపాధ్యాయులు.

శ్రీమహంతుగారి

దేవస్థానము హిందూ హైస్కూలు

తిరుపతి.

MADRAS

THE ARTISAN PRESS, WALLAJAH ROAD.

1926.

[వెల 0–15–0

విజ్ఞప్తి.

చరిత్రాత్మకమగు నీ నవలలో చాలభాగము కరుణారస ముట్టిపడునట్లుండును. ఇతర రసములు నంగములుగా నందందును గలవు. కొన్నియెడల కెండేసి మూఁడేసి రసములు నొక్కటిగా గోచరించుచు; విచిత్ర వాసనా వాసితమగు నానా సూన సంకలిత యద్భుత మాలిక చొప్పున చదువరుల మదికెంతయు వింతఁ గొల్పుచుండును. కరుణా రసము ప్రధానముగా నుండినను తక్కిన రసములుగల యెడల్ల నవియే ప్రధానములా యను సంశయమును పుట్టించుచుండును.

పండిత సమ్మేళన సమయమున కొంతవఱకు వివిధ మతముల గుఱించి చర్చింపఁబడియున్నది. ఏవ్య సూచనలోనను స్వప్న సందర్శనము నను గల భయానక రసము చదివినయే గ్రహించి తీరవలసినది. ముఖ్యముగ రాజ్యశ్రీ మంగళికల ధైర్య సాహసములును మంగళికా చాతుర్యమును జయచంద్రుని దుస్తంత్రములును వర్ణనా తీతములు. కాంతమున సర్వమును జక్కఁ బడు ననుటకు విభాకర మిత్రుని ప్రవర్తనమే ముఖ్యాదర్శము.

చరిత్రాంశమును మాత్రము వెల్లడి సేయుటయే కాక ఆ కాల పుటాచారమును గూడ కొంతవఱకు విశద పఱచుచున్నది. స్థాలీపులాక న్యాయమున నిందలి విషయములనే నించుక యెఱిగించితి నంతియె కాని తక్కిన వానికిఁ జదువరులే ప్రమాణమగుదురు. వేయేల! ఈ గ్రంథమును జేత నెత్తికొనినఁ గడవఱకును జదువక వీడరనుట యతిశయోక్తి కాఁజాలదని దీని నచ్చొత్తించుటకు మున్నే చదివిన యనేకుల మూలమున వినియుంటిని.

గ్రంథకర్త.

పండిత. ఈ. భాష్యకాచార్యులు,

ప్రధానాంధ్రోపాధ్యాయులు.

శ్రీమహంతు దేవస్థానము హిందూ హైస్కూలు,

6—11—1926. తిరుపతి.

శ్రీరస్తు

రాజ్యశ్రీ

మొదటవ ప్రకరణము.

కాటసారి.

ఆహా! ఏమిఘోర యన్యాయము! రాజవంశమునం బుట్టి ప్రజలం దనసుతులవలె రక్షింపందగియుండియు, ఈ నరపతి యిట్టి నీచమార్గమున నడుగిడం జూచుట పాడియా! ప్రభాకర వర్ధనుని మరణమును, రాజ్యవర్ధనుండు శత్రురాజులతో యుద్ధము సేయ వెడలుటయు విని, ఇదియే యదనని గృహవర్మపైం బడం బూనుట యేటినీతిపద్ధతి? బలవంతుండు సహితమిట్లొనరించునను మార్గ మిదియగునా? శత్రువు నొచ్చియుండుటచూచి యాతనిపైం బడనెంచుట యన్యాయము. అందును నిష్కారణముగ తటాలున రాజ్యమును ముట్టడింపనెంచుట మిక్కిలి యన్యాయము. చెంతనుండు మంత్రులైనను ఇది యనుచితమని వచింపక, ఆతని పోకడల ననుసరించుట యుక్తమగునా? ఇట్టి రాజునొద్ద ఏగాలికాచాపనెత్తెడివారు గాకున్న ఎట్టివారుండంగలరు? ఇంతకు నీగృహవర్మ ఈతనికి లోంబడువాడా! గృహవర్మ యెట్టివ్యసనముననున్నను ఈతనికన్న మిన్న యేయగును. కావుననే కదా యీ నీచుం డిట్టియకార్యమునకుం గడంగెను. ఎన్నిమాయోపాయముల నాచరించినను ఈతనికి జయము లభించునా? సేనలెక్కువగానున్నవని ఈతండు గర్వించెం గాంబోలు! ఈతని బలగమునకన్న నినుమడుంగగు

బుద్ధిబలమును అంతకన్నను బదింతలధికమగు రాజ్యశ్రీ దేవిగారి యాలోచనా బలమ్మునుగలవు. ఈవిషయమును కొంచెమేని యాలోచింపక యూరక యిట్లు త్రుళ్లిపడుచున్నాఁడు, తనకును గృహవర్మకును అజగజాంతరము గలదనుట యెఱుఁగకున్నాఁడు.

అట్లని గెలుపు గృహవర్మకే కల్గునని దృఢముగఁ జెప్ప వీలులేదు కదా! ప్రత్యక్షయుద్ధమున నాతఁడు గెలువలేఁడు. కాఁబట్టియే మాళవేశుఁడిట్లు మాయలు పన్ని సంహరింపఁదలఁచి యున్నాఁడు, మనరాజునిప్పటితీరు చూడ ప్రత్యక్షముగ యుద్ధమున కుపక్రమించులాగున తోఁచుటలేదు. అట్టి యెడనిఁక వంచనయేకదా శరణము! ఇట్లు మోసపుచ్చి అతనిని జంపిన యెడల అపకీర్తియే యాతఁడు పొందులాభము. ఒక్కచోఁగన్యా కుబ్జమబ్బునుగదాయని యెంచినను శాశ్వతమగు కీర్తినిచ్చి నశ్వరమగు నీరాజ్యము నిలుచుట యవివేకికృత్యము. ఔరా! రాజ్యలోభముకదా యింతటిపని కుపక్రమింపఁజేయుచున్నది. మృత్యువక్త్రమునునుండి యైనఁదప్పించికొనవచ్చును గాని యాశావాగురలనుండి తొలఁగుట యరుదు. కావుననే మహాత్ములు దీని నిరాకరింతురు. అంటురోగపు క్రిములవలె ఇది యప్పటప్పటి కభివృద్ధమగుచుండును. ఈదురాశా పిశాచమును బాఱఁద్రోలుటకు వివేకమాత్రమొక్కటియే తగునది. శుష్కకాష్ఠము నగ్నివలె జ్ఞానశూన్యుని ఈలోభము నాశముగావించును. ఎట్టివంచనకయినను, ఎట్టిహత్యకయినను ఈలోభివెనుదీయఁడు. నలువురు నవ్వుదురని తలఁపఁడు. పెద్దలు దూషింతురని యోచఁడు.

అని తలంచుచు నొకనాఁటి తెల్లవాఱుజామున నొక పాంథుఁడు ఉజ్జయినీ ప్రాంతారణ్యమున వెడలుచుండెను. ఆతరుణమున నీచుని, వానిపక్షమువారును విడుచునట్లు తారక లెల్ల దోషాకరుఁడగు నక్షత్రేశుని వీడి మఱుఁగు పడఁదొడఁగెను. కళానిధి యయ్యును గాలవశమునఁ జంద్రుఁడు కళాహీనుఁడాయెను. దుర్వర్తనుని యపరాధమున కుపితుఁడగు ధార్మికుని నేత్రమువలె పూర్వదిశ యరుణకాంతిసంయుతమాయెను. మాళవనాథుని దురుద్దేశము నెఱిఁగింప గృహవర్మ కడ కరుగు వార్తావహుఁడోయన చల్లనిగాలి వీచుచుండెను. దానికిఁ దోడుగ దట్టముగా గుఱియుచుండిన మంచును తగ్గుచుండెను. కంబళికంచుకధారియయ్యు మన బాటసారి యాశీతబాధ కించుక కంపించియు, ధైర్యవంతుఁడగుటచే నెట్లో యోర్చుకొని యాదారినడచుచు, ఇట్లని తలపోయఁదొడఁగెను.

"గ్రీష్మకాలమున నెంతయు నానందమొసఁగు నీ శీతవాతమిప్పుడు ఇంతబాధాకరమయ్యెఁగా! కాలమే దీనికిఁ గారణము. కాలమహిమ గొప్పదికాకున్న జ్ఞానశూన్యుఁడనై, దరిద్రబ్రాహ్మణుఁడనగు నేను గృహవర్మ మహారాజునకుపాయ మునేర్ప వెడలుట యెట్లు సంభవించును? ఇందునకుఁ గారణము సత్యవర్మయొక్క యాశ్రయమేకదా! ఔరా! అతని మహిమ [illegible]ని యాడుకొనును! దేవగుప్త మహారాజునకు నాతని పేరవినగుండె లదరుచుండును. అంతటివాఁడు గాకున్న నెచ్చటనో రహస్యాగారమున జరుగు నామంత్రాలోచనాతత్త్వము నెఱిఁగి నాకుం దెల్పి యిట్లంపఁజాలునా! ఇతఁడిట్టి శ్రమపుచ్చికొనినందున కిది నిర్విఘ్నముగఁ గొనసాగినచో మేలగును!

అదియసాధ్యమని తోఁచెడిని. ఎచ్చట నెట్టివిఘ్నమురానున్నదో యని నామానసము మిక్కిలి భీతిలుచున్నది. దీనికిఁ గారణము నామది నిత్యశంకియగుటయే. ప్రీతిగలయెడ నెల్లరకు నిట్లేయుండుట సహజము. "అతిస్నేహః పాపశంకీ" యనుట నిక్కువము."

అని యిటుఁ దలఁచుచు నీపథికుఁడు పోవుచుండెను. ఆ తరుణమున బాలసూర్యుఁ డరుణకాంతి యుక్తుఁడై యాకసమున దాసాని పూవుంబోలెఁ దోఁచుచు గగన కుసుమమసత్యముకాదను భ్రాంతినిగలిగించుచుండెను. పక్షులుగూండ్లు వీడి ఆహారార్థ మచ్చటచ్చటికిఁ బోవనెంచుచు తామాచరింప వలసిన కార్యక్రమములఁగూర్చి అన్యోన్యసంభాషణములు సలుపుచున్నవో యనఁ గలకలారావములు కావించుచుండెను. మృగములును తమ పొదలనుండి వెడలనుంకించి తలలమాత్రము బయలువెట్టి ఎచ్చటనైన మనుష్య సంచారమున్నదాయని ఇటునటును బరికింపసాగెను. అచ్చటచ్చట ఆకులపైఁ బడియుండు హిమబిందువులు ముత్యముల విధమునఁ గాన్పించుచుండెను. ఇట్లెల్లెడల నుత్సాహదాయకమగు నాసమయము ఆప్రాంతమునఁగల దొంగలకుఁ గొందఱకు మాత్రము అత్యంతదుఃఖావహమాయెను.

ఆ కాలమునఁ గొందఱు చోరులు సూథవృత్తినొ... యరణ్యమున నివాసములు గల్పించికొని రాత్రుల గ్రామముల పైఁబడి స్వేచ్ఛగా దోఁచికొనుచుండిరి. పగలంతయును ఆగాధారణ్యమున నుండుచు బాటసరుగువారింబట్టి బాధించివారి సొమ్ముల్లను హరించుచుండిరి. వీరొక శక్తి నారాధించుట

గలదు. వీరికా దేవతయందత్యంత భక్తివిశ్వాసములుగలవు. ఈచోరులాదేవికి నరబలు లొసఁగుచుండుటచేతనే వారెవ్వరికిం జిక్కుటలేదని వారి విశ్వాసము. ఇట్టి నీచులకు చిమ్మచీఁకటులు గ్రమ్మియుండు నిశాసమయము దక్క పగటి పూట యెట్లు రుచించును? ఏమియాశ్చర్యము! "అహింసాపరమో ధర్మః" అని యెల్లెడలం బర్వియుండు నీకాలమునఁ గూడ నిట్టి నీచకృత్యములు జరుగుచుండుటయా? ఏప్రాణికిని హింస కల్పింపఁగూడదని శ్రుతులు ఘోషించుచుండ వీరేలసరకు సేయకున్నారు? తోఁచిన పోకడలం బోవు నీచులు శాస్త్రములను, ఆచారములను పాటింతురా! ఇట్టివారికి నరకమన్న భయముండునా? వీరెట్టి యకార్యమునకును వెనుదీయరు. ఇంతటి క్రూరులగు నీచోరులాదేవియం దంతటిమూఢభక్తి కలిగియుండుట యెంతయు నచ్చెరువుగనున్నది. ఇదియేకదా తామసభక్తి!

ఆనాఁటి బాటసారు లొంటరిగా నాయడవి నేఁగుటకు భీతిలుచుండిరి. అట్టి తెరువున నిస్సహాయుఁడై యరుగుచుండు నీబాటసారియు మిక్కిలి భయపడుచుండెను. ఏమిచేయఁ గలఁడు. తాను పూనినపని యనివార్యమగునదిగానఁ జేయునది లేక యట్టే నడచిపోవుచు, "ఏ యాపదయులేక యీ యడవి దాఁటినచోఁ బూనిన కార్యము నిర్విఘ్నమగు. అయ్యది యసాధ్యము. ఐనను, అర్థహీనునకుఁ జోరులవల్లని భయమేల? ఇంక నిట్టి శంకలు మాని మదిని బదిలపఱచికొని చనుట భావ్యము. త్యక్తశంక ముక్తధైర్యులకు సుఖదుఃఖములు నైజములు గాన, దీనతమాని ధీరతం బూనెదను." అని చింతించుచు నడచుచుండెను. సూర్యునికిరణములు నలుదెసలం

బర్వియున్నను జెట్లచేఁ గ్రిక్కిరిసియున్న యాకాంతార మధ్యమునఁ జీఁకటి క్రమ్మియుండెను. అప్పుడాతని వెనువైపున నడుగుల సవ్వడివినవచ్చినటులుండెను. ప్రక్కనుండు పొదలో నేదియో గదలునటులుండెను. చెంత నెవ్వరోగుస గుసలాడు నటుల గోచరించెను. భీతుఁడై యాతఁడు వెను దిరిగి చూచెను గాని యెవ్వరును గానరాకుండిరి. అంత నితఁడు తన శంకయే యందునకుఁ గారణమని తలఁచుచుఁ బామరుని పగిది నిట్లు భీతిసెందుట పాడిగాదని యెంచెను. భగవంతునిపై భారము వేసి యాతని నామ స్మరణము గావించుచుఁ బోవుచుండెను.

రెండవ ప్రకరణము.

కన్యాకుబ్జము.

శ్రీమంతంబై సకల సస్య పరిశోభితంబై, భూతల స్వర్గమో యనఁ దనరుచుఁ గన్యాకుబ్జనగరమెల్లరకు నుత్సాహ దాయకమై వాసిఁ గాంచుచుండెను. ఆ పట్టణము గంగా తీరమునఁ గట్టఁబడియుండుట నచ్చటి వారెప్పుడును, నీటికఱవు నెఱుఁగకుండిరి. దీని చుట్టును గొప్ప ప్రాకారమమరియుండెను. అందలి బురుజులు చాల నెత్తగునవై; శత్రువులెవరేని ఆ కోట వెలుపలికివచ్చి నిలచిన లోనుండియే సైనికులు వారిపై బాణములు ప్రయోగింప ననువగునంత వైశాల్యము గల్గియుండెను. ఆ ప్రాకారముం జుట్టికొని యగాధమగునగడ్తయుండెను. అన్నగర రాజము వైశాల్యము పదిక్రోశముల పొడవు, నంతయ నిడివియుంగల్గియుండె. వీథులు విశాలములగుటచే నెందఱు జనులు నడచుచుండినను ఎన్నిశకటములు వచ్చుచుండినను జనుల యాగమనప్రత్యాగమనముల కెట్టినిరోధమును గల్గకుండెను. వర్షాసమయమున వీథులంబడు వర్షజలమెల్ల బాటల కిరువంకలంగల కాల్వలలోఁబడి ద్వారినడచువారికి ఎట్టికష్టమును గల్గించకుండెను. వీథులు రెండువేళలను శుభ్రపఱచుచుండుటచే, ఎట్టి చెత్తయును లేక శుద్ధమై గచ్చు నేలవలెఁ [illegible]చుండెను. ఎచ్చటిజను లచ్చటనే సామగ్రులం గొన ననువగునట్లు ప్రతివీథిని దుకాణములుగలవు. వీథి వీథి నొక్కొక్క యారక్షకభటాలయ ముండుటచేఁ జోరాదిబాధలు లేకుండెను. అచ్చటి యిండ్లిరుకులేక యతివిశాలములగు గవాక్షములచే నిండి చల్లని గాలి యరుదెంచుట కెంతయు ననువై

యుండెను. ఒక్కదాని వెంబడి నొక్కటిగఁ గట్టఁబడక వేర్వే ఱుగా నిర్మించియుండుటచే జనులయునికికి ఆగృహాములు మిగుల నుపయుక్తములై యుండెను. ఆనగరమున నాకులమ్మువారు ముప్పది వేలుండిరి. పదివేల బౌద్ధభిక్షువులుండిరి. రెండు వందల కంటె నధికముగ హిందూదేవాలయములుండెను. మఱియును ఎన్నియో యుపవనములును ఎన్నియో కొలఁకులు నుండుటచే నెప్పుడును వేఁడిమిచే బాధపడకయానగరవాసులు ఎల్లప్పుడును సుఖముగనుండిరి. ఇంకను దేశ దేశపదార్థ సంగ్రహాలయ ములు ననేకములుండెను.

ఆనగరపు టుద్యాన వనములు ఎంతయు మనోహర ములైయుండెడివి. సాయంసమయమున నాతోఁటల ననేకులు విహరించుచుండురు. అచ్చటి శీతవాతములు విహారశ్రాంతులగు యువకుల విశ్రాంతులఁ జేయుచుండును. ఆ పురమున మొలచిన తృణము మొదలు మహావృక్షమువఱకునుగల ఒక్కొక్క స్థావరప్రాణియు చక్కఁగా నభివృద్ధిచెంది యా భూమి సారవంతమనుటకు ముఖ్య నిదర్శనముగా నుండెడిది. ఇంక నాయూరం గొన్ని కళాశాల లేర్పడియుండెను. అందనేకులు జ్ఞానవంతులు బోధకులుగ నేర్పడియుండిరి. కళాశాలల ప్రాశస్త్యముంబట్టియు, బోధకుల సామర్థ్యవిభవముంబట్టియు నానాదేశములనుండి విద్యార్థు లనేకు లరుగుదెంచి విద్యాభ్యా సించుచుండిరి. అట్టి విద్యార్థుల కశనవసనాద్యనేక సౌకర్యముల నాయూరి ప్రజాప్రతినిధి సంఘమువారు కల్పించుచుండిరి. కర్మా గారములనేకము లుండుటచే జేతిపనులు నచట నభివృద్ధి చెందు చుండెను. అచ్చటి యారోగ్య శాఖాధికారులు జనుల యా

రోగ్యమున కెట్టియాటంకమును గల్గకుండు లాగున వేయికన్ను లతో జూచుచుండిరి. ఈపట్టణముం జూచిన పరరాజులు సైతము "ఇచ్చటి మందిరములు నిశ్చలభక్తుని నమ్మికవలె దృఢములై చంద్రకాంతశిలలతో నిర్మింపఁబడినవి. వీని నిర్మాణమున కెన్నియో దీనారములు వెచ్చించి యుండవలయును. రెండు వందల సంవత్సరములు తదేకప్రయత్నముగానున్నఁ గాని ఇట్టి నగరము నిర్మించుట యసాధ్యము" అని పొగడు చుండిరి.

ఇట్లు సకల సుఖములకు నాటపట్టగు నా రాజధాని యనంత వైభవోపేతుఁడై మౌఖరీవంశజాతుఁడగు గృహవర్మ యొక్క పరిపాలనమున వాసిగాంచుచుండెను. ఆ రాజు రూపవంతుఁడును, విద్యావంతుఁడును, రాజనీతి నిపుణుఁడునై యుండెను. ఆతనిగుణగణములఁగాంచి సంతసించిన ప్రభాకర వర్ధనుఁడు తనతనయను రాజ్యశ్రీ నాతనికిచ్చి పరిణయము గావించెను. ఆమెయుఁ దన భర్తకు రాజ్యపరిపాలనాదికము లందు ఎల్ల విధములఁ దోడ్పడుచుండెను. మహావీరులని ప్రసిద్ధి గాంచిన రాజ్యవర్ధన హర్షవర్ధనుల చెలియలగు నామెయు నిజ సోదరులవలెఁ బరాక్రమవంతురాలు. వీరవనితయగు నాసాధ్వీల లామ రాజ్యతంత్రముల నడపుటలోమిగులం బ్రవీణురాలు. గృహవర్మ మహారాజూర లేనప్పుడు స్వయముగ నామె యా రాజ్యమును పాలించుచుండును. ఆ దంపతులకు బౌద్ధమత మునందు ఎక్కుడుగ నభిరుచియుండెను, అయినను అన్యమతము లందు ద్వేష భావములేక సర్వమత సమ్మతులై మెలఁగుచుం డిరి. బౌద్ధ బిక్షువులకు విహారములు కట్టించిరి. హిందూ

దేవాలయములు అనేకములు అభివృద్ధిపఱచిరి. జైనుల నెందఱినో మిక్కిలి సన్మానించిరి. బ్రాహ్మణులఁ బెక్కుర ఎక్కుడు గౌరవించిరి. వీరిరాజ్యమున మతభేదములేక పండితులైనచో ఎల్లరును గౌరవార్హులగుదురు.

గృహావర్మయొక్క బాల్యమిత్రుఁడొకఁడు దివాకర మిత్రుఁడనువాఁడు బాల్యమునందే విరక్తిచెంది బౌద్ధసన్న్యాసియై వింధ్యారణ్య ప్రాంతమున కేఁగి యచ్చట నాశ్రమము కల్పించి కొనియుండెను. అతఁ డప్పుడప్పుడును దన మిత్రుఁడగు గృహావర్మమహారాజుం జూచుటకు వచ్చుటకలదు. దివాకర మిత్రుఁడు సాంసారికాపేక్షల నెల్లను మాని బంధవిముక్తుఁడయ్యును, మిత్రుని తోడి స్నేహబంధమును మాత్రము వీడఁ జాలకుండెను. రాజును దనమిత్రుఁడు వచ్చినపుడెల్ల, కేవల మైత్రిని బాటించి చనవును మాత్రమే చూపక భక్తిశ్రద్ధలును గల్గి యాతనిఁ బూజించుచుండెను.

కన్యాకుబ్జాధీశులగు మౌఖరీవంశజులకును మాళవ దేశాధీశ్వరులగు గుప్తరాజులకును, పెక్కుతరములనుండియు విరోధములు పెచ్చు పెరుఁగుచుండెడివి. కావుననే అప్పటి యుజ్జయినీ నాథుఁడగు దేవగుప్తుఁడు గృహావర్మపై నెంతయు నసూయగల్గియుండెను. దేవగుప్తుఁడు హూణరాజులతో స్నేహముసేయుచుండుటచే ఆ కాలపు రాజు లనేకులతని యెడ వైషమ్యము వహించియుండిరి. మాళవాధీశుఁడును ఇట్లు తనపై ననేకులు విరోధముగల్గి వర్తించుటంబట్టియు; స్థానేశ్వర రాజపుత్రులును, రాజ్యశ్రీ సోదరులునగు రాజ్యవర్ధన హర్షవర్ధనులు బలవంతులగుటంబట్టియు, కన్యాకుబ్జాధీ

శ్వరుని పైఁ దన కెంతటి యసూయయున్నను వెలిబుచ్చుక సమయము కొఱకు నిరీక్షించుచుండెను. వీరవనితయగు నా రాజ్యశ్రీ వలని భీతియు నాతని కెంతయో కలదు. ఆతని యౌదాసీన్యమున కదియు నొక ముఖ్యకారణము. చారముఖ మున అప్పుడప్పుడిచ్చటి వార్తలం దెలిసికొనుచు, ఎప్పుడు సమ యమ్ము దటస్థించునా యని యెదురుచూచుచుండెను. గృహావర్మ మహారాజునకు నీతని కాపట్య మెఱుకవడక యుండలేదు. అయి నను దనదేహబలమును రాజ్యశ్రీదేవిగారి మంత్రబలమును నుండుటచే శత్రువును లక్ష్యము సేయకుండెను.

ఒక్కనాఁడు గృహావర్మ మహారాజు నిండు కొలువున నుండెను. రాజ్యశ్రీయును రాజు ప్రక్కన నొక యాసన మున నాసీనయైయుండెను. ఆ తరుణమున దివాకర మిత్రుఁడు దన శిష్యవర్గము తోడ నాసభా భవనమునకువచ్చెను. రాజును వానిం బూజించి యుచితాసనాసీనుం గావించెను. దివాకర మిత్రుఁడును మిత్రుని మన్ననలచే మిక్కిలి తృప్తుఁడై యిట్లనెను.

దివా:—రాజేంద్రా! ఏమట్లు చిన్నఁబోయి యుంటివి?

గృహ:—ఆర్యా! మా బావ రాజ్యవర్ధనుఁడు హూణులతోఁ బోరనరిగెను. వాని క్షేమవార్త మాకింకను దెలియ కుండుటయే యీ చింతకుఁ గారణము.

రాజ్యశ్రీ:—యతీంద్రా! మాయన్న యెచ్చట నుండునదియుం దెలి యకున్నది. మీరలు సర్వత్ర సంచరించెడి వారలు గావున మీకాతని కుశలవార్త తెలిసి యుండినచో నానతిండు.

దివా:—తల్లీ! మహావీరుఁడగు నీ సోదరుని విషయ మున నింత చింతయేల? ఎట్టి యుద్ధములైన నేమి

వాని కెన్నటికి నపజయము గల్గనేరదు. కావున మీ
రిట్లు భయపడుట సరికాదు. అతఁ డిప్పుడు హూణులఁ
బరాభవించి, జయలక్ష్మిం గ్రహించి కాశ్మీరమునం
దున్నాఁడు. అచిర కాలముననే రాఁగలఁడు.

గృహ:—నేఁడీ శుభవార్త వినినందున కెంతయు సంతసించు
చున్నాఁడను.

దివా:—ఈ సంతోషవార్త యటుండనిమ్ము. మాళవ రాజు
నీపై దండెత్తి రాఁబోవునట్లు నాచెవి సోఁకినది.
కాఁబట్టి ఆవిషయముననతి జాగరూకుఁడవై యుండుట
భావ్యము. నా యీ రాకయు నీ కావిషయ మెఱిఁ
గించుటకే యగుచున్నది.

గృహ:—ఏమి! మాళవ నాథుఁడు నాపై దండెత్తి రాఁబోవు
చున్నాఁడా! ఇది యగ్నిపై శలభ మురుకునటులకదా
యున్నది!

దివా:—మిత్రమా! నీవల్లించుట కదుఁ బొరపాటు. చిన్న
పామునైనను పెద్ద కఱ్ఱతోఁ గొట్టుట వాడియగును.
వాఁడెట్టివాఁడైనను నీవుపేక్ష వహించుట యయుక్తము.

రాజ్యశ్రీ:—మునికుల తిలకా! హూణపక్షపాతి యగుట నెల్ల
రాజులు నుపేక్షవహించియుండఁగ, మనపై నాతఁ
డెటుల రాఁగలఁడు?

దివా:—తల్లీ! వంగ దేశాధీశుఁడగు శశాంక గుప్తుఁడు, అత
నికిఁ దోడ్పడనున్నటుల వినుచున్నాను. జయించిన
రాజ్యమును వారిద్దఱును సమముగాఁ బంచికొన వలసి
నట్లొడంబడికలు గూడ జరిగినవఁట.

రాజ్యశ్రీ:—నాథా! మీరిఁక నాలసింపక వెంటనే కాశ్మీరము నకు భటుల నంపుఁడు.

గృహ:—ప్రియా! నీకేటి కిట్టిభీతి? వీర పత్నివయ్యును స్త్రీలకు సహజమగు భీరుత్వమును వీడకున్నావు. శశాంకగుప్తునకును, అతనికిని, ఎన్నినాళ్లనుండియో వైరము పెచ్చుపెరిఁగి యున్నది. ఇటులుండ వారిర్వురును గలియుటెట్లు? అట్లొకవేళ జరిగినను ఇంత మాత్రమునకే మనమేల జంకవలయు? ఇట్టివారు వేయి మంది వచ్చినను నే నొక్కఁడనే వారి మట్టు పెట్టఁగలను. ఈ మాత్రమునకై యుద్ధముచేసి యుండు నీ యన్నకు భటుల నంప వలయునా?

రాజ్యశ్రీ:—మీ మిత్రులానతిచ్చి యుండు లాగున నిట్టి విషయముల నుపేక్ష చేయుట తగదని వచించితి నంతయే కాని మీ పరాక్రమమున సంశయము కలదాననుగాను.

దివా:—చెలికాఁడా! నీపత్ని యాడి నట్లొనర్చుట మేలగును. ఇట్టి విషయముల నెప్పటికి నుపేక్ష వహించుట యుక్తముకాదు.

గృహ:—స్వామీ! మీ యానతి చొప్పుననే నడచికొని యెదను.

దివా:—అట్లైన నాకు సంతసమే. ఇఁక సెలవొసంగుము.

అనివారిని వీడ్కొని తన శిష్యులతోడ దివాకరమిత్రుఁడు వింధ్యారణ్య ప్రాంతమున కరిగెను, రాజును నిజపరివారములఁ దగు రీతిని మన్నించి నాఁటి సభ చాలించి, దేవీ సహితుఁడై యచ్చోటు వాసెను.

మూఁడవ ప్రకరణము

శోకవార.

ఎల్ల సుఖములకు నాకరమగు స్థానేశ్వర మొక్క-నాఁటి యుదయమున దుఃఖమున మునిఁగినటుల గోచరించుచుండెను. ఎవ్వనిమోము నవలోకించినను, వైవర్ణ్యముతోఁ గూడియుండెను. ఎట్టి గొప్పవారి యిండ్లను సంతోష ప్రదమగు గీతవాదిత్ర నిస్వనము వినరాకుండెను. ఏవాడం జూచినను ధూళి ధూసరితముగా నుండెను. ఏ దేవాలయము లందును మంగళవాద్య ధ్వనులు చెవులకు వినిపింపకుండెను. ఏవాని వీక్షించినను పెన్నిధిం గోలుపోయిన పేద చందానం గాన్పించెను. సూర్యుని వెలుఁ గెల్లెడలం బర్వుచుండియు నా పౌరుల చిత్తమున నీ లోకము గాఢాంధ కారమున మగ్నమయినట్లు గోచరించుచుండెను. వికాస మెచ్చటికో వలసపోయినట్లుండెను. మందునకైనను మందహాసము గానరాదు. ఉత్సాహ మూరు వెడలిపోయెను. ఖగముల కలకలారావములు కర్ణగోచరములుగాక యుండెను. వృక్షములు సైత మభినవవికసిత కుసుమములుగాక వాడు బాఱియుండెను. ఇట్లు స్థావర జంగమ ప్రాణులన్నియును విషాదా క్రాంతములై యుండ, నాఁటి యవస్థం బరికించినచో శ్రోత్తవాఁడగు నెట్టివానికేని విస్మయము జనించకపోదు.

ఆసమయమున హూణులం జయించిన రాజ్యవర్ధనుఁడు జనకుల దర్శనమున కువ్విళు లూరుచు, నశ్వారూఢుఁడై, అతివేగమున నానగరముం జొచ్చెను. ప్రవేశించిన

వాఁడప్పటి స్థితినిఁజూచి విస్మయ విషాదా వేగములు ముప్పిరిఁగొన నిట్లని చింతించెను.

"ఎల్లప్పుడు, నానంద సముద్రమున నోలలాడు నీ నగరము ఇటులుండుటకుఁ గతమేమిటి? జనకుల కేమైన నపాయము సంభవించి యుండునే? వత్సునకు హార్షునకేమే నాపద గల్గియుండునే? రాజ మార్గమునందుఁ బతాకములును, తోరణములును గాన వచ్చుటలేదు కాని ధూళి మాత్రము నిండియున్నది. ఎల్లప్పుడును జనాకీర్ణమగు నీవిపణిశ్రేణి నొక్కఁడైనను నేత్ర గోచరుఁడగుటలేదు. దుకాణములన్నియు మూయఁబడియున్నవి. రణవిజయులమై వచ్చిన నన్నెదుర్కొన మంత్రి సామంతాదు లెవ్వరును రారైరి. కాశ్మీరమునం గాంచిన దుస్స్వప్నము మొలకెత్తినదై, మార్గమధ్యమునఁ గలిగిన యుత్పాతముల నభివృద్ధమైయుండు నాకర్మపరిపాక వృక్షమెట్టి ఫలముల నొసంగనున్నదియో యెఱుఁగను. ఇప్పటి యునికిం బట్టి శుభము కలుగునని తోఁచదు. నామది కలఁతవాఱుచున్నది. ఉరమ్ము పగులునట్లు తోఁచెడిని. గుండియలు దటఁదటఁ గొట్టికొనుచున్నది, భయమను మాట యించుకే నెఱుఁగని నా మానసమున నిట్టి తత్తరపాటు గల్గుట ఏదియో గొప్ప యశుభమున కేమ్యమని యెంచెదను. నగర మిట్లుండుటకు కారణమ్ము విచారింత మన్న నెవ్వరును గాన్పించుటలేదు. ఇంతకును కానున్నది కాకమానదు."

అని తలంచుచు రాజ ద్వారమునొద్ద కరుదెంచెను. ద్వార రక్షకు లీతనిఁ గాంచినంతనే "హా"యని విలపింపఁ దొడఁగిరి. రాజ్య వర్ధనుఁడును మ్రాన్పడి, కొంతసేపటికిఁ

తెల్వి తెచ్చికొని "మీరిట్లేలవా పోయెద?" రని యడిగెను. దాని కుత్తరము వారి రోదనధ్వనులు ఇను మడించుటయే యాయెను. ఇఁక నటనుండిన లాభములేదని యెంచి తిన్నఁ గలోని కేఁగెను. అన్న రాకం దెలిసిన హర్షవర్ధనుఁడు పెద్ద పెట్టున నేడ్చుచువచ్చి యాతని పాదములపైఁ బడెను. ఇది గనిన రాజ్యవర్ధనుని శరీరము కంపింపసాగెను. మానసమున నెన్నియో భావము లుదయించుచుండెను. అంధకార బంధురమగు నొక గోతిలోఁ బడుచుండినటు లితని మదికిఁ దోఁడఁగట్టెను. శరీరమున నిట్టిదని తెలియ వీలుగాని యొకవిధమగు తీవ్ర వేదన కలిగెను. కడుపున నొక తాయిఁపడి యుండినట్లు భార మొక్కటి గోచరించుచుండెను. కన్నుల నశ్రువు లాతని కెఱుక పడకుండఁగనే స్రవింప మొదలిడెను.

అట్లుండియు నెట్టకేల కించుక ధైర్యమూని తన పాదముల పైఁబడియుండిన తమ్ముని లేవనెత్తి యందునకుఁ గారణ మడిగెను. బదులు రాకుండెను గాని కొంత సేపైన పిదప, పరిచారకుల మూలమునను నిజ జనకుల మరణ వార్త యెఱుక పడియెను. ఆ మాటవిన్నిన యాక్షణముననే యత్యంత శోకావిష్టుఁడగు రాజ్యవర్ధనుఁడు వేరు తెగిన వ్రూనివలె నేలపైఁబడి మూర్ఛనందెను. చెంతనుండు పరిచారకు లెన్నియో యుపచారములుచేయ దెప్పిరిలి యిట్లని వ్యసన పడఁదొ[redacted]

"జనకా! బాలురమగు మాకు, చేయవలసిన హితబోధ లెన్నియోయుండ, ఇట్లు పేక్షించి పరలోకమున కరుగుట భావ్యమే! తల్లీ! పుత్ర వత్సలయగు నీవును దయమాలి యిట్లు వీడుట పాడియగునే! జనకులారా! ఆర్తులగు మమ్మాదరడింపక

యుదాసీన భావమూన మీకెట్లు మన సొప్పెను. తండ్రీ! మీ యానతి చొప్పున శత్రువులను జయించివచ్చిన నేను మీవలన నెన్నియో మన్ననలం బొందనెంచి యుండ నా యాశలెల్ల నేటఁ గలిపి, ఇట్లీ లోకమును వీడి యరుగుటకు నా జేసిన యపరాధ మేమి? తల్లీ! పతితోడం బరలోకమునకుఁ బోవుట యధర్మ మనఁ జాలఁగాని; అతనికిం జెప్పి యిచ్చుటనే నిలుపుట కీవు వలంతివయ్యును అట్లు సేయమిగదుఁ బొరబాటని భావించెదను. ఓ జనకులార! మరణ సమయమున నాయట్టి యభాగ్యుని మోము చూడఁరాదని తలఁచియా నేవచ్చునంతలోనన, మృతులైతిరి? సోదరా! నీవేసుపుత్రుఁడవు; అప్పుడు నేఁ డెంత నుండినచో, నాకింత చింత కలిగియుండదు. ఇంతకును నా యభాగ్యదేవత నన్నిట్లు లలయించుచుండ, ఎంత చింతించిన నేమి ఫలము! వత్సా! అట్టి తల్లి దండ్రులే గతించిన పిదప నా కెట్టి సుఖములు కావలయు? నేనిఁక సన్న్యాసినై యెచ్చట నైన నేకాంతముననుండి కాలము గడిపెదను. నీవే యీ రాజ్యభారమును వహించవలయును. రాజ్యలక్ష్మిని గ్రహించు టకు నా యట్టి భాగ్యహీనుఁడు తగఁడు. మన మిర్వురము వారి సుతులైనను చరమక్రతువులం జేసి నీవు వారి ఋణముం దీర్చికొంటివి: ఇంక ఋణగ్రస్తుఁడనగు నేనిట నిలువఁజాలను" అని యాడిన యగ్రజుం జూచి హర్షవర్ధనుఁడును కన్నుల నీరు ఉప్పొలుచుండ, డగ్గుత్తికతో నిట్లనెను.

హర్ష:—అన్నా! జ్యేష్ఠుఁడుండఁగఁ గనిష్ఠుఁడు రాజ్యాధికారియ గుట యెందైనఁగలదే! అట్టి యన్యాయము నేనాచ రింపఁజాలను. జనకుల మరణమువలని దుఃఖ ముభయు

లకు సమానమే యగుచుండ నేను మాత్ర మావ్యస
నము వీడి, ఈ రాజ్యసుఖము ననుభవింపఁగలనే!
దాన నుభయులము నిర్లిప్తులమగుదము.

రాజ్య:—"యుక్తవయస్కుఁడవయ్యును ఇంకను నీ బాల్యపు
చాపలమును వీడకున్నాఁడవు. నీవొక విధమునఁ జన
కుల ఋణమును దీర్చి కొంటివనికదా నేవచింపినది!
అట్టియెడ నీ విట్లాడుట యసమంజసము. రామునానతి
భరతుఁడు తన కిష్టములేకున్నను రాజ్యభారము తలపై
నిడికొనలేదా! జ్ఞానవంతుఁడవు. పితృసమానుఁడనగు
నా యానతిని తిరస్కరించుట యుక్తమా!

ఈ మాట లాలించిన హర్షవర్ధనుఁడు, అత్యంత శోకా
విష్టుఁడై యిట్లని చింతించెను.

" మాయన్న యిట్లనుటకుఁ గారణ మేముండును? కల
హప్రియులెవ్వరేని మా కిర్వురకు విరోధము గల్పింప నుపక్ర
మించుచుండిరే! అటులుండునని తోఁచుటలేదు. నన్నుఁ
బరీక్షింప నిట్లాడియుండునే! బాల్యము నుండియు నా స్వభావ
మెఱిఁగియున్న వాఁడిట్లాచరింపఁడు. వ్యసన వశమున నొక్కటి
యాడఁబోయి వేఱొక్కటి యాడెనో! ఇంత పట్టుదలతో
నిట్లు నిర్బంధించుచుండ నిది ప్రమాద మెట్లగును? ఇప్పుడునే
నేమిచేయువాఁడ? రాజ్యమును గ్రహింత మన్న నగ్రజుండుండ
నవరజుఁడట్లు సేయుట యత్యంత పాపమని గ్రహించియుండు
నాచిత్త మాపాప కార్యమున కంగీకరించుట లేదు. వలదని
వారింతమన్న గురుతిరస్కార రూపక పాపము గల్గునని నా

మనస్సు దానికి సంగీకరింపకున్నది; ఇట్టి యెడ నే నేమార్గమునఁ బోవనగును! ఎంత యాలోచించినను రాజ్యము సంగీకరించుట మాత్ర మయుక్తమని తోఁచుచున్నది. గురు శాసనాతిక్రమణ దోషము కల్గినచో, అన్నతోడ నడవులకేఁగి తపమాచరించి, యా పుణ్యమున నీపాపమును బోకార్చి కొనియెదను గాక!"

అని యిట్లు తలపోయుచు హర్షవర్ధనుఁ డవనత ముఖుఁడై యుండెను. ఆ తరుణమున మంత్రి సామంతాదు లెంత నిర్బంధించినను రాజ్యవర్ధనుఁడు వారి మాటలఁ బెడ చెవిం బెట్టెను. హర్షవర్ధనుఁడు రాజ్య వర్ధనుఁ డడవికి వెడలినచోఁ దాను ననుసరింప సిద్ధముగనుండెను. అత్తఱి సంవాదకుఁడను రాజ్యశ్రీ పరిచారకుఁడు పెద్దపెట్టున నేడ్చుచు నటకువచ్చి రాజ్యవర్ధనుని పాదములపైఁ బడెను. అప్పుటి వారెల్లరును తెల్లవోయి చూచుచుండిరి. రాజ్యవర్ధనుఁడును నించుక తడవేమియుఁ దోఁచనివాఁడై యుండియు సంబళించికొని యిట్లని పలికెను.

రాజ్య:—ఓయీ! నీకిట్టి చింత కల్గుట కేమికారణము? నీ యజమానునకుఁ గుశలమేకదా! నీ విట్లొంటిమై నరుదెంచుటేల? నా సోదరి రాజ్యశ్రీయును గుశలినియే కద! చెప్పఁదలఁచిన దెద్దియో నిస్సంశయముగ వచింపుము. వజ్రమున కన్నఁ గఠినమగు నా మానస మెట్టి యమంగళముల విన్నను బగులఁజాలదు.

సంవాద:—దేవా! మా రాజు మాళవరాజుచే నక్రమముగఁ జంపఁబడెను. మృత్యువువలెఁ దటాలునవచ్చి పైఁబడి

సంహరించెనుగాని ప్రత్యక్ష యుద్ధమొనర్చిన వాఁడు గాఁడు. మా రాణిని సంకెళులు దవిలించి కన్యాకుబ్జమునంగల కారాగారముననే బాధించియున్న వాఁడని కింవదంతియు గలదు.

రాజ్య:—ఔరా! ఏమి యీ దురాత్ముని మదము! మేమింకను జీవించియున్నారమని యెఱుఁగఁడు కాఁబోలు! గర్వాంధుఁడగువాని కెద్దియుఁ గాన రాకుండును. తమ్ముఁడా! ఇంక నాతఁ పశ్చరణము రణమున శత్రుమారణకర్మాచరణమేయగు. నేనునిక్కముగ వానిని జంపక మరలిరాను. నీ వేమియు జంకవలదు. రాజ్యమరాజకమై యుండుట తగవుగాదు. కావున నీవుదానిని గాచి కొని యుండుము.

ఇది వినిన హర్షవర్ధనుఁడు నిజాగ్రజుని సంకల్పము వేఱు విధముగ మాఱుటకు సంతసించుచు, వాని వెంట యుద్ధమున కరుగుట కంతరంగమునఁ దన కెంత యిష్టముండినను, ఆతని కెచ్చట నుత్సాహ భంగము కలెడినో యని యూరకుండెను. రాజ్య వర్ధనుఁడును దన మేనమామ కుమారుఁడగు భండి యను వానిని, గొంత సేనయును దీసికొని మాళవ దేశముపై దాడి వెడలెను.

నాల్గవ ప్రకరణము.

రాజ్యవర్ధనుని విజయము.

బావా! నీ యీనాఁటి వైభవముఁజూడ, ఆనాఁడు నీతురీయాశ్రమ స్వీకారమునకేనొనర్చిన భాగముసకు వ్యసన మందు వాఁడనుగాను. ఇటుల విజయలక్ష్మీ వృతుఁడవగు నిన్నుఁ జూచుచుండుటచే నాకీయుద్ధమునఁ గల్గిన శ్రమయంత యును మాయమాయెను. ఇంతటి యానందము నా కెన్నఁ డును గల్గియుండలేదు—కాని,

అని యీలాగున భండి యాడినంతనే రాజ్యవర్ధనుఁ డిట్లనెను,

రాజ్య:—రాజ్యశ్రీ కింకను బంధవిముక్తి కాలేదనుట యొక్క టితోకదా నీచింత! అదెంతటిపని! నేఁడే వెడలుదము.

భండి:—నేను దెలుపఁదలఁచిన దదికాదు.

రాజ్య:—ఇంకనేది?

భండి:—ఈ దేవగుప్తునకనుకూలురగు వారలనట్టే విడుచుట యుక్తముకాదు.

రాజ్య:—అట్టి వారనేకులు ఈ యుద్ధమున మరణించిరి. ఒకరిద్దఱుండిన వారలు గోఱలు పెఱికిన పాముల వలె నేమియు నొనర్పఁజాలరు.

భండి:—కపటవర్తనులగువారు సమయము కొఱకు నిరీక్షించుచుండి, తఱి గల్గినంతనె పైఁబడుదురు. కాఁబట్టి శత్రు శేషము నిలుపఁదగదు.

రాజ్య:—నేఁడు నీకిట్టి చాపలము గలుగుటకుఁ గతమేమి? క్రొత్త విషయము లేవైనఁ జెవిసోఁకెనా?

భండి:—గౌడ నగరాధీశుఁడు మాళవ రాజునకుఁ దోడ్పడ నుండెనఁట. వీరిద్దర కనేక దినములనుండియు గుప్తముగా రాయబారములు జరుగుచుండినవఁట. దాన నీతఁడును మన విరోధి వర్గములోని వాఁడే యగును. ప్రత్యక్షముగ నీతోఁ బోరనేరమి మిన్నకున్న వాఁడు. కాని సమయము తటస్థించినచో విడువఁడు. కాఁబట్టి వాని నుపేక్షించుట పాడిగాదు.

రాజ్య:—విజయినగు నను గారవింప నరుదెంచువాని యెడ సంశయ మూనుట తగని పని.

భండి:—దీననే నీ యమాయికత్వము తేటఁబడుచున్నది. ప్రకటముగ నీతో యుద్ధము సేయ శక్తి చాలమి వంచనచేఁ బరిమార్పనెంచి, నీతోడఁ గపట స్నేహము నెఱపనెంచి, ఇట్టి సందేశమంపి యుండనోపు.

రాజ్య:—నీవనునటుల నాపై ద్వేష ముండు నెడల "జయలక్ష్మికిఁ దోడుగ నాకూఁతును బెండిలి యాడు"మని యేల వర్తమాన మంపి యుండును? అభిమానియగు వాఁడు కూఁతు నిచ్చెదనని చెప్పి యిట్టి కట్టడి సేఁత కొడిగట్టునా?

భండి:—కూఁతు నిచ్చెదనని చెప్పినదియు మాయ మాట యేయని యెంచుము. కుత్సితు లెప్పుడును దలఁచున

దొక్కటి, చెప్పున దొక్కటి, చేయున దొక్కటి యనుట నీకుఁ దెలియదా?

రాజ్య:—నీవే మనినను వాని మోము నొక తూఱిచూచినఁ గాని నా మనసున కది గోచరముకాదు. మనసులోని భావములకు మోముకదా ముఖ్యాదర్శము!

భండి:—కపటశీలురు • దమ భావముల వెలికి తోఁప నీయ రనుట నీ వెఱుఁగవా?

రాజ్య:—వాఁడెట్టి వాఁడైనను వాని యపరాధము ప్రత్యక్షమగు దాఁక మిన్నకుండుట భావ్యము.

భండి:—అట్లని యూరకున్న గోరఁ బోవునది గొడ్డఁటం బోకార్పవలసి వచ్చును.

రాజ్య:—అయిన నన్నిప్పుడేమి సేయుమనెదవు?

భండి:—నీచునిఁ దుదముట్టింపఁ బ్రయత్నింపు మనెదను.

రాజ:—నే నకారణముగ నొక్కనికిఁ గీడొనర్పను. ఇంచుక యోపికపట్టి యుండుము. వానితోడి సంభాషణము మూలముననే వాని యభిప్రాయమును గనుఁగొనఁగలను. ఇంచుకేని సంశయ ముదయించిన నతని నిముసములోన వానినిమట్టు పెట్టెదను.

భండి:—సరి—అట్లె యొనర్పుము.

అంభీరుఁడు
సంవాహకుఁడు }:—ఆర్యులార! రక్షింపుఁడు, రక్షింపుఁడు, ఆపన్నులమగు మమ్ము. మరణించిన మా రాజుయొక్క యవినయముమూలమున మొదలే నొచ్చియున్న వారము.

అందుకుఁదోడు క్షామడాంబరము మమ్ము పట్టికొని యాడించుచున్నది. గోరుచుట్టుపై రోకటిపోటన్నటుల నిప్పుడు కొంతకాలముగ నీ యుజ్జయినీప్రాంతారణ్యమునఁగల చోరులు చెలరేఁగి మా పల్లెలపైఁబడి మమ్మష్టకష్టముల పాలుసేయుచున్నవారు.

రాజ్య:—జానపదులార! భీతిలకుఁడు. నాయీ సేనాని మీ కష్టములఁ బోకార్చును—భండీ! నీవీ జానపదులను చోరుల బారినుండి రక్షింపఁ గతిపయ సేనాసమేతుఁడవై యరుగుము. నే నిచటనే యుండి రాజ్యాంగ విషయములఁ గొంత సంస్కరించుచు శిథిలమగుఁ గోటలను జక్కఁ బఱచుచుందును. ఇంతలోన శశాంకగుప్తుఁ డరుదెంచినను వానిఁ బరీక్షించి యప్పటికిందగు విధానమాచరింతును. కృతకృత్యుఁడవై నీవు రాఁగానే కన్యాకుబ్జమున కరుగుదము.

భండి:—బావా! నీయానతి జవదాఁటువాఁడనుగాను. నేవెడలి వత్తును. శశాంకగుప్తుఁ డత్యంత కపటి; కాఁబట్టి మిగుల జాగరూకుఁడవై మెలఁగ వలయునని మఱియొక తడవకును నొక్కి చెప్పుచున్నాను.

రాజ్య:—నీకు నాయందుఁగల మక్కువ యాలాగున నడుగడుగునకును నొక్కి చెప్పుమనుచున్నది కాని, నీవు మాత్రము నాబల మెఱుఁగనివాఁడవా? నేనున్న నీమాటలఁ బాటింపని వాఁడనా? వాఁడెంతటి వంచకుఁడైనను వాని మాటలనుండియే హృదయములోని భావమును

గన్నుఁగొనఁగలను అట్టులించుక సంశయము గలిగినను వెంటనే వాని నా యాఖడ్గమునకు బలి యొసఁగఁ గలను.

అంత భండియుఁ గొంత సేనం దీసికొని యటనుండి కదలెను. పిదపఁ గుంతలుఁడను సేవకుఁ డరుదెంచి "శశాంకగుప్తుఁడు కానుకల తోడ వచ్చుచున్నవాఁ"డని నుడివెను. రాజ్యవర్ధనుఁడును వాని నెదుర్కొనఁ సంసిద్ధుఁడై యుండెను. ఇంతలోనఁ గొంత పరివారముతోడ శశాంకగుప్తుఁడును వచ్చెను. తాఁ దెచ్చిన రత్నభూషణములును, చీనాంబరములును రాజ్యవర్ధనుని మ్రోల నిడెను. అతఁడును వచ్చినవాని నుచితరీతి సత్కరించి యాసనోపవిష్టుఁ గావించెను.

రాజ్య:—వంగ దేశాధీశా! రాజ్యమును వీడి యింతదూరము సేనా సమేతుఁడవై వచ్చుట కీప్రాంతమున నెచ్చటనైనను యుద్ధము తటస్థించియుండ నోపునని తలఁచెదను.

శశాంక:—నేనీ ప్రాంతమున యుద్ధము జరుగఁ బోవుచున్న ధ్వని విని నామిత్రునకుఁ దోడ్పడనెంచి యాతని యాజ్ఞను ప్రతీక్షింపకయే వచ్చినాఁడను గాని నాసాయ మక్కఱ లేకయే యాకార్యము కొనసాగెనని వింటిని. అంత నాకుఁ బనిలేక పోయినను మిత్రస్నేహము నన్ను తొందరపెట్టుటచే నేలాగుననైన హితున కుపకృతి యొనర్ప నెంచి వచ్చితిని.

రాజ్య:—నీవు మాళవనాథునకుఁ దోడ్పడ వచ్చియుంటివి కాఁబోలు! దైవవిధి విపరీత మగుటచే నీవు తలఁచినటుల

జరుగలేదు. ఇంక మరణించిన మిత్రున కుపకారమెట్లొ నర్పఁగలవు? మిత్రుని మరణమునకుఁ గారకుఁడగు వానిం గడ తేర్చినచోఁ జెలికాని కుపకారము గావించినట్లగును.

శశాంక:—మిత్రమా! నామాటలకన్యథాయర్థము గావించి కొంటివిగా! మాళవేశునకును నాకునుగల మైత్రి యెట్టి దనుట లోకమునకెల్ల విశదముగునదే కదా! అట్లుండ నీ విటులఁ బొరపడుటకుఁ గారణము తెలియుటలేదు. నీకు సాయపడ నరుగుదెంచితిని గాని యంతటి సుకృతము నా కబ్బునందున నీవు గ్రహించిన జయలక్ష్మికిఁ దోడుగ నా తనయనిచ్చి చెలికాని కుశకృతి సేయనెంచి వచ్చితిని.

రాజ్య:—సెయ్యుఁడా! నేను మాత్రము మైత్రిని బాటింపని వాఁడనా?

శశాంక:—నీకు నాయెడల నిక్కమగు ప్రీతియే యుండినయెడల నేఁటి రాత్రికి నా విడిదికి విందునకరుదేర వలయును.

రాజ:—మిత్రవాక్యమునకు మాఱాడువాఁడనుగాను.

శశాంక:—అయిన నిఁక నాకు సెలవొసంగుము.

రాజ్య:—సరి. పోయిరమ్ము. తప్పక యీ దినమున మీయింటికరదేరఁగలను.

శశాంక గుప్తుఁడును రాజ్యవర్ధనుని వీడ్కొని వెడలు చుఁదన యింటికివచ్చు నారాజేంద్రుని సంహరించుటకుఁ దగు నుపాయమును మానసమున నారయుచుండెను. రాజ్యవర్ధనుఁడును నాఁటిరేయి మిత్రునింటికి విందునకుఁ బోవఁ గృత నిశ్చయుఁడాయెను.

అయిదవ ప్రకరణము.

హర్షవర్ధనుఁడు

గంగానది కూలంకషముగా, ప్రవహించుచుండెను. వినతులగువారు పొందుల్లాభమ నెన్నటికి సున్న తులుపొందఁజాలరనుట యాచార పూర్వకముగఁ దెలుపుహాగున నానతములగు ప్రబ్బలి తీఁగలకు భంగము గలిగింపక యున్నతములగు వృక్షములఁ గూఁకటివ్రేళ్లతోడఁ బెకలించుచుండెను. హిమాలయమునఁ బుట్టిన యీ మహానది యచ్చటి ప్రవాహవశమునఁ జెట్టుపట్టులంగల యేనుఁగులు కొట్టికొని వచ్చుటచే నీటి యేనుఁగుల జ్ఞప్తి పఱచుచుండెను. తెల్లని నురుగులుగల యలలనుండి చల్లనిగాలి మెల్లమెల్లన వీచుచు నెల్లర కుల్లాసము గల్గించుచుండెను. గట్టులను గోయుచుఁ జెట్టులను ద్రోయుచుఁ బ్రవహించు నీజీవనది మట్టుమీఱ ఘోషించుచు "గంగాయాం ఘోషః" అనుదాని నభిదోదాహరణముగఁ జేయుచుండెను. హంసమిథునము లనేకములీతరంగిణీ తరంగములను తూఁగుటుయ్యాలల నూఁగుచుండెను.

అట్టియెడ నాయేటి యొడ్డున నొకనాఁటి యుదయమునఁ గొన్ని శిబిరములు గన్నుల పండువు సేయుచుండెను. అందొక్క పటకుటీరము నానా వర్ణములగు పట్టుబట్టలచే నలంకృతమై యుండెను. ఆ శిబిర ద్వారమున నిర్వురు భటులు ఖడ్గధారులై కాచికొని యుండిరి. వారు ధరించిన తెల్లని యుష్ణీషములయందలి జరీపై బాలసూర్యుని కిరణములు పడుటచే నది

తళతళమని మెఱయుచుండెను. ఆ శిరోవేష్టనముపై వారు చుట్టి కొనియుండు ముత్యపు సరములందలి తారళ్యమా మెఱుఁగున కొకవింత సోయగము నాపాదించుచుండెను. వారి నయనము లంగాంచినంతనే వారి జాగరూకత వెల్లడియగునట్లుండెను.

వారు కావలి గాయుచుండు నాపట కుటీరములోవైపున చిత్రవర్ణ భాసురములగు రత్నకంబళములు బఱచియుండెను. చుట్టును నానా విధములగు పటములు వ్రాలియుండెను. అందొకవైపున సింహాపీఠిక యొక్కటి యమరియుండె. దానిపై నొక యువకుఁ డాసీనుఁడై యుండెను. అతని ప్రాయము రమారమి యిరువది వత్సరములుండును. ఆ యువకుని నూనూఁగు మీసము లాతని కప్పుడే యౌవనోదయ మాయెననుట వెల్లడి సేయుచుండెను. ఆకర్ణాంత విశాలములగు లోచనములును, విశాల వక్షమును, ఆజానులంబి బాహువులును, గంభీరాకృతియు నాతఁడు మహారాజనుట చెప్పకయే తెలియనగుచుండెను. రూపవంతునకుపమానము సెప్పుట కంగవిహీనుఁడగు మన్మథుని దృష్టాంతీకరించుటకన్న, ఈసుందరు నుపమానము గావించుట యొప్పిదమగును. అతని మోముమాత్ర మేలకో వైవర్ణ్యమునంది వాడఁబాఱి యాతని మనసులోని సంగ్గల చింతను వెలిఁబుచ్చుచుండెను. అతని యెదుట దీర్ఘకాయుఁడును స్థూల శరీరుఁడునగు నొక పురుషుఁడు తనకై వేసియుండు వేఱొక యాసనమున నుపవిష్టుఁ డయ్యెను. మహారాజ లక్షణ లక్షితుఁడగు నా సింహాసనాసీనుఁడు :

" ఆహా! హూణ హరిణ కేసరియన్న ప్రసిద్ధ బిరుదము వహించిన ప్రభాకర వర్ధనుని గర్భమున జనించి పరాక్రమ

శాలియని వాసిగాంచియు, సమయమున నాయన్నకుఁ దోడ్పడ లేకపోతిని. బుద్ధిహీనుఁడనై యింటనిలచితిని. అప్పుడు, నేనును నాయన్నతోడ వెళ్లియుండిన నిట్టివైపరీత్యము గలిగియుండ నోపదు. వంచనచే జరిగిన కార్యమునకు నేనంతకుఁడనైన మాత్ర మేమిచేయఁగలను? దైవము సేఁత గాకున్న రాజ్యవర్ధను నానీచుఁడు సంహరించునా! కాని—ఇఁక వీఁడెట్లు తప్పించికొనునో చూచెదనుగాక. ఎప్పటికైన శశాంక గుప్తుఁడు నాబాణములకు గుఱి కావలసినవాఁడే. వాఁడెచ్చటి కేఁగినను ఎవ్వని నాశ్రయించినను నాయాయుధ మాతని విడువదు.

ఓరీ! మూఢా! నీ దేశమంతయు నొక్కపెట్టున పాడు సేయఁగల ననుట దెలియకుంటివిగా! ఛీ! ఇదియు నొక ప్రభుతా! కూఁతు నిచ్చెదనని చెప్పి నమ్మించి, నీ యింటికి రప్పించికొని, విశ్వాసఘాతుకుఁడవై ఘాతుకులమూలమున ఇట్లొనర్చుటయును ఒకపౌరుషమా! తుచ్ఛుఁడవగుటచే నీవట్లు మోసము సేసినను నేను బహిరంగముగ నీతో యుద్ధమొనరించియే నిను సంహరించెదను. శ్రీరాముఁడు దర్భనభిమంత్రించి కాకాసురునిపై విసరివైచిన లాగున నా ఖడ్గమును విసరివైచినచో అదియే యవలీలగ నీ ప్రాణములఁ దీయఁగలదు. నా కొనవ్రేలి గోటికైని సరిపోలని నిన్నడఁచుట యొక గొప్ప పనికాదు. నీ వాచరించిన పాపకార్యమునకు తగునట్లు నిన్ను చిత్రవధ గావింప వలయును గాని యొక తూటితో చంపుటయుచితముకాదు.

ఓరీ! ఏమి నీ యజ్ఞానము! పరమ సాధ్వి మతల్లి యగు నాసోదరి రాజ్యశ్రీనిం జెఱఁబెట్టినందున ఆదేవ

గుప్తుఁడు మరణించెను. ఇది తెలిసియు నించుకేని జంకు గొంకులేక యింకన్ను ఆమెకు వ్యసనము గలుగు లాగున నిట్టి యకార్యము నాచరించెను. చందన వనమునఁ గంటకద్రుమ ముదయించినటుల ధర్మాత్ములు జనించిన సద్వంశమున ఈ నీచుఁడు పుట్టి వారిపేరునకుఁ గళంక ముత్పాదించుచున్నాఁడు. ఇట్టి పాపి యగుటచేతనే వీని రాజ్యమునందలి ప్రజలు సైతము వీని రాచఱికమున కిష్టపడకున్నవారు. ఇఁక నేను వీని విషయమున నుదాసీనభావ మూనుట సరికాదు.

అయ్యో! ప్రతిపక్ష భయంకరుఁడగు ప్రభాకర వర్ధనుని యనుంగు కూఁతురవై, పరాక్రమమున వాసిగాంచిన యట్టి మాకు సోదరివై యనదవలె నీ వవస్థపడుట యెంతటి విపరీతము! సోదరీ! నీ యాపత్సమయమున నిను గాపాడలేని యీ సోదరు లున్ననేమి? లేకున్ననేమి? అయినను నా కన్న నన్నయ్య కొంత మేలుఁగని తలఁతును. అతఁడు నిను గాపాడకున్నను శత్రుసంహార మొనర్చియైనను గొంతవఱకు పగ సాధించికొనఁ గలిగెను. నే నామాత్రమునకును నోఁచికొననైతినికదా! సమయమున స్ఫురింపని బుద్ధియు, కష్టముల నాదుకొనని బంధువు, నాపదల నుపయోగింపని యాయుధము నొక్క కోటిలోని వేయఁదగును. ఆహా! చెఱఁబడు సమయమున మాచే నెట్టి ప్రయోజనముం గాంచమికి ఎంతవగచితివో! సుకుమారివగు నీ వింక ఎంత కాల మిట్లు బాధింపఁబడి ఆ కష్టముల నోర్వఁగలవు? ప్రథమమున నీ బంధవిముక్తిం గావించి యావల శత్రుసంహారమునకుం గడంగువాఁడను.

హా! నేనేమి యిట్లు పొరపడుచున్నాను! ఒక వైపున భర్తృ మరణమును, ఇంకొక వైపున బంధన ప్రాప్తియు ఇట్లు వ్యసన మధ్యస్థురాలవగు నీకు భ్రాతృ మరణవార్తం దెలిపి ఇంకను దుఃఖము నభివృద్ధి పఱుపఁజాలను. ముమ్ముందా శత్రునాశము గావించి తన్మూలమునఁ గల్గిన సంతోషముతోఁ గలిసిన సోదర మరణవార్త నీకెఱిఁగించుట యుక్తతరము. ఎట్లును సహోదరమరణదుఃఖ మసహ్యావేదనమేయగును. భార్యాహీనునకుఁ గళత్రమును, చుట్టములు లేనివారికి బాంధవులు నేదేశమున నేసమయమున నేనిఁ జిక్కుదురు. సోదర హీనునకు మాత్రమెచ్చట నెప్పుడును సహోదరుఁడు చిక్కఁడు."

అని యిట్లు చింతించుచుండ సమీపమున నా సేనుల నైన దీర్ఘకాయుఁ డిట్లనెను.

"ఆయుష్మంతుఁడా! నీయట్టివారిలాగునఁ బామరుల వలెఁ జింతాక్రాంతులైన కార్యములెట్లు కొనసాగుట? ఎంత కాలము వగచినను మరణించినవారు మరలి రాఁగలరా? కావున నీ దుఃఖము మాని హర్షవర్ధన నామము నన్వర్థము గావింపుము.

హర్ష:—బావా! నేనుదాసీన భావమూని యుంటినని తలఁచితివా! నీయూనతి చొప్పున సేనల నెల్లం గొనివచ్చి యుంటిని. జరుపవలసిన విధానమును నీ వేలాగున నుడివిననటుల నాచరింప సంసిద్ధుఁడుగ నున్నాఁడను, నాకు మిత్రమవ్వయినను, చుట్టమవ్వయినను నీవేకదా! స్థానే

శ్వర రాజ్యము నెలకొల్పుటకు భండియే పునాది వంటి వాఁడని లోకు లనుకొనుట నేనెఱుఁగనా!

భండి:—రాజకుమారా!—మహారాజవగునీ పూర్వపు చనవున నిట్లు పిలచినందులకు మన్నింప వేఁడి కొనుచున్నాఁడను.

హర్ష:—మాననీయుఁడవగు నీవు నన్నాజ్ఞాపించుట సరియగుఁగాని యీలాగునఁ బ్రార్థించుట బాడికాదు.

భండి:—విశాల హృదయుఁడవగు నీకా లాగునఁ దోఁచుట వింత కాదు. సరి—మన మిప్పుడు సేనలతోడ నరుగుదెంచి యుంటిమి కదా! మీఁద జరుపవలసిన దేలాగున ననియాలోచించితివి?

హర్ష:—అదియే నాకును బాలుపోవకున్నయది. శత్రు సంహారమునకుఁ గడంగుట మున్నా; సోదరీ బంధ విమోచనమున కుపక్రమించుట మున్నా యని యాలోచించుచుంటిని!

భండి:—తుద కేమని సిద్ధాంతీకరించితివి?

హర్ష:—ప్రథమమున సోదరిని విడిపించి యామెకీ భ్రాతృ మరణవార్తం దెలుపుట కంటెను ముందుగ శత్రు సంహారమొనర్చి యావల నామెను బంధవిముక్తురాలిని గావించినచో శత్రు మరణము మూలమున నించుక శాంతించిన భ్రాతృ మరణదుఃఖ మోర్చికొనఁదగిన దగునని తలఁచెదను.

భండి:—నీ విటు లాలోచించుట నాకు నచ్చుటలేదు. శత్రువును సంహరింప మున్ముందుఁ బ్రయత్నించినచో మాయావియగు నా నీచుఁ డామె కేమైన నెగ్గొనరించిన మనపడిన పాటెల్ల వ్యర్థమగునుగదా! అబలయగు నామె నాపదనుండి తప్పించినచో ఆవలి కార్య మవలీలగా జరిపికొనవచ్చును. ఇది నాకుఁ దోఁచు నుపాయము. మేధావంతుఁడవగు నీవు బాగుగ నాలోచించి తగురీతి నాచరింపుము. నీయాడినదాని కన్యథా జరుపువా రిచ్చట నెవరు గలరు?

హర్ష:—చింతార్ణవ గతుఁడనగు నాకు నీమంత్రమను నావ దక్క నింకెద్ది యుత్తారకము? కాఁబట్టి నీయాడిన చొప్పుననే జరిపెదను.

భండి:—స్వబుద్ధిని వీడి కేవలము పరబుద్ధియే ప్రధానమని యెంచుట తగదు.

హర్ష:—ఇది పరబుద్ధి యెట్లగును? ఇయ్యది గురుబుద్ధి కావున దీన విశేష సుఖము గలుగును.

భండి:—నృపాలా! రాజ్యభారము పైఁబడు కొలఁది గర్వ మెక్కుడగుటకు మాఱుగ నడఁకువ అధికమగుట యెంతయు నుతింపఁదగును. నీయిప్పటిరీతి భగవంతుఁడు నిజభక్తుల భక్తికిమెచ్చి వారికి లోఁబడు లాగున నున్నది.

హర్ష:—అది యట్లుండ నిమ్ము. ఇపుడు కన్యా కుబ్జమునకు మన మరుగవలయుఁగదా!

భండి:—ఔను.

హర్ష:—అట్లే నీకు సేనల నాయత్తపఱపుము.

భండి:—మన మిట్టి సన్నాహములతో నరిగిన శత్రువున కెఱుక పడఁగలదు. అంతవాఁడు నీసోదరి కెద్దేనిహానిం గల్పింప నోపును. కావున మనము సముచిత పరివారముతో నేఁగవలయును. సేన లెల్లం జీలి వేర్వేఱు దారులంబట్టి కన్యాకుబ్జమునకు రావలయు. ఇట్లాచరించుట యుచితమని నామతము.

హర్ష:—అట్లే కావించుము.

అంత భండి హర్షవర్ధనుని వీడ్కొని తన గుడారమున కరిగెను. హర్షవర్ధనుఁడును తనకు ఇట్టి సేనాపతి చిక్కుట కలరి తనమనసునఁగల వ్యసనము నించుక శాంతి సఱచికొనెను.

ఆఱవ ప్రకరణము.

బంధవిముక్తి.

"ఆహా! దైవ మనుకూలింపకుండినఁ బౌరుష మెంత యుండినను నిరుపయోగమ యగు. నే నిచ్చటి కప్పుడే వచ్చి యుండినచో నంతయును అనుకూలపరిణామి యయియుండును. మార్గ మధ్యమున ఆ దొంగలకుఁ జిక్కకుండిన ఇట్టి విపరీతములు సంభవింపకుండును. ఆ నీచులు ద్రవ్యశూన్యుఁడనగు నన్నేమిసేయఁ బోయెదరని యెంచితిఁగాని తమదేవత కాలాగున నన్ను బలి యొసంగ తలఁచిరని తెలియనైతిని.

నీచులార! ఈశ్వరుఁడు లేఁడని యెంచికదా మీరిట్టి యకార్యమున కొడిగట్టితిరి? తుదకు మీ సేఁతకుందగు ఫలము కదా యనుభవించి తీరితిరి! దేవుఁడిచ్చటను గలఁడనుట నా మెడపైఁ బడనుండు కరవాలము నట్టెపట్టి ఆ భండ మిమ్మెల్లరం దును మాఱుచుండినపుడైనం దెలిసి కొంటిరా! ఏమి యా వీరుని సామర్థ్యము! ఎట్టి వారికిని బట్టువడక తప్పించికొని తిరుగుచుండిన వీరిని బట్టునపు డాతఁడు చూపిన పరాక్రమ మెంతయుఁ గొని యాడఁదగినది! అట్టి మహాత్ముఁడే చెంత నుండినచో నీ నీచ శశాంక గుప్తుఁడు రాజ్యవర్ధనుని జంపఁ గలఁడా!

ఓరీ! తుచ్ఛా! ప్రత్యక్షముగఁ బోరలేక మాయో పాయముల రాజ్యవర్ధనుని గడ తేర్చినది చాలక, చెఱనుండు రాజ్యశ్రీని ఎట్లని నీయూరికి రప్పించికొని చెఱుపఁ జూచెద వుగా! మయ శంబర మారీచాదులమించు మాయలమారివే

యగుదువుగాక. దైవ యత్నము లేకున్న నీయాటలు కొన సాగవు.! నిన్న మార్గాయాసమున నీయూరి వెలుపలనున్న ఆ పొదలో నే విశ్రమించియుండ దాని కించుక సమీపమున నుండు నా మట్టినీడ నాసీనులైయుండిన ఆ మాయ సన్న్యాసులు సంభాషించుచుండ నేను వంచన యంతయు యాదృచ్ఛికముగ నాలకింపఁ గలుగుట దైవ కృపచేఁగదా! ఇంక నీ యాటలు సాగనేరవు. క్రొత్తవాఁడనగు నాకీ కన్యాకుబ్జమున ఈ కార్యమునకు సాయపడువార లెవ్వరని యాలోచించుచుండ దైవ వశమున మా యూరిదగు మంగలికయను రాజాంతఃపుర పరిచారిక యెదురైతా నీ విషయమునఁ దోడ్పడు నట్లు అంగీకరించెను. ఆమె మూలమున రాజ్యశ్రీ దేవిని వీరి బారిఁబడక తప్పింపఁగలను.

అనియిట్లు లోకనాఁటి రేయిని గన్యాకుబ్జము నందలి రాజమార్గమునఁ బోవుచుండు నొక పాంథుఁడు దలఁచుచుండ మంగలికయు నాతనికి ఎదురుపడెను.

"మంగలికా! బాబు చేరులోపల నామెను దప్పించెద నంటివే! అది యేమాయెను.

మంగలిక:—ఒయీ! గాలవా! ఆభారము నాపైనుండ నీకా చింతయేల? నా మాటలయందు విశ్వాసము లేదు కాఁబోలు!

గాలవుఁడు:—నేను నిను నమ్మకపోలేదు. సత్య సేనుని మాట చొప్పున నడచికొన నేరక కార్యమును జెడఁగొట్టి కొనినందునఁ గల్గిన పశ్చాత్తాపము నన్నిట్లాడఁ బ్రేరేపించుచున్న యది.

మంగళిక:—నా మాట యన్యథా జరుగదని తెలియుము.
ఆమె వారిబారిఁ బడకుండ రక్షించుటకు నేనుబద్ధ
కంకణనై నిలచియున్నాను.

గాలవుఁడు:—నాకు నంతయే చాలును.

మంగళిక:—నే నిటఁ దామసించుట తగదు. నాకు సెలవిమ్ము,
పోయివచ్చెదను.

గాలవు:—అటులనే కావింపుము.

అంత గాలవుఁడును మఱునాఁడా యూరినుండి వెడల నిశ్చయించినవాఁడై తన విడిదికరిగెను. మంగళికయు నాతని పీడ్కొని వెడలుచు రాజవీథి నరిగిన రాజభటులు తిరుగు చుందురు కాఁబట్టి యా మార్గమునఁ బోవుట సరికాదని భావించి యచ్చటఁగల యొక సందుదారి నరుగుచుండెను. వెనుకవైపున నడుగుల చప్పుడు వినవచ్చుటచే నెవ్వరో తన సమీపమునకు వచ్చుచున్నారని యెంచెను. వెనుకకుఁ దిరిగి చూచెను. గాఢాంధకారా వృతమగు నా నిశాసమయమున నీమె కేదియును గోచరింపలేదు. అంత నాబిడ యథా ప్రకా రము బోవుచుండ మరల నడుగుల చప్పుడు వినవచ్చెను. మంగళికయు మరలఁ దిరిగి చూచి, శబ్ద మేదేని గల్గునేమో యని దత్తావధానయై వేచియుండెను. అప్పుడు కల్గిన శబ్దము చొప్పున్న బట్టి ఒకరు ముందుగ నింకొకరు వారి వెనుకను వచ్చుచున్నవారనుట నూహించెను. భీతచిత్త యాయెను. మరల నించుక ధైర్యమవలంబించి "ఎంతటి ధైర్యము దెచ్చి కొనినను స్త్రీలకు సహజమగు భీరుత్వము నను వీడకున్నది. రాజమార్గమునఁ బోయిన రక్షక భటులుందురుకదా యని

మొంచి యీ సందు దారిం బడితిని. ఇచ్చటఁగూడ నపా
యము వాటిలునేమో యని సంశయించుచుదానను. ఇప్పట్టున
నేమి చేసిన మేలగును? ఎటనైనం దాఁగియుందునా? వచ్చెడి
వారును నను గనిపెట్టుచునే యుందురు. అట్టియెడనే నెట్లు
తప్ప వీలగును? అయినను వీరిపుడు నన్నే వెదకుచు వచ్చు
చున్నారను టెట్లు? అచ్చట నిరువుర యడుగుల చప్పుడు విన
వచ్చుచున్నది. వారిలో నొక్కరు మఱియొకరిని దఱుముకొని
వచ్చుచుండఁగూడదా? ఎట్లు నిదె కనఁబడు నీ పాడు బడిన
యింటు, దూరెదనుగాక."

అని యిట్లు తలపోసి మంగలిక యా యింటం బ్రవేశిం
చెను. తలుపుల గడియవైచి కొనియెను. అంత నొక వ్యక్తి
సంభ్రాంతమగుచు నావైపుననే వచ్చెను. అదియు నాయింటం
దూర నెంచెనుగాని కవాటము బంధింపఁబడియుండుటచేఁ
బ్రవేశింప వీలుగాకుండెను. మరలఁ బర్వులిడఁ దొడఁగెను.
మఱియొక వ్యక్తియు ముందుఁబోవుచుండు వ్యక్తిని దఱిమి
కొనుచు నేఁగుచుండెను. ఇట్లా వ్యక్తి ద్వయము నా ప్రాంత
మునంగల సందు లంతయుం దిరుగుచుండ, ముందుఁ బోవు
చుండు వ్యక్తి తన ముందు వైపుననుండు నొక యింటి దిడ్డి
త్రోవనలోనం బ్రవేశించి యా కవాటమును బంధించి కొనెను.
దానిం దఱిమికొనివచ్చు వ్యక్తియు వేగ వశమున నింకం గొంత
దూర మరిగెను. ముంతడుగుల చప్పుడు వినరామి నచ్చెరువడి;

"ఏమి నాయజ్ఞానము! చేయిఁ జిక్కిన దానిం బోఁగొట్టి
కొంటిని. ఇంక నాతనికి బదులేమి చెప్పఁగలను? అహో!
ఇట్టి తెలివిలేని నేనప్పుడేల బిరములఁ బల్కవలెను? ఇప్పట్టునఁ

జింతించుచుండిన ఫలమేమి? ఇది నాకు నూతన స్థలమగుటం బట్టి యొరులతోఁ జెప్పికొనుటకును అనువుగాకున్నది. దొంగకుఁ దేలు గుట్టిన లాగున నాకీ సమయమున మౌనావలంబన మే మేలగును. నా మిత్రమును రాక తడయుటకుఁ గారణ మూహింపఁజాలకున్నాను. నా నెచ్చెలికి నిది క్రొత్తచోటగు టచే దారి తప్పి చిక్కులు పడుచుండనోపును. కానిచో నిట్లాల సింపఁ గారణములేదు. ఇంతకును గానున్నది కాక మానదు."

అని చింతించుచు నెట్లు నావ్యక్తి ముందునకే పోయియుం డనోపునని నిర్ధారణ గావించికొని తానును ముందునకుఁ బోవు చుండెను. అచ్చటఁగల సందు గొందుల నెల్ల నన్వేషించెను. ఈలాగున నల్లెడల వెదకి వెదకి వేసరి యేమిచేయు యాలో చించుచుఁ బోవుచుండెను. ఇటులఁ గొంత దవ్వరుగు నప్పటికి వెనువైపునఁ బదధ్వని వినవచ్చెను. అంతం దన నెచ్చెలియే వచ్చుచుండ నోపునని తలఁచెను. వెనుకకు మరలిచూచెను. సందడి యేమియు లేనందున సందేహించెను. ఎట్టి యపా యము గలుగునో యనెడి భీతిచే నంగములు వడఁకఁజొచ్చెను. మేను జెవుర్చెను. గుండియలు దటఁదటఁ గొట్టికొనసాగెను. ఇంకఁ దా నిటులఁ దిరుగుట బాడికాదని యెంచి రాజమార్గ మునకు రాఁబ్రయత్నించి యించుక వేగముగ నడువఁదొడఁ గెను. మరల యథాపూర్వముగ నడుగుల చప్పుడు విన వచ్చెను. అంత రెట్టించిన భీతిచే, నా వ్యక్తియు:

"ఎట్టి యాపదలయందును ధైర్యము వీడని నాకిప్పుడేల కోయింతటి భీతి జనించినది! ఇదిచూడ నెద్దే నశుభము సంభ వింప నోపునని తోఁచెడిని. ఇది నా కష్టానుభవ నాటక

మునకుఁ బ్రస్తావన యని యూహించుచున్నాను. నా యొన ర్చిన చెడు చేఁతల ఫలముకట్టి కుడిపింపక యూరక వీడునా? ఎట్లైనను ఇప్పట్టున ధైర్య మవలంబించుటయే కర్తవ్యము. ధీరున కాపదలును గొంతవఱకుఁ దీరఁగలవని నా విశ్వాసము.”

అని తలఁచుచు వెళ్లుచుండెను. వెనువైపున నుండి వచ్చు వ్యక్తి ముందుఁ బోవుచుండు వ్యక్తియొక్క శిరమ్ముపైఁ దన చేతనుండు కఱ్ఱతో నొక దెబ్బవైచెను. ‘హా’ యని యఱచుచు దెబ్బతినిన వ్యక్తి క్రిందఁబడెను. ఇంతలోన మఱి యొక వ్యక్తి కఱ్ఱ బూనియుండు వ్యక్తికి వెనువైపుననుండివచ్చి భుజముల రెంటిం బట్టికొని. బంధించెను. బాధములనుండి తప్పించుకొనుటకావ్యక్తియుఁ బ్రయత్నించెను. ఇట్లావ్యక్తి ద్వయమును పెనఁగు లాడుచుండ దెబ్బతినిన వ్యక్తియుఁ దిన్నఁగలేచి బంధించిన వ్యక్తికిఁ దోడ్పడెను. బంధితవ్యక్తియు నీ వ్యక్తి యుగ్మమును మీఱఁజాలక తూష్ణీం భావ మవలంబించెను.

ఏడవ ప్రకరణము.

పండిత సమ్మేళనము.

వింధ్యారణ్య మనేక మృగశరణ్యమై, యత్యున్నత తరుగణ పరిశోభితమై, మునిరాజ విరాజితమై యొప్పుచుండెను. అందొక్కెడఁ బర్ణ కుటీరములనుండెడి బ్రాహ్మణు లొనర్చు వేదఘోషము శ్రవణానంద సందాయకమైయుండెను. వేఱొక వైపుఁ బర్వత గుహాలలోనుండు బౌద్ధ భిక్షువులు లోకుల నుద్ధరింప బౌద్ధమత ధర్మముల నుపదేశించుచుండిరి. మఱియొక ప్రదేశమున వాత పూరితములగు కీచకములు మురళీ నాదములు సేయుచుండ, నందున కుందగునటులఁ బికములు పాటలు బాడుచుండ, నా గానా నుగుణముగ గజములు నిజకర్ణములఁ దాళక్రియలు సల్పుచుండ, నా తాళాను సరణముగ వన మయూరములు నృత్యము చేయుచు నుండనది యొక నాటక రంగమును బోలియుండెను. కొండ చఱియలనుండి వెండితుంపరలవలె నీరు క్రిందఁ బడుచుండ నా వేగపు టొరయికచేఁ గల్గిన రేఖ నయనపర్వ మగుచు, కఠినమైనను నిర్వేగమగు శిలా ప్రదేశమునకన్నను, మృదువైనను వేగాధిక్యముగల జల ప్రపాత శక్తి యధికమగుట నిశ్శంకముగఁ దెలియనగుచుండెను. అచ్చటి గాలి యత్యంత సుఖస్పర్శమై, యలసిన వారి యంతరంగమువఱకు వ్యాపించియున్న తాపము నుపశమింపఁజేయు పటిమం గల్గియుండెను.

ఆ ప్రదేశమునఁగల తాపస కుటీరములలో నొక్కటి యించుక విశాలముగ నుండెను. అందొక, బౌద్ధ భిక్షువు

వసించుచుండెను. అతని యాకార మాతని శాంత మూర్తిత్వమును వెల్లడించుచుండెను. సర్వసంగ పరిత్యాగి యగు నా యతివరుఁడించుక దుఃఖితుఁడయ్యు నన్యుల కెఱుకపడని లాగు నఁబై పై నుదయించు వ్యసన సూచక చిహ్నములఁ గప్పిపుచ్చుచుండెను. ఆ మహాత్ముని చుట్టు ననేకులు పండితులు ఆసీనులై యుండిరి. కొందఱు వేద వేదాంగ పారగులై, యష్టాంగ యోగముల నాచరించు వాన ప్రస్థులును; కొందఱు ముక్త సంగులై, పరబ్రహ్మానుభవము సేయుచుండు పరివ్రాజకులును; కొందఱు శాంతులై, యహింసయే పరమ ధర్మముగాఁగొనిన బౌద్ధ భిక్షువులును; ఇట్లనేకులు విద్వాంసులు గుంపులు గుంపులుగ నటనుండిరి. ఆ బౌద్ధ భిక్షువును, కొందఱకు ధర్మ సంశయ నివారణము సేయుచుఁ, గొందఱితో మత ధర్మములఁ జర్చించుచుఁ, గొందఱితోడ నిష్టకథా గోష్ఠి సల్పుచు;

"పండితోత్తములార! యజ్ఞాచరణమును గుఱించి నిన్న భట్టోజీ దీక్షితుల వారానతిచ్చిన విషయమున మీరేమని సిద్ధాంతీకరించితిరి?"

సుగతుఁడు:—అహింసయే పరమధర్మమగుచుండ మనమద్దాని నంగీకరించుట తగదు.

భట్టోజీ:—వేద విహితములగు వాని వారించుట మీకెట్లు సాధ్యమగును?

సుగతుఁడు:—పశు హింసాదులం జేయుమని చెప్పు నా వేదములు మానుష కల్పితములే కాని దైవ సమ్మతములు గావు.

భట్టోజీ:—జ్యోతిష్టోమాదులు వేద విహితములు. యజ్ఞ పశు సంహరణము హింసలోఁ జేరదు. మనకు ముఖ్యప్రమాణము వేదమేయగును. ఇందు సంశయము వలదు. ఆ వేదము లపౌరుషేయములు. దాననే వేదపరిత్యాగి పతితుఁడగును. అట్టివాని సాంగత్యం మవశ్య వర్జనీయము.

జినేంద్రుఁడు:—భట్టోజీ దీక్షితుల వారి మాట మెచ్చఁదగినది కాదు. ఋగ్వేదములోని ఋక్కులఁ బరిశీలించిన వారెవ్వరును వేదము లపౌరుషేయములని వాదింపఁ జాలరు. మన శ్శుద్ధిలేక యెట్టి యజ్ఞము లాచరించినను కేవల కాయ క్లేశమునకేయగును. మన యాచరణమే మనల శిక్షింపను రక్షింపను వలంతియగుచుండ ఈశ్వరునిపై భారమువేయుట పొరబాటు. జీవ హింసాదుల వలన నివృత్తులగుటయే స్వర్గాది సాధకము. కావుననే మా వారెల్లఁ జీకటిలో భుజించిన ఎచ్చట జీవహింస కలుగునో యని సూర్యుఁ డస్తంగతుఁడు గాక మున్నే భుజించుచున్నారు. సత్కార్యము లాచరించిన స్వర్గాది సాధకలోకములం జేరఁగలఁడు. దుష్కార్యము లొనర్చినే నరకాది సప్తాధో లోకములఁ బడఁగలఁడు.

సుగతుఁడు:—వేదము లపౌరుషేయములగుట నిర్వివాదాంశము. మన యాచరణమే శిక్షణ రక్షణాదులకు వలంతి యనుటయును యథార్థముకాని సర్వము శూన్యమగుచుండ స్వర్గ నరకాదులు గలవనుట విశ్వసింపఁదగినది కాదు.

భట్టోజీ:—నా పైఁగవియుటకు మాత్రము మీరిర్వురును గలసివచ్చితిరిగాని మీలోఁగలఁ బరస్పరమత భేదముల సవరించికొనలేరు గదా!

సుగతుఁడు:— ఏ భేదమెట్లున్నను న్యాయ సమ్మతమగు దాని నెల్లరు నంగీకరింపవలయును.

భట్టోజీ:—స్వర్గాది లోకములు లేవనుట యించుకైనను న్యాయ సమ్మతములుగావు.

జినేంద్రుఁడు:—భట్టోజీ దీక్షితుల వారాడునది వాస్తవము. ఈ విషయమున వారి మాట యంగీకార్యమయగును.

సుగతుఁడు:—ఈ మీమాంసకులమాట లెన్నటికిని సమ్మఁతగవు. మన కిర్వురకును భేదముగల్పింప వీరూహించుచున్నవారు. ఈ యల్ప భేదముల మన మిటుల వాదులాడుచుండిన శత్రు పక్షము జయమందఁగలదు.

జినేంద్రుఁడు:—అట్లని యన్యాయమున కొడిగట్టుటయా?

సుగతుఁడు:—మన యిరువుర మతముల కనేకవిషయముల నైకమత్యముగలదు, ఇఁకఁ గొన్నింట నించుక భేదమున్నను వానికి నైకకంఠ్యము గల్గింప ధర్మజ్ఞులు గొందఱు దీక్ష వహించియున్నవారు. దాన నిఁక నిట్టి హింసాకృత్యములఁ దొలఁగింప మన మైక్యము గల్గి యారంభింపవలయును.

జినేంద్రుఁడు:—ఔను. మీ రాడునదియును గొంతవఱకు యథార్థమే.

భట్టోజీ:—అట్లయిన సుగతుని మాటలలోఁ గొంతభాగమే యథార్థము గాఁబోలు!

సుగతుఁడు:—సత్యాసత్య పరిజ్ఞానమున మీకు నైపుణ్యము చాలదు. ఇట్టివారితో మాటలాడుట కన్న మౌన మవలంబించుట మేలని తలఁచెదన.

భట్టోజీ:—"శేషంకోపేన పూరయేత్" అను న్యాయమును స్థాన పూర్వకముగ వెలియించుచుంటిరే!

జినేంద్రుఁడు:—సుగతుఁడు సత్యమునే వచించెను గాని కోపమునే మాత్రమును జూపలేదు. కావున మీ రిట్లాడుట తగదు.

భట్టోజీ:—నీపైఁగల యభిమానమున నేనిట్లాడినంతనే నన్నే దూషించుచుంటివిగా! ఇట్టి వానిపైఁ బ్రీతినునిచి నది నా లోపమేయగును.

సుగతుఁడు:—న్యాయ సమ్మతమగు దాని వచింపువారినెల్లరును బ్రేమింతురు. ఇంక నీ యట్టి యసూయాగ్రస్తులు ప్రేమింపకున్న నాతని కేమిలోటు?

బౌద్ధభిక్షువు:—ఆర్యులార! మీరిట్లేల యకారణ కలహము నకుఁ గాలు ద్రవ్వెదరు? ఎచ్చట ధర్మముగలదో యచ్చట జయము గల్గుట నిశ్చయము.

అని నాఁటి సమ్మేళనము చాలించి యెల్లరును వారి వారి కుటీరముల కరిగిరి.

ఎనిమిదవ ప్రకరణము.

ఆశాభంగము.

మంత్రీ! జయచంద్ర చంద్ర కేతువు లింకను రామికిఁ గారణమేమియో తెలియరాకున్నది. మన లేఖ కార్యమును కొనసాగింప నేరక వ్యర్థమైయుండునా? లేక మార్గమున వారి కేమైన నపాయము గల్గియుండునా?

మంత్రి:—శశాంక గుప్త మహారాజా! జయ చంద్రునిపరాక్రమము మనకుఁ గ్రొత్తకాదు. చంద్ర కేతుని వ్యంచనావై దగ్ధియు మన మెఱిఁగియే యున్నవారము. వారికేల యపాయము వాటిలును? మీకుఁ గల యౌత్కంఠ్య మిట్లు సంశయముల పాలుసేయుచున్నది.

శశాం:—అట్లయిన నింత కాల మాలసింపఁగత మేమని వచింతువు?

మంత్రి:—వారూరు వెడలి యొక్క వారముకదా యాయెను! ఇంతలోన మీరింత త్వరపడిననెట్లు? నేఁడో రేపో రాఁగలరు. కావునఁ గొంత యోపిక పట్టియుండిన మేలగును.

శశాం:—కార్య మెట్లగునో యను సంశయమొక్కటి దక్క వేఱుచింత లేదు.

మంత్రి:—తప్పక యనుకూలించునుగాన మీరా చింతమాని యుండనగును.

అని యిట్లు వీరు మాటలాడుచుండ సేవకుఁ డొకఁడు వచ్చి రాజునకు నమస్కరించి జయచంద్ర చంద్ర

కేతువులొక్క సవారితోడవచ్చి ద్వారము కడవేచి యుండుట విన్నవించెను.

శశాం:—సేవకా! వచ్చిన యాసవారిని నాయంతి పురమున కంపి, అతని నిటకు రమ్మని యాజ్ఞాపించితిననుము.

సేవకుఁడు:—చిత్తము.

అని యాభటుఁడరిగినంతనే శశాంక గుప్తుఁ డిట్లని తలంపఁజొచ్చెను.

"ఇప్పుడుకదా నే నదృష్టవంతుఁడను! మాళవాధిపతికి నసాధ్యమగు కార్యమును ఏకష్టమును లేక యవలీలఁగా సాధింపఁ గలిగితిని. హర్షవర్ధన ముద్రాంకితమగు నాలేఖాసృష్టి సార్థకమయ్యెను. ఇది మొదలు నా కదృష్టము పట్టినది. కావున రాజ్యవర్ధనుని సంహరించినట్లు హర్షునిఁగూడ నశింపఁ జేసినచో స్థానేశ్వర కన్యాకుబ్జ రాజ్యములు రెండును అస్మద్వశ గతములగును. అభర్తృకమగు మాళవ రాజ్యమును నా యధీనమయగును. అంత నగతికయగు రాజ్యశ్రీ నన్నుఁ బరి గ్రహింపగలదు."

అని యిట్లు తలఁచుచు నానంద పరవశుఁడై యుండునా శశాంక గుప్తుని మ్రోల జయచంద్ర చంద్ర కేతువులు వచ్చి నిలచిరి. వచ్చిన వారాతనికి నమస్కరించిరి. రాజును వారల నుచితాసనముల నాసీనులం జేసి;

శశాం:—జయచంద్రా! ఇంతటి కాల యాపనకుఁ గారణ మేమి?

జయ:—వట్టిమాటలకును గార్య సాధనమునకును జాలయంత రముగల దనుట మున్నే యాడియుంటినిగాదె!

శశాం:—అట్లయిన మన భీముఁడు వ్యర్థుఁడని నీ మతము గాఁబోలు!

జయ:—అయ్యదినేఁ జెప్పనక్కఱలేకయే దేవర వారికి విశదమయియుండునుగాదె!

శశాం:—హర్షునియొద్ద నమ్మిన బంటువలెనుండి యాతని యెఱుకలేక యీ ముద్రాంకిత పత్రికను సంపాదింపకున్న నీ కార్యమెట్లు కొనసాగియుండఁగలదు?

చంద్ర:—విశ్వసించినవారిని మోసపుచ్చుట యొక గొప్ప కార్యముకాదు. నూతన స్థలమునకేఁగి, యచ్చటి జనుల మనస్థితులిట్టివని యెఱుఁగరానప్పుడు, వారి వశము గావించికొని, మనయం దత్యంతద్వేషము గల్గియుండు నొక వనితను; దానికిష్టములేని కార్యమునం బ్రవర్తింపఁజేయ నిట్లుబహిరంగముగాఁ దెచ్చుట సులభమాయనుట దేవరవా రాలోచించినచోఁ దేటఁబడఁగలదు. అంతటి కార్యమును సాధించిన నాకీలేఖ లేకుండిన నేమిలోటు? అప్పటి కుచిత మగురీతిం బ్రవర్తించి యుందునుగాని యూరక మరలుదునే?

శశాం:—సరిసరి. ఇప్పుడా ప్రసంగములతోఁ బనియేమి? ఎట్లో కార్యము కొనసాగించికొని వచ్చినందునకు సంతసించితిని. నీ యీ యుపకృతిని నేనెన్నటికిని మఱవను.

అని యంతనప్పటి రాజకీయ వ్యవహారముల నంతయు మంత్రిని విచారించవలసినట్లానతిచ్చి వెంటనే యంతఃపురమునకేఁగెను. పోవునప్పుడు తన కత్యంత ప్రీతిపాత్రుఁడై యవసరము గల్గినప్పు డంతఃపురమునకు వచ్చుచుండు నీ జయ

చంద్రునిఁగూడఁ దన వెంటం బిలిచికొని వెళ్లెను. అంతిపురమునందలి పరిచారికల మూలమున నూత్నముగ వచ్చిన యామె విడిదిం దెలిసికొని యటకేఁగెను. జయచంద్రుఁడు మాత్ర మీవల నిలచియుండెను. లోనం బ్రవేశించిన రాజును దన మ్రోల నవనతముఖియై నిలచియుండు నా నారీరత్నముం గాంచి చిత్ర ప్రతిమంబోలె నిశ్చేష్టితుఁడాయెను. ఆతని మానసము మాత్ర మామెతో ననుభవించవలసిన సుఖవిధానముల నెల్ల నెన్నుచుండెను. ఇట్లాకాశ హర్మ్యంబుల నిర్మించుచుండు నాతని చిత్తమున నొక్కెడ భీతియు, నొక్కవైపునఁ బ్రీతియుఁ గలుగుచుండెను. అప్పుడాతఁ డీతీరునఁ జింతింపఁ దొడఁగెను.

"ఇట్టి నారీరత్నమును సృష్టించిన యాధాత కౌశలమేమన వచ్చును? కాకి ముక్కునకు దొండపండా యను నట్లీమోహనాంగిని ఆగ్రహవర్మ కొసఁగిన ప్రభాకర వర్ధనుఁ డెంతయు మూఢుఁడుగాక తెలివిగలవాఁడా! ఇట్టి సుందరితోడ నానందిప నా యట్టివానికింగదా తగును? కావుననే దైవమిట్లనుకూలించెను.

ఒక్కవేళ చేతి కందినది నోటి కందకుండునో! హర్షవర్ధనుని గడతేర్చువఱకీమె యబ్బియు లేనట్లే తలంపవలయును. వానిం జంపుట యంత సులభముకాదు. వంచించి చంపుదమన్నను మాయల నారి తేటిన యాతఁడంత చులకనగా లోఁబడఁడు. ఇంతకు వానిం దలఁచునప్పుడే యంగములు వడఁకుచున్నయవి. అయినను ఈ నారీ శిరోమణిం గాంచినదాదిగ నా మనసేమో యుత్సాహ పరిపూరితమగుచున్నది. అదిగో యిట్టి హర్షవర్ధనుల వేయుమందినైనం బరిమార్పఁగల

యంతటి బలమునిచ్చుచున్నది. ఈ సమయమున నాతఁడు వచ్చిన నొక్క ముష్టిఘాతముతోడనె వాని యమసదనమున కంపఁగలను. నిక్కముగ నేనంతటి వాఁడనగాని యో శూరవనిత యగు నీవిక నన్నెట్లువలచును ?

అయినను బరమ సాధ్వీమతల్లియగు నీమె యెడ నిట్టి కార్య మాచరింపఁదగునా? అట్లని, చాలింతమన్నను ఆమె సౌందర్య మత్కార్యమునకు నన్నుఁ దఁబఱచుట లేదు. ఆఁ! ఆఁ! ఇది తగదు. తగదు. ఈబిడతోడ నా యపరాధముల విస్మరించి అట్టి యకార్యాచరణమునకుఁ గారణ మీ రాజ్య మదమే కావున దాని నీను కర్పించి సేనడవుల పాలై తప మాచరించుచుందును. ఇదియే యుచితమగును.

ఇసీ! ఇదియేమి విపరీత బుద్ధి! సర్వ సుఖముల ననుభవింప వీఁడనన్ను బ్రేరేపించుచుండ నేనేల యిట్టులఁ దలఁప వలయును? ఈమెం బరిగ్రహించి పరమానందము నందెదను."

రాజ్యత్రయములకును రాజై చక్రవర్తి బిరుదము ధరించి యఖండైశ్వర్యములకధిపతుఁడఁగ వలయుఁగాని యేల యీ నీచపు టాలోచన"

అని తన మది నిట్లొక తీరునకుఁ దెచ్చికొని యాయింతిం జూచి.

శశాం:—వనితామణీ! నా సేనలు మార్గమున నీకెట్టి యిక్కట్టును గల్గనీక జాగ్రత్తగాఁ గొనివచ్చెనా?

స్త్రీ:—ధైర్య సహాయనైన నను గాపాడికొనుట కొరుల సాయము గోరుదానఁగాను.

అంకము.

శశాం:—బాలికా రత్నమా! నీవు [illegible] వని తలంతు.

స్త్రీ:—మాటలలో నను టచే జేతలలో నను [illegible] చితివే! ఓహో! మాయా [illegible] జంపునంతటి సామర్థ్యము నాకు [illegible] చుంటివి కాంబోలు!

శశాం:—కాంతా! నీ జాణ తన మే [illegible] . ని బాధ విముక్తి యొనరించి నిర్బంధము [illegible] నీ వెంతయుఁ గృతజ్ఞురాలవు గా [illegible].

స్త్రీ:—మాయజాబు నంపినందున [illegible] కృతజ్ఞురాల [illegible]?

శశాం:—అది మాయ జాబెట్లగును.

స్త్రీ:—ఔ నౌను. అది మాయజాబు కా [illegible]! మాయా [illegible] కితమగు జాబు.

శశాం:—అది మాయా ముద్రాంకితము [illegible] జెప్పుచున్నాను. ఇది సత్యము.

స్త్రీ:—ఒకని యెఱుక లేకుండ వాని ముద్రచే [illegible] జాబు బయల్పడుట మాయ గాకున్న మఱేమగును?

శశాం:—నేనట్టి నీచపు బని సేయలేను. అది నీయన్నచే వ్రాయఁబడిన పత్రికయే యగును.

స్త్రీ:—నీ కన్న నాకన్న యెరుఁగుగలఁడా?

శశాం:—నినుఁ బ్రేమించినవారుఁ [illegible] గా?

స్త్రీ:—అన్నకు సోదరిపైఁ బ్రేమ లేకుండు [illegible]

శశాం:—సరిసరి. అది యటుండనిమ్ము. నీ యగ్రజు నొద్ద నుండి యీ పత్రికను రప్పింప నే నెంతటి కష్టము నొందితినోయనుటం దెలియక నీవిట్లాడుటయుచితముగాదు.

స్త్రీ:—నాకగ్రజుండే లేఁడు.

శశాం:—హర్షవర్ధనుఁడు నీ యన్నకదా!

స్త్రీ

శశాం:—రాజ్యశ్రీ! నీ పలుకు నాకు విస్మయము గల్గించుచున్నది.

స్త్రీ:—రాజ్యశ్రీకి హర్షవర్ధనుఁడన్నయైన నాకేమి సంబంధము కలదు?

శశాం:—నీవు నిక్కముగ రాజ్యశ్రీవి గావా!

స్త్రీ:—నేను నిక్కముగ రాజ్యశ్రీనిగాను.

శశాం:—అయిన నీవెవ్వతెవు?

స్త్రీ:—మాయ రాజ్యశ్రీ నగుదును.

శశాం:—నీ మాటలు నాకర్థమగుటలేదు.

స్త్రీ:—మాయ జాబుం బంపినందునకు మాయ రాజ్యశ్రీ నీ యింటం దిగఁబడెను. ఇప్పుడైన నీ కర్థమగుచున్నదే!

శశాం:—అట్లయిన నీ వెవ్వతెవు?

స్త్రీ:—నే నెవ్వతెనని తెలిసికొంటివి.

శశాం:—నీవు రాజ్యశ్రీయని తెలిసి కొంటిని.

స్త్రీ:—అట్లయిన సరియే!

శశాం:—నీవింతకు మున్ను రాజ్యశ్రీ కానని వచియించి యుంటివికదా !

స్త్రీ:—చెప్పియుంటిని.

శశాం:—మరల నాదానని యెట్లంటివి?

స్త్రీ:—అభిప్రాయ భేదముచే నట్లాడవలసివచ్చెను.

శశాం:—అదెట్లు?

స్త్రీ:—నీ యభిప్రాయము చొప్పున రాజ్యశ్రీ నగుటయు నాయభిప్రాయమున నటులఁ గాకుండుటయుం గల్గుటచే నటంటిని.

శశాం:—నిక్కముగ నీ వెవ్వతెవో తెలుపుము.

స్త్రీ:—నేఁ జెప్పినను నను నీవు తెలిసికొనలేవు.

శశాం:—నే నేల తెలిసికొనలేను.

స్త్రీ:—అట్లు తెలిసికొను వాఁడవైనచో నేఁజెప్పకయె తెలిసికొని యుందువు.

శశాం!—నీవింకనిట్లే పల్కుచుండినచో నిను గారాగారమున నునిచి నిర్బంధింతును.

స్త్రీ:—నీ యీ మాటలకేను బెదరుదానను గాను. నీ వీటికి వచ్చునప్పుడే యన్నిఁటికిని సాహసించియుంటిని.

శశాం:—నిను వేఁడికొనుచున్న వాఁడనుగాన నిక్కము వచింపుము.

స్త్రీ:—సరి. ఇంకఁ జెప్పెద వినుము. నేను రాజ్యశ్రీకిం బరిచారికయగు మంగలికయనుదానను

శశాం:—నీవిట కెట్లు వచ్చితివి?

మంగ:—నే వచ్చిన విధము నను గొనివచ్చిన వారి నడుగుము.

శశాం:—రాజ్యశ్రీ యేమాయెను?

మంగ:—అది నాకును దెలియదు.

అని యీమాటలాలకించిన శశాంకగుప్తునకు రాజ్యశ్రీ చిక్కకపోయెకదా యని వ్యసన ముదయించెను. బాబు చెప్పిన నాటినుండి చిక్కవలసి యుండె మంగలిక, యెట్లు వచ్చెనని యాశ్చర్యము గలిగెను. జయచంద్ర చంద్ర కేతులిది తెలిసియుఁ దనకేల చెప్పకుండుటచే క్రోధమతిశయించెను. ఇంక హర్షవర్ధనుఁడు దన్నేమిసేయునో యని భయముత్పన్నమాయెను. ఇట్లు విషాద విస్మయరోష భయములు పెక్కుమ్మడి నుదయించుటచే నేమి సేయుటకుఁ దోఁచక స్తబ్ధుఁడై కొంతవడి నిలుచుండెను. ఆవల నటనుండి వెడలివచ్చెను. వచ్చువాఁడచ్చట అట్లు ఆశాభంగము గలుగుటచే చింతలపాలై జయచంద్రుఁడాగాంచెను. వాని జూచిన తనే విషాద విస్మయ భయములు బోవుటచేఁ గోపమొక్కటియే శేషించి యుండెను. నేత్రములెఱ్ఱవాఱెను. అప్పుడున్న శశాంకగుప్తు నాకారమును జూచినంత మాత్రముననే జయచంద్రుని గుండియలు ఝల్లుమనియెను. జరిగినదంతయు వచింపక దాఁచి నందునకుఁ బశ్చాత్తప్తుఁడయ్యెను. తన యవివేకమున కెంతయుఁ జింతిలెను. రాజును నిజభటులంజూచి జయచంద్ర చంద్రకేతువులఁ బాధించి యాస్థానమునకుం గొనిరమ్మని యాజ్ఞాపించెను. మంగలికం గూడఁ గారాగృహమున నుంచ సెలవొసంగెను. తానును జయచంద్ర చంద్రకేతువుల విచారింప నెంచి యాస్థానమండపమునకు వెళ్లెను.

తొమ్మిదవ ప్రకరణము.

కుమారుఁడు.

బాల సూర్యుఁడు దన కిరణముల నచ్చటచ్చటఁ గ్రమ్మఁ జేయుచు మంచును విదళింపఁజొచ్చెను. శీత బాధకు వెఱచి తలలు బైలు వెట్టకుండిన ప్రాణివర్గ మప్పుడప్పుడే బయలు వెడలుటకు సాహసించెను. గట్టుల నొరయుచుఁ బ్రవహించుచున్న గంగా తరంగిణీ వేగాతిశయమునకు భీతిలిన బకములు జల స్తంభన విద్యానిపుణులం బోలె నెయ్యెల్ల నీట నొకవైపునను యుండి, ప్రాతఃకాలమున బైలు వెడలి, యల్పునైశ్వర్యంబు భాతి త్రుళ్లిపడుచుండు మత్స్యముల గ్రహించి నించుక ధైర్యమూనియు శీతబాధకు జంకి వెనుదీయుచుండెను. ప్రాంతారణ్యవాసులగు చెంచు కుఱ్ఱలు కొందఱిప్పుడే కట్టెలు దేర నరుగుచుండిరి. ఆతరుణమున గంగాప్రాంత ప్రదేశమునఁ గొన్నిచోట కుటీరము లమరియుండెను. అందొక్క శిబిరమున హర్షవర్ధనుఁడును, కుమారుఁడును, భండియు నాసనోపవిష్టులై యుండిరి.

హర్ష:—కుమారా! నీచేసిన గ ...యునకే నేంటియు నలరి నాఁడను. నీయంపిన శ్వేతచ్ఛత్రము నిన్నెప్పుడును మఱపునకు రానీదు.

కుమా:—మిత్రమా! నాచేసిన దల్పమైననుదానిఁ గొండంతగా భావించి నీవిట్లు పొగడుటకునే మిగుల లజ్జితుఁడనగుచున్నాను. వంగదేశాధీశునకును నీకును యుద్ధము

దిటస్థింపఁ బోవునటులవిన్నాను. ఇందు నా సైన్యసహా
యము కొంతచేసి సంతుష్టిఁ బొందనెంచుచున్నాను.
నా వేఁడికోలున నీటఁబుచ్చవని నమ్మియున్నాఁడను.

హర్ష:—నాకుండునట్టి సేనలే యమితములగుటచే ఆవిషయమున
నీసాయ మనవసరముఁడను. ఇంక వేఱొక విషయమున
నీ తోడ్పాటు మిక్కిలి యావశ్యకమగుచున్నది.

కుమా:—ఏలాగుననైనను నీకుఁ దోడ్పడవలసిన దనుటయే
నాకోర్కి. కాఁబట్టి యది యెట్టిదియో యెఱిఁగించినచో
నేనాచరింప సంసిద్ధుఁడను.

హర్ష:—శత్రువు లెప్పుడును మూషికముల భంగి రంధ్రాన్వే
షులు. కావున నానీచ శశాంక గుప్తుఁడు నేనూరలేని
తఱి నిదియేయదనని యెంచి తనవారి మూలమునఁ
గుట్ర లేవే నాచరింప నోపును. ప్రజలెల్లరు రాజభక్తి
పూరితులేయైనను "నబోధ నాత్పరాశక్తిః" అను
నటుల దుర్బోధనలఁ గావించి యేరినేఁ దనవశము
గావించికొని యేమైన నకార్యము నాచరింప గడంగునో
యని యించుక సంశయించుచున్నాను. కావున నీవ
చ్చటి కరిగి యట్టి వెవ్వేనుండిన వాని నణఁఁప వలయు
నని కోరుచున్నాఁడను. భండితోడం గూడి నేనేఁగి
యానీచుం బరిమార్చెదను.

కుమా:—ఆజ్ఞా ప్రతీక్షసగు నన్నింత వేఁడికొన వలయునే?
నీయిచ్ఛకు మాఱాడువా రిచట నేరుగలరు? అటులే
గావించెదను.

అని యిట్లువీరు మాటలాడు చుండఁగఁ గన్యాకుబ్జమున నుండి యొకట్లుఁ డరుదెంచెను. వచ్చిన వాఁడు హర్షునకు సమస్కరించి యిట్లనెను.

"దేవా! తావక ముద్రాంకితమగు నొకలేఖఁ గొని వచ్చి శశాంక గుప్త ననుచరు లిర్వురు రాజ్య శ్రీదేవిగారిని చెఱనుండి తప్పించిరి. అంత వైదేశికుండొకఁడు దైవ బలమను కూలమగుటచే నిది మాయా లేఖయని తెలిసికొని యతనికిఁ బరిచిత పూర్వయగు రాజాంతః పుర పరిచారికయగు మంగలిక యను నాబిడ కెఱిఁగించెను. ఆమెయు యుక్తిచే దేవిగారిని శశాంక గుప్తుని పాలుగాకుండ రక్షించెను. ఈవిషయము దేవరవారి కెఱుకపఱచ వలసినట్లు ఆవైదేశికుఁడు నను బంపుటచే నేనిట కరుగుదెంచితిని."

హర్ష:—ఆవైదేశికుఁడెవ్వఁడో నీకుఁ దెలియునా?

"నాకును వానికిని భేదము లేదు."

హర్ష:—ఓయకారణ మిత్రమా! నీమాటల యర్థమును గ్రహించితిని. ఇంక నీయునికి మ్మనుకులం దెల్పి నాయుత్కంఠను తగ్గింపుము.

"అట్లే తెలిపెద వినుఁడు, ""ఆర్యా! ఉజ్జయినీనగరవాసియగు గాలవుఁడను బ్రాహ్మణుఁడను. మాళవ నాథుని కపటము కీర్తిశేషుఁడైన గృహవర్మ మహారాజునకు నెఱింగింప నేతెంచినవాఁడ. మార్గ మధ్యమునఁ జోరులకుఁ జిక్కుటచే నట్టి సత్కార్యముం జేయనోచి కొనక పోతిని. ఆ తస్కరులు నా ప్రాణముల నిజదేవత కుంబలి యీ నుంకించుచుండు తఱి ఈమహానుభావుఁడు

భండినను రక్షించుటచే ఈమాత్రమైనఁ జేయఁగలితి. ఆహా ! ఈతని యద్భుత శౌర్యము వాచామగోచరము."

హర్ష:—బావా! నీవొనర్చిన చోర సంహారముం దెల్పితివి కాని యీయార్తరక్షణ మహాకార్యముం జెప్పవైతివి. అయ్యది స్వోత్కర్ష ప్రకటనరూప మని యెంచితివి కాఁబోలు! ఆహా! నీశీలముం గన్న నాకెంతయు నానందము గల్గుచున్నది!

కుమా:—రాజభక్తి పరాయణత్వమునకుఁ దోడుగ నీవినయము నబ్బియుండుట బంగరు పూవునకుఁ దావి యబ్బినట్లగుచున్నది.

భండి:—రాజేంద్రా! మీమెప్పువడయఁ జాలునంతటి పని నేనేమియు నాచరించిన వాఁడనుఁ గాను. ఇది సామాన్యమగునదనియే నే నెంచెదను.

గాల:—ఆతరుణమున స్నేహితుఁడు రాని యెడల వారి దేవతకు నేఁబలి గావలసి యుండును. ఈమహామహుని మూలముననే గృహవర్మ మరణించుటయు రాజ్యశ్రీ చెఱ నుండుటయుఁ దెలిసెను. అంత విషాదము సెంది యెట్లైన నామెను జెఱనుండి తప్పింప నెంచి కన్యాకుబ్జమునకుఁ బోవుచుంటిని. మార్గ మధ్యమున నిర్వురు యువకులొక మఱ్ఱినీడం గూర్చుండి రహస్యాలాపములు సేయుచుండిరి. ఇంచుక దూరమున నుండు పొదయందుండిన నే నది యాలించితిని. దాని శశాంక

గుప్తుఁడు భవన్ముద్రాంకితమగు పత్రికఁ గల్పించి, తన్మూలమున నాతమ్ముని జెఱనుండి విడిపించి గౌడ నగరమునకు రప్పించికొన నెంచి నటుల విశదమయ్యెను. అంతట మాయూరిదియు రాజాంతఃపుర పరిచారికయు నగు మంగలిక కీయుదంతము చెప్పితిని. ఆమెయు రాణి నాపదనుండి తప్పించునట్లు చెప్పెను. మఱునాఁటి యుదయమున మంగలిక యునికి పట్టున కేఁగి చూడఁగ నామె లేకుండెను. రాజ్యశ్రీదేవిగారును చెఱనుండి తప్పించికొనిరనియుఁ దెలిసెను. పత్రికా విషయమై సంశయించు సభాసదులకే నీవిషయముం దెల్పితిని. వారియనుమతిచే దేవరవారి కీవృత్తాంతము నివేదింప నిటకుఁ బనివిటిని. దేవిగారు మాత్ర మెచ్చటనో దాఁగి యున్నవారని తోఁచెడిని.

హర్ష:—నీచేసిన యీ రాజకార్యోపకృతికి నేనెంతయు సంతసించితిని. ఇట్టి రాజభక్తియుక్తుఁడు చిక్కుట యరుదగుటచే నోయీ! గాలవా! నీవెప్పుడును నాయొద్దనే యుండుము. నాయాంతరంగికులలో నొక్కఁడుగ నిన్నేర్పఱచితిని. భండీ! కుమారా! మీరును నాయిచ్ఛను గొనసాగింపుఁడు. నేనును గతిపయ పరివార సహితుఁడనై కన్యాకుబ్జమున కేగి నాసోదరి నన్వేషించెదను.

భండి:—దేవా! దేవరవా రల్పపరివారములతో నరుగుట సరియగునా?

హర్ష:—నీకావిషయమున సంశయమక్కఱలేదు. నేనత్యంతము జాగరూకుఁడనై యుండెదను. కావున నావిషయమున సంశయమునందక నాకోర్కె నెఱవేర్పుము.

భండి:—చిత్తము. అట్లే కావించెదను.

హర్ష:—కుమారా! నీవును నామైత్రిం బాటించి నామాట చొప్పున నాచరింపుము.

అని నాఁటి సభ చాలించి యాసనమునుండి దిగి స్నానాదులం గావింప నేఁగెను. తక్కినవారును వారివారి శిబిరములకు వెడలిరి.

పదియవ ప్రకరణము.

కలిశకేతు.

ఓరీ! నీచా! జయచంద్రఘాతకా!. నిన్నింత నమ్మి యుండినందున కిది యా ప్రతిఫలము; నీ కే నొనర్చిన యుపకారములకిట్టి ప్రత్యుపకారమా చేయుట! ప్రబలైశ్వర్యముల నిచ్చి, పరమాప్తుఁడవని భావించి, ప్రకృష్ట పదవుల నొసంగిన నాయెడనే యిట్టియకార్యము లాచరింపఁ గడఁగినవాఁడ వింక సామాన్యుల యెడ నెట్టి యకార్యములు సల్పకుందువు. నీ యట్టివాని మననిచ్చుటకన్నను ప్రాణములం దీయుట సరియగును. తాఁ జెడ్డ కోఁతి వనమెల్లఁ జెఱిచె. నన్నట్లు నీవు చెడుట గాక చంద్ర కేతునింగూడఁ జెడఁగొట్టితివి కాదె!

ఇంతవఱకును చంద్ర కేతునివలెఁ సాధువై, విశ్వాస పాత్రుఁడగు బంటుడవని తలఁచియుంటిని. తుదకు నమ్మిన వానినే మోసపుచ్చెఁగదా! ఇట్టి విశ్వాసఘాతుకు నూరక విడుచుట పాడిగాదు. ఇంతకును, ఈ విషయమెఱుక పడినంతన మంత్రులు వీరింగడ తేర్ప నాజ్ఞాప్రతీక్షు లగుచురు. దాన నీసభ యందు వారి కించుక వాక్సహాయము సేయువాఁడును జిక్కఁడు. రాజ సభ నీశ్వరుఁడెల్లపుడు నుండుఁ గావున నాతఁడు అన్యాయాచరణమునకుం గడఁగిన వీరి యెడ నేరికిని బక్షపాత బుద్ధిం గల్పింపకుండును గాదె! అట్లయిన నా యొనర్పంబూనిన రాజ్యశ్రీ దేవ్యపహరణమును న్యాయరహితమగున దేకదా! ఆ విషయమునను ఈ సభలోనివారి కాగ్రహము జనింపకుండునే? ఊఁ. అదెట్లు? క్షత్రియున కరాతి నిధనమున్ను అరి ధనాహరణ

మును జేయఁదగినవి. స్త్రీలును జంగమములగు సొత్తులలోఁ జేరినవారు. కాన నా యుపహారము న్యాయసమ్మతము. ఇది నిశ్చయము.

అయినను ఇందు జయచంద్రునిది దోషమనియుఁ జంద్రకేతుఁడు ఆతని మాటలకు లోఁబడవలసిన వాఁడగుటచే వానియందు దోషముండదనియును దోఁచుచున్నది. అట్లని చంద్రకేతువు నిర్దోషియనుటయు సరికాదు. ప్రధానుఁడగు జయచంద్రునందు దోషము పూర్ణముగనుండినను, ఇది యసత్యమని తెలిసియు, వీఁ డూరకున్నందున నీతనిపైనను ఇంచుక దోషము కలదు. కావున నిర్దోషియను టెట్లు? ఇఁక నా మంగలిక నేమి సేయనగును?

ఔరా! ఏమి యీ మంగలిక యొక్క సౌందర్యము! పరిచారికయే యింతటి రూపవతిగానున్న ఇఁక దీని యజమానురాలెట్టి సౌందర్య రాశిగ నుండవలయును? అట్టి నారీలలామం బొందకుండు నాజన్మమెందులకు? ఉనికి మనుకులు తెలియనప్పుడు నే నామె నెట్లు పొందఁగలను? ఇట్టి దుర్ఘటమగు కోర్కెం గోరి చేయిఁ జిక్కినదాని విడుతునా? కరస్థమగు నుదకమును పరిహరించి ఘనస్థమగు దాని వాంఛించునంతటి వెఱ్ఱియునగుదునే! ఇఁక నీమెను మాత్ర మేనెట్లు దక్కించికొందును? సామమునకు సరివడునదికాదు. కనకమునకుఁ గామించునదికాదు. బెదరున కదరునదికాదు. దండమునకు జడియునదికాదు. ఇంక దేన దీని లోఁబఱచికొననగును?——సరి. కడకంత్యోపాయమే యుత్కృష్టమగునది.

అయ్యో! కుసుమ కోమలియగు నీ యన్నుల మిన్న యేడ? ఘోరమగు రాజదండనమేడ? పుష్పశాలలో నగ్నినిడు నట్లిట్టి యక్కటికమున కొడిగట్టుటయా? నే నీ యకార్య మాచరింపఁజాల—అట్లని యపరాధము చేసిన వారి దండింపక విడుట దోషముకదా! "అదండ్యుల దండించినను దండ్యుల దండింపకపోయినను రాజపయశమునందుటయ కాక నిరయమునుగూడ పొందఁగలఁ"డని శాస్త్రములు ఘోషించుచున్నవి. దోషుల శిక్షింపకున్న ప్రజలలో దోషాచరణ మెక్కుడగును. "రాజా రాష్ట్రకృతంపాప" అనునట్లా దోషము నన్నుకదా సంక్రమించును!"

అని యిటుల గౌడనగరమున రాజసభలో శశాంక గుప్తుఁడు సింహాసనమునుండి యాలోచించుచుండెను. ఈతని మోమున నప్పటి భావముల మార్పు గోచరించుచుండెను. ఇది గాంచిన యచ్చటి యధికారివర్గమీతని మనశ్చాంచల్యమునకు నప్పుడయించినను లోన నడఁచికొనిరి. ఆకార గుప్తిం జేయఁజాలని వీఁడు నొక ధీరుఁడే యని యెంచికొనిరి. అప్పు డచ్చటి సామాజికులును;

"ఆహా! పెద్దల దినములనుండియును ప్రజలతో నేకీభవించియుండిన యీ రాజకుటుంబమునఁ జనించిన వీని కిట్టి నీచ బుద్ధి యుదయించెనుగా! తన పూర్వుల పేరుఁ జెఱుపుచుఁ, పరమ సాధ్వియని భయమందక, పరకాంతయని పాటింపక, యగతికయని యక్కటికములేక రాజ్యశ్రీదేవి నపహరింపఁ దలఁచెఁగదా" యని కొందఱును, "వీఁడెంత యన్యాయ మాచ

రింప సమకట్టినను దైవమున కిది ఆ యసమ్మతమగుటచే ఆ కార్యము కొనసాగలేదు. దీననే దేవుఁడొకఁడు గలఁడనుట మన మూహించికొనవచ్చును. ఈ నీచుఁ డేవేవో తలఁచికొని ఆకాశ హర్మ్యములను నిర్మించికొనుచుండెను. తుట్ట తుదకు మంగళికయను పరిచారికయేకదా వీనికిఁ జిక్కెను! దాసి యగుట వీఁడామె విడిచి పుచ్చనోపు"నని కొందఱును "నీతి విదూరుఁడగు వీఁడు, ఇది రాజకాంత, ఇది పరిచారికయని భేదము పాటించునే! రాజు మెచ్చినది రంభయన్నటుల మోహాంధకార మగ్నుఁడగు వీని కంటికిఁ గానవచ్చిన వారెల్ల సౌందర్య ఖనులేయగుదురు. కావున నామె మాత్రము వీని బారినుండి తప్పునొట్టు"లని కొందఱును, "రాజ్యశ్రీ విషయమున మేలుసేసిన దైవమిప్పుడు మాత్ర మెచ్చటికిఁబోయె? ఈమెయు నెట్లే నీ యాపదనుండి తప్పఁగలదని తోఁచెడి" నని కొందఱును, ఇట్లు రాజున కెఱుక పడకుండు లాగున గుసగుసలాడఁ జొచ్చిరి. కొందఱు మాత్రము "ఎగువఁదీసిన బ్రహ్మహత్య, దిగువఁదీసిన శిశుహత్య, యన్నట్లు మనమిం దెద్దియును బలుకుటకు వీలులే"దనియు, మఱికొంద"ఱుడుమున కూరిలోని పెత్తనమేల, యన్నటుల మనకేల యీ యధిక ప్రసంగ"మనియు నెంచికొనిరి.

సేవ:—దేవర వారి యనుమతి చొప్పున జయచంద్ర చంద్రకేతువులం దోడ్కొనివచ్చి రాజభటులు ద్వారము కడ వేచియున్న వారలు. ఆనతియైనచోఁ బంపఁగలము.

శశాం:—వారి నిటకుఁ బంపుము.

సేవ:—చిత్తము.

అంత నా సేవకుఁడు వారిని లోనికంపెను. భటుల వెంట నరుదెంచిన యా జయచంద్ర చంద్ర కేతువులును రాజునకు సమస్కరించి తలలు వంచికొని నిలచియుండిరి. శశాంక గుప్తుఁడును వారింజూచి.

శశాం:—జయచంద్రా! మిత్రద్రోహి యెట్టి దండనకుఁ బాత్రుఁడో నీ వెఱుఁగుదువా?

జయ:—శిరచ్ఛేదనమునకు పాత్రుఁడగునని తోఁచెడిని.

శశాం:—దానికిం దోడుగ రాజద్రోహమును, అసత్య ప్రవర్తనమును నున్న ఆదండన చాలునదికాదు. కావున నట్టి వానికిం జిత్రవధ యుచితమగునదని నామతము.

జయ:—దేవా! దేవర వారి కెదురాడునంతటి శక్తి యుక్తుఁడను గాను. అయినను నాదగు నొక చిన్న విన్నపమును మాత్రమాలకించ వేఁడికొనియెదను.

శశాం:—అదెట్టిదియో తెలుపుము.

జయ:—నాఁడట్లు భవదాజ్ఞం గైకొని కన్యాకుబ్జమున కేఁగి దేవిగారిని బంధవిముక్తం గావించి యామెతోడ మాటలాడుచు వచ్చుచుంటిమి. మిక్కిలి జాగరూకులమై యామెకు సంశయము గలుగకుండ లాగుననుండియు ఆమె యెట్లో మాపై నించుక సంశయించెను గాని యట్లు దాను సందేహించినట్లు వెలికిఁ దోఁచనీక మమ్మత్యంతము విశ్వసించిన ట్లభినయించెను. దానమేమును ఆమెపై నొకింత అశ్రద్ధ కలిగియుంటిమి. అదియేయదనని ఆబిడ కాలికి బుద్ధి సెప్పెను. మేము అమె వెన్నంటియే పర్వులిడుచుంటిమి. చంద్ర కేతువు

మాత్రము కొంచెము వెనుకఁబడెను. గాఢాంధకార బంధురమగు నానిశీథమున ఆ యూరంగల సందు గొందులనెల్ల ఆమె మముద్రిప్పి యలయించి తానెచ్చటనో మఱుఁగువడెను.

శశాం:—ఒక్క యబలం బట్టలేని వాఁడవా నాఁడు మహాపురుషునిం బోలె నన్ని ప్రగల్భములం బలికితివి! కఱువ నేరని కుక్కకు మొఱుగులు మెండనుట అనుష్ఠాన పూర్వముగఁ జూపితివి. బాగు బాగు! నీ శౌర్యము మెచ్చఁ దగినదియే.

చంద్ర:—మేమును ఆ యూరికిం గ్రొత్తవారము. అందును అది యర్ధరాత్రము. అట్టుండ మే మేమిసేయఁ గలమో మీరే యాలోచించుఁడు.

శశాం:—నిక్కమగు శూరునకుఁ గ్రొత్తయూరని యొకటి కలదా! ఇంతకును ఈయతి జాగరూకుఁడుగ నా ఆమె ననుసరించుచుండిన వాఁడు.

జయ:—అంధకార బంధురమగు నా యర్ధరాత్రమున నెట్టి వారైన నేమిసేయఁగలరు? అప్పటి నా స్థానమున నుండి యాలోచించినచో దేవరవారికి అది విశదము కాఁగలదు.

శశాం:—సరి. ఆవలి యుదంతముం దెల్పుము.

జయ:—నే నిట్లగుటకుఁ జింతిలుచుండ వెనువైపుననుండి యరుదెంచిన యొకవనిత తన చేతికఱ్ఱతో నా శిరమున బలముగ మోదెను. నేనును ఆ దెబ్బకాఁగఁ జాలక క్రిందఁబడితిని.

శశాం:—ఒక్క యబలచే దెబ్బలు తినిన పరాక్రమశాలివా?
ఆహా! ఎంతటి పౌరుషము!

జయ:—అధిక్షేపవచనము లాడుటకేమి లెంపు—ఏమఱుపాటుననున్నపు డెంత వారికైన సులభముగా భంగము కల్గించవచ్చును. దాననీచుల కాధిక్యము రాఁబోదు. గొప్పవారికి లోటు కలుగఁబోదు.

ఈ మాటలాలకించిన శశాంకగుప్తునకుఁ దా నాచరించిన రాజ్యవర్ధన సంహారము జ్ఞప్తికివచ్చెను. జయచంద్రుఁడును అది కారణముగాఁ జేసికొనియే తన్నిట్లధిక్షేపించుచున్నవాఁడేమోయని సంశయించెను కాని మహారాజగు తన్నిట్లాతఁడు నిందింప సాహసింపఁడని యోచించెను. ఘుణాక్షర న్యాయమున ఈ వాక్యము లీతని నోటినుండి వచ్చినవని భావించెను.

శశాం:—ఓయీ! నీ యధిక ప్రసంగమును మాని ఆవలికథ సాగింపుము.

జయ:—అప్పట్టున వెనువైపుననుండిన చంద్రకేతువట కరుదెంచి ఆమెం బంధించెను.

శశాం:—ఓహో! "గ్రుడ్డిలో మెల్ల • మేల"ను నటుల మీ యిరువురిలో నాతఁడు కొంత మెఱుఁగని తోఁచుచున్నది. ఆవల నేమి జరిగెను?

జయ:—మహారాజు లెట్లనినను గాదను వారెవరు?

శశాం:—మరల వెనుకటి పాటయే పాడ నారంభించితివా? అది చాలించి ఎత్తిన విషయమును సాంతముగా వచింపుము.

జయ—చిత్రము. నేను నించుక సంబాళించికొని ఆతనికిఁ దోడ్పడితిని. అంత మే మిద్దర మామెయే రాజ్యశ్రీ దేవి యని యెంచి ఆమెను సవారియం దునిచికొని అప్పుడే ప్రయాణము గావించితిమి. నాఁటి మొదలు నేఁటివఱకు నామె రాజ్యశ్రీ దేవి యనియే యెంచుచున్నారము.

శశాం:—అయిన నాబిడ రాజ్యశ్రీ కాదనుట మీ రెఱుఁగరా?

చంద్ర:—మే మెట్లెఱుఁగఁగలము? అప్పు డామెఁ జూడఁ బ్రసక్తి యేమికలదు? అందు నొక దేశమునకు రాణియై, వేఱొక దేశమునకు మహారాజ్ఞి కాఁగల యాబిడను దేఱిచూచుట యైనను మా కెట్లాచరింపఁ దగినది కాదు.

శశాం:—రాణికిని దాసికిని భేదముగనిపెట్టఁ జాలకుంటిరి కదా!

జయ:—ముందు వెన్కల నెప్పుడును మేము రాజ్యశ్రీని జూచిన వారము కాము. చెఱనుండి విడివడిన యా దినమున నైన నర్ధరాత్రమగుటచే నాబిడ ముఖముగాంచిన వారముగాము. మఱియును ఆమె సౌందర్యమున మిన్నయై యుండుటచే రాజ్యశ్రీ దేవి కాదని మే మెట్లూహింపఁ గలుగుదుము?

శశాం:—మీ రేల యామె యునికిమనుకుల విచారింపరైతిరి?

జయ:—మాచేఁ దఱుమఁబడినప్పు డెచ్చటనో దాఁగియుండిన యామెయే మము సంహరింప నెంచి ఈలాగున వచ్చెనని మేమూహించి యుండ సంశయించుటకుఁ గారణమేమికలదు?

శశాం:—జయచంద్రా! రాజ్యశ్రీ నను వలచి యున్నటుల నీవప్పుడు వచించితివి. అది యసత్యమే కదా!

జయ:—మీ యాజ్ఞ చొప్పున మేము గొనిపోవుచున్న వారమని ఆమెతో నాడి యుంటిమి. అందులకాబిడ మౌన మవలంబించియుండె. దాన "స్వప్రతిషిద్ధమనుమతం భవతి" యన్నటుల ఆమె యంగీకరించెననియే భావించితిమి.

శశాం:—ఈ జరిగిన వర్తమానము నెల్ల నప్పుడే మాతో నేల చెప్పవైతివి?

జయ: ఏలినవారంతవఱు కోపిష్ఠి పట్టియుండినంగదా చెప్ప నగును? వచ్చెనని వినినయంతనే పరుగు పరుగున నంతఃపురమున కేగుచుండ ఈ విషయము లెల్ల నెఱుక పఱచుట కవకాశమేది?

ఈ మాట లాలకించి నంతనే శశాంక గుప్తునకును వచ్చిన యామె విషయమున నించుక సంశయము జనించెను. ఆమె రాజ్యశ్రీ దేవియే యగునేమో యని యెంచెనుగాని మంగళిక యని స్పష్టముగ చెప్పియుండ నట్టి సంశయము పడుట సమంజసముకాదని యెంచెను. ఆపదనుండి తప్పుటకై అసత్యము పలికియుండునా యని తలంచెనుగాని శుద్ధవంశ జనితయగు రాజ్యశ్రీ యామెయైనయెడ అట్లు నీచతతో నుప దాసియని చెప్పికొనదని ఆ సందేహము వలన నివర్తించెను. ఇట్లు కొంతవఱు కాందోళన పడుచుం దుదకుం బరిచారికయగు మంగళికయే కాని ఆమె రాజ్యశ్రీ కాదని నిర్ధారణ చేసి కొనెను. వీరికి నించుక మర్మము తెలిసియేయుండును. తప్పును గప్పి పుచ్చ నిట్లసత్యమాడుచున్న వారని యెంచెను.

శశాం:—ఎట్లును మీరీవార్తను నే నడుగునంతవఱకు నాకుఁ
దెలుపకుండినది యపరాధముగ నే పరిగణించుచున్నాను.

జయ:—తాము దోషమని యెంచిన మేమేమి బదులాడఁ
గలము?

శశాం:—అయిన నందులకుం దగు శిక్ష ననుభవింపవలదా ?

జయ:—దేవర వారు శిక్షింపనున్నచో నెవ్వరడ్డుపడఁగలరు?

శశాం:—నా మాటకై శిక్ష ననుభవింపనున్న వాఁడవేకాని
నీపైఁ దప్పుండుట నింకను అంగీకరింపకున్నాఁడవుగా!

జయ:—నే నంగీకరింపక యెచ్చటికిఁ తప్పిపోఁగలను?

శశాం:—సరిసరి. నీతో యిబుసుపోని మాటలాడిన ఫలమేమి?
భటులారా! ఈ జయచంద్రుం గొనిపోయి యంధకార
బంధురంబగునా గుహా మధ్యమునఁ బడవైచి రెండేసి
దినముల కొక్క తూటి ఆహారము పెట్టవలయునని
అందలి కావలి వారలతో నుడువుఁడు. చంద్రకేతుని
రాజకీయ కారాగారమున కంపుఁడు.

భటులు:—చిత్తము.

అని రాజభటులు జయచంద్ర చంద్రకేతువులం దో
డ్కొని చనిరి. శశాంక గుప్తుఁడును మంగళిక విషయమున
ఎట్టి శిక్ష విధించుట యని ఆలోచించుచు నాఁటి సభ
చాలించెను.

పదునొకండవ ప్రకరణము.

కుట్ర.

"మామయ్యా! నీ యాలోచనము నా కిసుమంతయు నచ్చుట లేదు, ఇక్కార్యము సరిపఱచకున్న మా బ్రదుకునకు హానివచ్చునుగదా!."

"అల్లుఁడా! నీ మాటలు నాకీ దినము కడువింత నిచ్చుచున్నవి. నీ వూరినుండివచ్చినప్పుడు నీపతి"—అని యింతలోనన వేలు కఱచికొనెను.

"మామయ్యా! ఇంతలోనన పొరఁబడుటేల?"

"తదేకధ్యానమున నుంటనేనట్లు పల్కితినిగాని యన్యముకాదు"

"ఇట్టి చంచల చిత్తులరగు మీరలా నాకుహితోపదేశ మొనర్చెడివారలు? చాలు చాలు మీ యుపదేశములు."

"అబ్బాయీ! నన్నంత హీనునిఁగాఁ దలఁపకుము. నీ వూరనుండివచ్చినప్పుడు నీపతిత పావనత్వాది బిరుదముల నేయేటఁ గలిపితివి? నీవిటు మాఱుటకేమి గతమని నేనడుగ వచ్చుచుండ ఇంతలోనన నీ వడ్డపడుటచే ఆ మాట యాఁగిపోయెను."

"ఇంక ఈ ప్రసంగముల మాని నావచనముల కేమి బదులాడెదరు?"

"ఎంత యాలోచించినను అది శుభప్రదమని నామదికిం దోఁచదు. నిదురించు బెబ్బులి మీసములఁబట్టి యూఁగించినట్లగునని తలఁచెదను"

"అట్లైన మీ కొక్క చిత్రముం జూపవలసినటుల నాకాజ్ఞ యయినది"

"అనెట్టిదియో చూపుము"

"ఇదె చూడుఁడు"

ఆ యువకుఁడు చూపిన యావస్తు వతి సూక్ష్మముగ నుండెను, దానిం జూచినంతన యాతని కిదివఱలోని జాజ్ఞప్తికి వచ్చెను. అంత గుండె లదరఁజొచ్చెను. ఏమియుఁ దోఁచక తల్లడిల్లెను. పెద్దకొండ యెద్దియో తన తలపైఁబడ నున్నటుల గోచరించెను. ఎదుటివానితో నెద్దియో మాటలాడ నుపక్రమింపఁబోయెనుగాని నోటినుండి మాట వెలువడదాయెను. యువకుఁడు నీతని యప్పటి యవస్థం గనిపెట్టి యిట్టులనియెను.

"మన యిర్వుర యభిప్రాయ మొక్కటైన నిట్టి కష్టము లుండఁబోవు"

"ఇంక నీవెట్లాడినను నియ్యకొందును"

"మామయ్యా! ఇప్పటికే దారిం బడితిరి. ఇంకఁ దడయుట సరికాదు. భీముఁడును పరాక్రమ కేతువును బంపిన లేఖ నుండి సంజ్ఞల నెల్లం గ్రహించియే యుందురుకదా! వారు నీ యూరనవచ్చియున్నవారు. మీరీ దినమున నర్ధ రాత్రమున నిటకుం గ్రోశమాత్ర దూరముననున్న నాయటవీ మధ్యమునందలి కాళికా దేవాలయమునకు రండు. నేనును వారిం బిలచికొని యట కరుదెంతును."

"నీవాడిన ట్లాయాలయము మనుష్య సంచార శూన్యమగునది. కావుననది మన రహస్యాలోచనకుం దగినదియ యగును."

అని యొకనాఁటి తెల్లవాఱు జామున నిర్వురు సంభాషించుచుండిరి. వారిలో నొక్కఁడు దీర్ఘకాయుఁడును గర్కశదేహుఁడునై బుఱ్ఱ మీసములు గల్గి, యొకచేతఁ గత్తియు, వేఱొకచేత ధనుర్బాణములును గలిగి యుండెను. ఆతని యుష్ణీషమును కంచుకమును జూచిన నాతఁడెవ్వఁడే నొక యుద్ధకార వర్గమునఁ జేరినవాఁడగునట్లు తోఁచుచుండెను. ఆతని యాకారముఁ జూడ నలుబది వత్సరములవాఁడని గోచరించుచుండెను. ఆతనితో మాటలాడుచుండిన మఱియొకఁడును నిమ్మపండువంటి మేని ఛాయగలవాఁడును కృశాంగుఁడునై యుండెను. అతని కింకను మీసము లంకురింపలేదు. అతనిఁ జూడఁ బదునేను వత్సరముల వానిం బోలె గోచరించుచుండెను. వీరిర్వురును మాటలాడుచుండిన యాస్థలము ఆయూరికడ నుండు నొక్క పాడుబడిన యిల్లు. అందెవ్వరును వసించుటలేదు కాని ఆ యూరంగల జూదరులకు రాత్రులయందు మద్యము నిచ్చుటకై యొక్క గణికా పుత్రుఁడచ్చటికి వచ్చుట గలదు. ఆకితవులు నామద్య విక్రేతయు రాత్రుల రెండవ యామమున నటకు వచ్చి యొక్క యామకాల మచ్చట నుండుట యలవాటు. నాల్గవ యామమున నేరికిఁ దోఁచినట్లు వారేఁగుచుందురు.

ఆ నాఁడు వారల్లఁగఁగనే యొక యువకుఁడటకు వచ్చెను. వాఁడింకను నుదయము కానందున రాజభట పాలితమగు నా పట్టణమునం బ్రవేశింపక ఆ యింట నించుక యలసట దీర్చుకొనుట కొఱకు దూరెను. అట్టియెడ నా యింటివాకిటి తలుపు చప్పుడగుటచే నాతఁ డొక్క మూలదాఁగియుండెను. వీఁడటనుండుట తెలియక మన కింతకు మున్ను బరిచితులగు

వారిద్దరును ప్రవేశించి మంతనము లాడికొనిరి. ఆ పురుష ద్వయమచ్చటినుండి యరిగినంతనె యా యువకుఁడు ఆప్రదేశమునకువచ్చి యిట్లని చింతించెను.

"ఆహా! నా యీ యాగమనము ప్రయోజనకారి యగునని తోఁచెడిని. వీరి మాటలు నా కంతగ బోధపడకుండినను వీరిచ్చట నెద్దియో గొప్ప కుట్రను ఆచరించుటకుఁ బ్రయత్నము సలుపుచున్నవారనుట మాత్రము యథార్థము. ఈ యువకునితో నీతఁడు సంభాషించుచు "నీపతి"యనివాక్రుచ్చి వేలు కఱచికొని, మరల సంబళించికొని "నీ పతితపావనత్వాది గుణము"లని మార్చికొనియెను. దానిచే నా రెండవ వ్యక్తి స్త్రీ వ్యక్తియనియే యెంచెదను. ఈవాచకమున కంగీకరింపని యా పెద్దవాఁడు తానాచిత్ర వస్తువును జూచినంతనె విస్మితుఁడై అంత భీతిల నేమి కారణము? ఇంతకును ఆ స్థలమునకుఁబోయి చూచినచో నాకేమే నించుక యాధారము దొరుకవచ్చునని తోఁచెడిని. పోయి చూచెదనుగాక."

అని యా ప్రదేశమునకు వచ్చెను. అంగీలోనుండిన చెకుముకి రాతి నెత్తెను. దానిపై నించుక ప్రత్తినిడి చేతనుండిన యినుప ముక్కతోఁ డంగొట్టెను. అందుండి వెడలిన నిప్పు యొక్క వెలుఁగున అచ్చటఁ గ్రిందఁబడియుండు నొక్క బంగరు రేకుంజూచెను. అందేదియో యంత్రము వ్రాయఁబడియుండెను. దానిం జేత నెత్తికొని చూచి యాశ్చర్య పరవశుఁడై యిట్లని తలఁచెను.

"ఈ రేకు మూలమున నా కేమియుం దెలియుటలేదు. దీనిం జూచినంతనె యాతని కంతటి భయమేల కల్గెను? ఇంతకు

ను. ఈ నాఁటి రాత్రి నిరీక్షన్నను. ముందుగ నేనాకాళికాలయ మున కరిగి దాఁగియున్నచో నన్నియుఁ దెలియఁగలవు. ప్రస్తుత మీ జేబు నిచ్చట విడచుటయే పాడియగును. వారెట్లును దీని కొఱకిటకు వత్తురు. జేబుం గానకున్న సంశయింతురు. దాన దీని నిట దిగ విడచి తొల్లివలె దాఁగియుండిన వారి సంభా షణాలవలన మరల నేమేని దెలిసికొనవచ్చును. వారిటనుండి వెడలునప్పుడు వారి కేలుక రాకుండ వెనుదవిలిన, వారెచ్చ టికిఁ బోయెదరో కనుఁగొన వీలగును."

అని దానినచ్చట విడిచి యథాప్రకారముగ దాఁగియుం డెను. అంతఁ బూర్వపు టిద్దఱు నిటకువచ్చిరి. వారును మన యువకునివలెఁ జెకుముకి రాతినుండి నిప్పు గల్పించి దాని మూలమున నా జేబుం జూచిరి. వచ్చిన వారిలో యువకుఁడు దాని నెత్తికొనెను. ఆ వెలుఁగు మూలముననే వీరి ముఖము లు ఆ యువకునకుఁ గానుపించెను. ఎచ్చటఁ బిగ్గఱగా నూపిరి విడిచిన వారికిఁ దెలియునో యని తిన్నఁగా నూర్పును విడుచు చుండెను. ఇంచుక కదిలిన నెచ్చటఁ జప్పుడగునో యని, కదలక మెదలకయె యుండెను. అప్పుడచ్చట నా యిర్వుర కిట్లు సంభాషణ జరిగెను.

"అబ్బాయీ! ఆ యంత్రము నా యొద్ద నీక నీవేల యెత్తి కొంటివి?"

"మీ కిద్దానిం జూపవలయునని మాత్రమే నాకు వారాజ్ఞ యిచ్చి యున్న వారలు."

"అట్లని మొదట నాయొద్ద నిచ్చినవాఁడే వేల యడుగకుంటివి?"

"మరలఁ గైకొనుట కొఱకే కదా వెలుపటికి వెడలఁగనే యంత్ర మెచ్చటనని మిమ్మడిగి యుంటిని!"

"ఎచ్చట నని ప్రశ్నించితి వంతియకాని ఇమ్మని యడుగ లేదు కదా!"

"యంత్రము చూపినచో నిట్లిండని మీవలన గ్రహించి ఆవల నిది మీ కీఁదగదని వారి యాజ్ఞయనుటం జెప్ప నెంచితిని."

"నీయుక్తికిం గడు మెచ్చితిని. సంజ్ఞార్థము బంపినది నా యొద్దనుండిన యంతన ఏలోపమును గల్గదు. దాన దీని నాయెడనే యుంచుము"

"వారువలదని వారించి యుండ నేనిచ్చినచో నాపని యేమగునోయనుట విచారింప రైతిరి కదా!"

"అట్లైన నది నీ యొద్దనే యుంచికొనుము. నా యొద్దనుండిన దాన నాకగు ప్రయోజనమేమి?"

"అట్లె యొనర్చెదను. తెల్లవాఱుచున్నది. ఇంక శీఘ్రముగ మన యునికి పట్ల కరుగుట యుక్తము"

వీరి సంభాషణ, మాలకించిన పూర్వాగతుఁడగు నా యువకునికి సంశయ నివారణ మగుటకుమాఱు ముందరి కంటెను సందేహ మధికమగుచుండెను. అంత నాతఁడిట్లని యాలోచించెను.

"వీరి మాటల తీరుచూడ నీ బాలుఁ డీయూరివాఁడు కాఁడని తోఁచెడిని. అట్టియెడ వీరి కెట్లిట్టి చుట్టఱికము గల్గి యుండును? వీ రాదినుండియు మామ, అల్లుఁడు ననువరుసలతోఁ బిలిచి కొనుచున్నవారలు. ఈ బాలుని పోలుపు చూడ నాఁడురూపు దోఁచుచుండుటచే కోడలగునో యని

సందేహించెదను. అట్లైన నీతని కుమారుఁ డెవఁడై యుండును? ఏదియు గోచరించుట లేదు. నా కీవిషయ మయోమయముగ నున్నది."

అని యోచించి యాతఁడు దత్తావధానుఁడై యుండ నా బాలుఁ డెదుటి వానితో నిట్లనియెను.

"మామయ్యా! మన మనుకొని నట్లు సకాలమునకే ఆ యాలయము నొద్దకు మీరు రావలయును. వారంగీకరించినచో నీ యంత్రమునుగూడ మీరే గ్రహింపవచ్చును."

"యంత్రము మాట యటుండనిమ్ము. ఆతఁడును శబర నాయకుఁడు నిటకువచ్చి రంటివే! వారెచ్చటనున్నవారు?"

"ఆలయము నొద్దకు నెల్లరును రాఁగలరు. అప్పుడే మీ కన్నియు విశదపడఁగలవు."

ఈ మాటలాలించి నంతన మన యువకునకు విస్మయము జనించి యిట్లని యాలోచించెను.

"ఎవ్వఁడా శబర నాయకుఁడు? వింధ్యారణ్యవాసియా! వాఁడైన నియ్యది యసత్యోదంతమగును. వాఁడిట్టి కుట్రలం బ్రవేశింపఁజాలఁడు. ఇంక నెవ్వఁడే నుండవలయు. మఱియు ననిర్దిష్టనామముగ నాతఁడని యొకని నుడువుచున్నవారు. వాఁడెవ్వఁడయియుండ నోపును? ఇంతకును నేఁటి రాత్రి యట కరిగిన నన్నియు విశదముకాఁగలవు."

అని తలఁచుచుండ నింతలో వారును ఆ యిల్లు విడచి బైలు వెడలిరి. యువకుఁడును వారి కెఱుక రాకుండఁ గొంత దూరమున వారి ననుసరించి పోవుచుండెను.

పండ్రెండవ ప్రకరణము.

దుష్ట చతుష్టయము.

ఏ పొదల మాటునఁ జూచినను బెబ్బులుల బొబ్బల కాని అన్యము వినరాకుండెను. ఎటుఁ జూచినను 'ఝుం ఝుం'మ్మని యొక ధ్వని వినఁబడుచుండెను. ఎట్టి ఱాతిగుండెగల వాఁడైనను ధైర్యముచేసి ఆ యటవిం బ్రవేశింప వీలు గాకుండెను. నగర సమీపమున నున్నను క్రూరజంతు శరణ్యమగు నా యరణ్యము వైపున కేరును నేఁగకుండిరి. రాజు నహింసాపరుఁడగుట వేఁటాడుటలేదు. దాన నచ్చటి సత్వము లప్పటప్పటికి నభివృద్ధిం గాంచుచుండెను. నానావిధ తరులతావృతమగు నక్కాంతార మధ్యమున ఒక్క నాఁటి రాత్రి నార్వురు వీరభటు లరుగుచుండిరి. వారిలో నొక్కరుఁ డాజానులంబి బాహుఁడై ముందు వైపున నడుచుచుండెను. ఆతఁడొక్కచేత వింటిని వేఱొకచేత బాణమును ధరించియుండెను. నడుము నందలి దట్టీయందొక ఖడ్గపు నొర వ్రేలాడుచుండెను. దాని యందలి ఖడ్గపు పిడి వెండితో నిర్మింపఁబడి యుండెను. వాని ముఖ మతినిర్మలమై స్ఫటికపు ఱాతివలెఁ దళతళ లాడుచుండెను. కాని యాతని నేత్రములు మాత్ర మాంతరమునఁగల యాగ్రహమును వెలిఁ బుచ్చుచుండెను. తక్కిన వా రాతని యెడ భయ భక్తులు కలిగియుండుటఁ జూడ వారిలో నతఁడే ప్రధానుఁడని తోఁచుచుండెను.

ప్రధా:—ఈ యెదుటఁ గనిపించు నాలయమున బ్రవేశింపుఁడు.

సేవకులలో నొకఁడు. } :—స్వామీ! మన మిటఁ బ్రవేశించుటకుం గారణమేమియో సెలవీఁదగు నేని తెల్ప వేఁడెదను.

ప్రధా:—ఇచ్చటి కొక దుష్టచతుష్టయము మంతనములు గావింప రాఁబోయెడిని.

సేవ:—వారిచ్చట రాఁగలరనుట దేవర వారెట్లు కనిపెట్టితిరి?

ప్రధా:—మన యాప్తుఁడొకఁడు దీని నా కెఱిఁగించెను.

సేవ:—వారి దౌష్ట్య మిట్టిదని తెలుపనగునే!

ప్రధా:—రాజకీయమగు నొక కుట్ర జరుప నుద్దేశించియున్న వారు.

సేవ:—అయ్యది యెట్టిదియో తెలియునా?

ప్రధా:—తెలియును గాని యది మీకు క్రమముగ నెఱిఁగించెదను. ఇప్పుడవి యెల్లం జర్చించుచుఁ బ్రొద్దుపుచ్చుచుండుట భావ్యముకాదు. వారును వచ్చువేళయగు నది. ఆలసింపకుఁడు.

అని ప్రధానుఁడాడినంతన యాలయములోనికి వారేఁగిరి. అయ్యది పాడు బడియుండెను. దాని ముందొక బౌద్ధ స్థూపముండెను. అద్దియుఁ గొంత విఱుగఁబడి యుండెను. దానింజూచినంతన మన ప్రధానున కలవిగాని శోక ముద్భవించెను. ధీరుఁడగుట నాకార గోపనము గావించి యిట్లని చింతింపసాగెను.

“ఆహా! ఎట్టి దాని కెట్టి దశపట్టినది? ఎల్లపుడును బౌద్ధ భిక్షువులు చేరియుండు నీ ప్రదేశ మిప్పు డెట్టిస్థితికివచ్చెను. శిథిలమగు నీ స్థూపమును జక్కఁ బఱచునట్టి దిక్కు లేనందున

గదా యిట్టి గతిపట్టి యున్నది! కాల మహిమ యనుల్లంఘనీయము! ఇంక దీనిఁ జక్కఁ బెట్టెడి వారెవ్వరో? చేత వెన్న నిడికొని నేతి కల్లాడుచందమున నున్నది! ఇంక నెప్పుడు మనకు మంచిగతి రానున్నదియో యెఱుఁగము.

కాపురములేనియిండ్లెలుకలు పాడుసేయునట్లుగ రాజు లేని తఱి నిట్టి యకార్యము సేయఁ బ్రయత్నము గావించుచున్నారు. అగ్నికిఁ దోడుగ వాయువును జేరునటులఁ గాలమును వీరికిఁ దోడ్పడుచున్నది. ధర్మ పక్షపాతియగు దేవుఁ డొకఁడు గలఁడనుట యెప్పుడును మానసమున నెంచకున్నారు."

అని యిట్లు చింతించుచు వారా యాలయములోనం బ్రవేశించిరి. అందు ముందు వైపున నొక్క మండపముండెను. అయ్యది మాత్రము ఇంకను గూలక కూర్చుండుట కనువగు నట్లుండెను. లోపలి భాగమంతయును ఊడ్చువారు లేనందున దుమ్ము నిండియుండెను. ధర్మోపన్యాసకుల కునికి పట్టుగ నుండిన యాలయము ఇప్పుడు ఘూకములకును గబ్బిలములకును నావాసమైయుండెను. అచటి మాలిన్య మధికమైయసహ్యముగ నుండెను. అచ్చటి మండపమునకుం బడమటి వైపున శిలారూపమగు నొక శివ విగ్రహముండెను. దానికచ్చటఁ బూజాదులు సేయు వారెవరును లేకుండినను ఎలుకలు తమ కలుగులోన నిడికొనిన ధాన్య విశేషము లద్దానికి నివేదన కొఱకుం దెచ్చిన పదార్థములాయనునట్లుండెను. సర్పములావిగ్రహమును జుట్టికొని యుంట నాతని నాగాభరణత్వమును సార్థక పఱచుచుండెను. శిరమున నంటికొనియుండిన బల్లిపర చంద్ర శేఖరత్వమును వెల్లడి సేయుచుండెను. శిథిలిత

మగు విగ్రహమున కించుక యుత్తరమున నొక గది యుండెను. అయ్యది యంధకారమయముగ నుండెను. ఆ గది యందలి కొన్ని స్తంభములు వ్రాలియుంటఁ బై భాగము విఱుగఁబడుటకు సంసిద్ధమైయుండెను. వీరు నచ్చటనే దాఁగియుండిరి. వీరట కరిగిన కొన్ని నిముసముల లోనన నల్వురు పురుషులు ఆ యాలయమున కరుదెంచిరి. వచ్చినవా రామండపమునఁ గూర్చుండి ఇట్లని సంభాషించికొనఁ దొడఁగిరి.

“గణ దాసా! ఆమె యింక నిచ్చటనే యున్నట్లు తోఁచుచున్నది. మొన్నటి సాయంసమయమునఁ గీర్తిశేషుఁడైన పెద్ద మంత్రియొక్క పాడుబడిన యింట నామెం జూచినట్లు గంభీరవేది నుడివెను.”

గణ:—మిత్రగుప్తా! గంభీరవేది యామెం జూచుటకు ప్రసక్తి యేమి?

మిత్ర:—ఇదె గంభీరవేది యెదుటనుండ మనకా చింత యేటికి?

గణ:—గంభీరవేదీ! నీ వామెం జూచుటకుఁ గతమేమి?

గంభీ:—అశరణయగు నొక యబల యన్యదేశముల కెట్లేఁగును? కాఁబట్టి ఇట నెచ్చట నేనుండునని యెంచి యెల్లెడల వెదకుచుంటిని. కావున నామెం జూచునట్టి ప్రసక్తి కొలెను.

గణ:—అట్లైన నీ మాట యింతవఱకును మాకేల తెలుపకుంటివి?

గంభీ—:మీతో మాటలాడ సమయము దటస్థింప లేదు. అట్లుండ నా విషయమెట్లు తెలుపుట?

గణ:—ఇప్పట్టున మన మాచరింపవలసిన కార్యమెయ్యది?

గంభీ:—ఆమెం బట్టి బంధించి శశాంకగుప్తున కర్పింపవలయును.

మిత్ర:—ముందు మన మొనర్చినందున కింతవఱకును బహు మతి యంపనివాని కింకను నుపకృతిసేసిన నేమి యుప యోగము? ఇంత కాలముగ మనపై నేరును సాశ యించుటలేదు. పది దినముల దొంగ యొక్కనాం డైనను జిక్కక పోవదు. మన కుట్ర బయల్పడినా నదియే మన కంతకాలమగును.

గణ:—మిత్ర గుప్తుండాడునది యుక్తతరమగునది. ఎట్లున మన మికార్య మొనర్చుట మేలు కాదు. వ్రతము సెడినను సుఖమైన నుండవలయును గదా! అదియు నిందు శూన్యము. అయినను పాంచాలుని యభిప్రాయ మునుగూడఁ గనుఁగొందము.

పాంచా:—మన మొనర్చిన యది సార్థక మెట్లాయెను? వ్యర్థ కార్యమునకు ప్రతిఫల మపేక్షించుట యేటిపాడి? వంచనకుం దగు పరాభవ మందకునికియే పదివేలు. ఇప్పటినను నట్లుగాక శ్రద్ధతో కార్య మొనర్తము. దాన లాభము గల్గుటకు లోటులేదు.

గంభీ:—పాంచాలుని మాటలు ఎంతయు మెచ్చఁదగినవి. వాని యిచ్చవచ్చునన ఆచరించినచో మన కెంతయు లాభ ము గలుగును.

గణ:—పాంచాలుఁ డాడిన యట్టుల నిప్పుడు మనము బహూ కృతికిం బాత్రులు గానేరమనియే నాకును దోఁచు చున్నది.

మిత్ర:—అట్లాడనేల? మన కార్యమును చక్కఁగనే యాచ రించి యుంటిమి కదా! తన వారివలన నైన లోపము నకు మన మేమిసేయఁ గలము? అద్దియుం గొంతవఱ కాతని కనుకూల పరిణామిగనే కదా యాయెను!

పాంచా:—పులి గూఁటినుండి తప్పించి కొనెనుగదా! ఇంక నాతని కనుకూల పరిణామియగు టెట్లు?

మిత్ర:—వస్తువునకు బదులుగ వస్తువు చిక్కియుండ ననుకూల పరిణామిగాదని యెట్లెంచవచ్చును?

గంభీ:—రత్నమును బోఁగొట్టికొనిన వానికి గాజునిచ్చి ఇదియే రత్నమని భావించి కొనుమనునట్లున్నది.

పాంచా:—అదియును దైవ వశమున జరిగినదియే కాని మన ప్రతిభా విశేషమున నైనదికాదుకదా!

గణ:—ఇంక మన మాలసించుట తగదు. శీఘ్రముగ నామెం బట్టి గౌడనగరమున కంపుట భావ్యము.

అను నీ మాటలాలించిన ప్రధాని వీరి యభిప్రాయ ములు చక్కఁగ నెఱిఁగిన వాఁడై వారిం బాధింప నిజభటుల కానతిచ్చెను. యజమాను నాజ్ఞ చొప్పున వారును తటాలున ఆ దుష్టచతుష్టయముపైఁబడిరి. వారునట్లగునని యెంచినవారు కారు కావున మొట్టమొదట స్తబ్ధులై యుండిరి కాని వీరెవ్వరో చోరులని యెంచి వారి బారినుండి తప్పించికొనుటకై యెన్ని యో ప్రయత్నములు గావించిరి. కాని అవెల్ల నుపయోగ శూన్యములాయెను. ప్రధాని ముందు నడచుచుండ నానతని యనుచరులు బంధితులతోడ నా ప్రధాని ననుసరించుచుం

డిరి. ఇట్లు పోవుచుం దిన్నగ నగరము చెంతకు రాఁగనే గణ దాసుఁ డిట్లని తలఁచెను.

"నే నింతవనుక వీరెవ్వరో చోరులని యోచుచుంటిని. తస్కరులైన నగరములోని కేల పోవుదురు? వీరిజాడఁ జూడ రాజభటులఁ బోలియున్నది. వీరు మా రహస్య సంభాషణ ముల నాలకించి యుందురు. దానమాకిఁక కీడు గల్గుట నిశ్చయము."

అని యాలోచించుచుండ ముందు నడచు నా ప్రధా నుఁడు వీరిఁ జూచి యిట్లనెను.

ప్రధా:—ఓ దుష్టులారా! మీకు ప్రాణములపై నాసయున్న నా ప్రశ్నమునకు సరియగు బదులొసఁగుఁడు.

గంభీ:—మే మసత్య మాడము కాని ఒరులకు బాధాకరములగు వాని మాత్ర మెంతమాత్రమును ప్రకటింపఁజాలము.

ప్రధా:—అక్రమము లాచరించుచుండినను మీ యీ యాధ్య వసాయమున కేనెంతయు నలరినాఁడను. దీని సద్విష యమున నుపయోగించిన నెంతయు బాగుండెడిది. మీ రాది నెద్దియో యక్రమ మాచరించినట్లు సంభాషించు చుంటిరే, అయ్యది యేదియో వివరించునది.

గంభీ:—ఆక్రమమని తెలిసియు చెఱనుండి యొక్కరిని విడి పించుటయే మేమాచరించిన యకార్యము. ఇంతకన్న నెక్కుడుగ మే మేమియు నుడువఁజాలము. దాన మము విశ్వసించిన వారి గుట్టు రట్టుసేసి నట్లగును. ఇది సత్యము. మీ రేమి సేసినను సరియే.

ప్రధా:—నేను మాత్రయేమి సేయఁగలవాఁడను? మిమ్మిప్పుడు రాజభటుల పాలు గావించఁ బోయెడివాఁడను. వారె ట్లొనర్చినను సరియే.

గంభీ:—మీ చిత్తము.

పిదప ప్రధానుఁడు దన యనుచరులతోడను నా దుష్ట చతుష్టయముతోడను పుర ప్రవేశ మొనరించెను. ద్వారపాలురు వీరింజూచి, సంశయింప ప్రధానుఁడు వారి చెవిలో నేమియో చెప్పెను. వారంత దూరముగఁ దొలఁగి దారి తీసిరి. ఎల్లరును ప్రధానామాత్యుని యింటికి కఁగిరి. ప్రధానుఁడు నమాత్యునితో నా దుష్టచతుష్టయము ఆ యూరం జరిగిన కుట్రకుఁ గారణమనెను. అమాత్యుఁడును వారి బాధ నా గారమున కంపెను. మంత్రి యెంత వేఁడికొనినను ప్రధానుఁడు మాత్రము తన యునికి మనుకులం దెల్పక అంతయుఁ గ్రమముగఁ దెలియునని వచించి తన యనుచరులతోడఁ దత్క్షణమ యెటకో యరిగెను.

పదమూఁడవ ప్రకరణము.

పసులకాపరి.

ఒక్కనాఁటి సాయంసమయమున గోదావరీ తీర భూమి యెల్లరకు నానంద ప్రదమైయుండెను. ఆహార గ్రహణమునకై యిచ్చటచ్చటి కరిగిన పక్షి జాలములు బిడ్డలం జూడ నువ్విళులూరుచుఁ దమ తమ గూండ్ల కరుదెంచుచుండెను. పసుల మేఁత కొఱకు బైలునకుం దోలికొని పోయిన గొల్లలు వాని మరలించికొని యూరి వైపునకు వచ్చుచుండిరి. అడనాడ మేయుచుండిన మృగములు తమ పొదలలోనికి వచ్చుచుండెను. చెంచులు కొందఱు బవలెల్లం గొట్టినకట్టియల నమ్ముకొనుటకై యా కాష్ఠముల మోపు శిరమున నుంచికొని వచ్చుచుండిరి. అస్తశిఖరి గతుఁడగు సూర్యుని యరుణకాంతులు వృక్షాగ్రములపైఁ బ్రసరించి బంగారు పూఁత పూసినట్లుండుచు, చూపఱకమందానంద మొసఁగుచుండెను. అట్టియెడ నా నదీ తీరంబున నొక పాంథుఁ డేఁగుచుండెను. ఎల్లరకు నుత్సాహముం బుట్టించు నా గౌతమీ కల్లోల తుషారములం గూడిన చల్లని గాలి యాతని మానసమును ఆకర్షింపఁ జాలకుండెను. మనోహరముగ తాండవము సల్పు నచ్చటి మయూరములు అతని చిత్తమును స్వాయత్త పఱుపఁ జాలకుండెను. అతని కించుక దూరమున నొక్క పసులకాపరి తన గోగణముం దోలికొని వచ్చుచు వేణుగానము సేయుచుండెను. ఇంతదనుక నన్యాయత్తముగ నుండిన యాబాటసారి మానసమును ఆ వేణుగాన మాకర్షించెను. అతఁడా గానము వినవచ్చెడి వైపునకు దృష్టి మరల్చి యత్యంత సంతుష్టాంతరంగుఁడై;

"ఔరా! సంగీతము యొక్క మహిమను ఏమని గొనియాడఁగలము? ఎట్టి సంకటములున్నను బోఁగొట్టుట కిది యమోఘభైషజ్యమగుచున్నది. ద్రాక్షారసముం బోలి మాధుర్యముగల యీ సంగీతము గానప్రియుఁడగు వానిం బరవశము గావించి వాని పంచేంద్రియములకు సుఖప్రీతిం గల్పించుటలో, ద్రాక్షారసమున కన్నను మిన్నయగును. గానము సేయుచోట ఆయాదిదేవుఁడు సంతుష్టితుండై యుంట నిది యుత్సాహదాయి యగుట యబ్బురముగాదు, నేయేల? చింతార్ణవగతుఁడనై పారము గానక పరితపించుచు తదేకాయాత్త చిత్తుఁడనగు నన్ను నాకర్షించియుండున దీసంగీత శ్రవణమే కదా!—అది యటుండ నిమ్ము. ప్రొద్దు పోవుచున్నయది. నేఁటి రాత్రి నెచ్చటనేని విశ్రమింపవలయుఁగదా! ఈతఁ డీ చెంతనుండు పల్లియకుం బోవు చున్నవాఁడు. వీని వెంటంబోయి నేను నా పల్లియ యందీ నిశంగడిపెదను."

అని తలఁచుచుండ నా గొల్లఁ డీతని చెంత నరుగుదెంచెను. వచ్చినవాఁ డీతనిఁ జూచినంతన భీతుఁడై నిలువఁబడెను. కాలుసేతులు గడ గడ వడంకసాగెను. చేతనుండు వేణువు స్వాతని కెఱుకరాకయ క్రిందికి జాఱిపడెను. ఇంతలోన తన వృత్తమాతఁ డెఱుంగకుండవలెనని ఇంచుక మఱుఁగు పఱచ నెంచెను. పథికుఁడు నీతని యాతురతం గాంచి కారణ మారయఁజాలక విస్మితుఁడై;

పథి:—గోపాలుఁడా! నీవేల యిట్లకారణ భీతుఁడవగు చున్న వాఁడవు?

ఈ మాటలాలకించిన యా గొల్లపిల్లవాఁడును దానెంత గుప్తముగావింప నెంచియు గుట్టుబయల్పడుటకించుక చింతించి;

పసులకాపరి:—హా! మామయ్యా! నీవానాఁడు క్రిందఁబడిన దాడిగఁ గాన్పింపమిఁ జచ్చితివనిగదా యెంచితిని! నీ గొంతు సవ్వడిం దెలిసికొను నంతవఱకును నే నిను దయ్యమని తలఁచియుంటిని. నీ వెట్లాయాపద నుండి తప్పితివి? నిన్నెవ్వరు గాపాడిరి? ఇన్ని దినములును నీ వెచ్చటనుంటివి? తిన్నఁగ నూరికేఁగక యిచ్చటికివచ్చుట కేమికారణము? నీ సోదరీ మరణము నీకింకను దెలియదుకదా! దానవే దిక్కు లేక నేనీయూర నొక్కని యింటఁ బసులకాపరినై బ్రదుకుచున్నాను.

ఈ మాటలు వినిన పథికుఁడును విస్మితుఁడై యిట్లని వితర్కింపసాగెను.

“ఈ బాలుని గొంతు సవ్వడి మాత్రము మున్ను విన్నట్లు తోఁచెడినిగాని యీతని మాత్ర మెన్నఁడును జూచినట్లు నామదికిఁ బొడఁగట్టుట లేదు. నేను క్రంతనుండి క్రిందికి దూఁకిన దీతఁడెట్లెఱిఁగెనో తెలియరాకున్నది. తనకును నాకు నెద్దియో సంబంధమును గల్పించి యున్నవాఁడు. నన్ను వంచించుటకీ తంత్ర మొనర్చియుండునా? ఆకృతి సామ్యముండినఁ బొరఁబడియుండునా? అట్లైన నాతని యలుకుడు నే మున్ను విన్నదానిం బోలెనన్నది. దీనికిం గతమేమియుండును? లోకమున ధ్వని సామ్యము మాత్రముండదే! దాన నితఁడు పొరవడెననుటయే యుక్తతరము. కావున నీతని సంశయ నివారణము గావింతును.”

అని తాను ధరించియుండిన యుడుపుల వీడి తన పూర్వ పుటుడుపుల ధరించెను. ఇది గని యాతఁడిట్లని యెంచెను.

"ఔరా! నేనప్పుడే సంశయించితిని. నా సందేహము స్థిరమైనది. సింహముచేతఁ బడినవాఁ డెట్లు బ్రదికివచ్చెను? ఆహా! వీఁడెంతటి కైనను వెనుదీయువాఁడు కాఁడు." అని తలఁచి;

పసుల:—అయ్యా! నన్ను మన్నింపుము. నేఁ దెలియక పలికితిని.

పథి:—ఇందు మన్నించుటకే మున్నది? నే నన్యదేశవాసిని. కావున నాకీరాత్రి విశ్రమించుటకంత చోటిప్పించినచో నంతియ చాలు.

పసుల:—ఈ పల్లియ యొక బ్రాహ్మణాగ్రహారము. ఇందలి యధికారి యింట నేఁ బసులఁగాచుచున్న వాఁడను. నాకిచట నన్య లేరును పరిచితులు లేరు. మీరట కరుదెంచినచో వారివసారాలోఁ బరుండవచ్చును. వారును ఇందుల కన్యథా వచింపరు.

పథి:—అట్లే కానిమ్ము.

అంత వారిరువురును ఆ యగ్రహారములోని కరిగిరి. అందొక్క బ్రాహ్మణ గృహముండెను. దాని వాకిట నొక వసారా ప్రాలిచియుండెను. దాని క్రింద మంటి యరుగులు రెండు కట్టఁబడి యుండెను. పసులకాపరియుఁ దనతోడ వచ్చినవాని ద్వారమున కానలన యునిచి తా నా పశువులఁ గొట్టములోనం గట్ట నేఁగెను. యజమానుఁడును ఆ కొట్టము నొద్ద కరుదెంచి యిట్లనెను.

యజ:—కుమారా! నీ వెంట వచ్చిన యాతఁడెవ్వఁడు?

పసుల:—ఆతఁ డెవ్వఁడో వైదేశికుఁడఁట. ఇచట రాత్రి విశ్రమింపవలయు నన్న తమతో మనవిచేసి యాతని కీరాత్రి మన నసారాలోఁ బరుండ నాజ్ఞతీసి యీ వచ్చునని యెంచి పిలిచికొని వచ్చితి నంతయే కాని యాతని యునికి మనుకులు నే నెఱుఁగను.

యజ:—అట్లని వాని నిటకుం గొనిరమ్ము.

పసులకాపరియుఁ బశువులం గట్టి ద్వారము నొద్దనుండు నా పథికునిఁ దన యజమానుని నొద్దకుం బిలిచికొని వచ్చెను.

యజ:—ఓయీ! నీ వెవ్వఁడవో వైదేశికుఁడయినట్లు మా పసులకాపరి మూలమునఁ దెలియనాయెను. కాని నీ పేరు నూరు నెయ్యదియో తెలుపుము.

పథి:—స్వామీ! ఎచ్చట జీవనము దొరకిన నచ్చట నివసించు నా యూ రెద్దియని వచియింపఁగలను? ఎప్పటికప్పుడు నాకృత్యములం బట్టి పేరును మాఱుచుండును. దాన నదియు నెద్దియని తెలుపఁగలవాఁడను?

యజ:—నీ మాటలంబట్టి నీ యునికిమనుకు లొరులకుఁ దెలుపనిచ్ఛగించని వానివలె గోచరించుచున్నావు. ఎట్లైనను సరియే. నీవీ రాత్రినిట యథేచ్ఛముగ విశ్రమించుము.

అని యాడి యజమానుఁడును గార్యవ్యగ్రుఁడై గృహములోని కరిగెను. పసులకాపరియుఁ బసులకుఁ గసవువైచి యా బాటసారి యొద్దకు వచ్చెను. బాటసారియును పసులకాపరితో నిట్లనియెను.

పథి:—ఇచ్చటికి కుత్తరపు వైపుననుండు నాగుడిసె లెవ్వరివి?

పసుల:—అవి యీ యూరఁ గొలములు దున్నుగాపు వారివి.

పథి:—సరి. నీ యునికిమనుకు లెవ్వి?

పసుల:—నేఁ దూర్పు సీమ నొక కుగ్రామమునం బుట్టినవాఁడను! మా తల్లి మరణించి నందున నిస్సహాయుఁడనై యచ్చటచ్చటం దిరుగుచు నీ యూరున కరుదెంచితిని. •ఇట నీ మహాత్ముఁడు నా చరిత్రమువిని జాలిఁగొని నన్నుఁ దన యొద్ద నిలిపికొనియెను.

పథి:—నీవును నావలె నిజ వృత్తాంతము బైలువెట్ట నొంచని వానివలె గోచరించుచున్నాఁడవు.

పసుల:—అట్లుకాదు. నా చరిత్రము దలఁచిన నాకే వ్యసనము గల్గుచున్నది. కావున నేనది సెప్పుటకు వెనుఁదీయుచున్నాను.

పథి:—అది యట్లుండనిమ్ము. నీ గొంతు సవ్వడి మాత్ర మీ వఱకు నే విన్నయట్లు తోఁచుచున్నది. కాని కారణ మెంత విచారించినను గోచరించుట లేదు. నా కది విస్మయము నిచ్చుచున్నది.

పసుల:—అదిని మీ వేషమును జూచి నే భ్రమ నొందినట్లు మీరును భ్రాంతి వహించి యుండవచ్చునుగాని యన్యముకాదు.

పథి:—నేను నట్లే యెంచితినిగాని అప్పుడప్పుడు సంశయముదయించుచును ఆ బుద్ధిని మార్చుచున్నది.

పసుల:—సంశయము కల్గినపుడెల్ల నిట్లే తలఁచికొనుచుండినచో మనసు కుదుటఁ బడఁగలదు.

ఈ మాటలాలించిన మన బాటసారికి సంశయ మింకను బలపడ నారంభించెను. దాన నా గొల్లని నిర్బంధించియైన నాతని వృత్తాంతముం దెలియ నెంచెనుగాని తన మాఱువేసముంగూడఁ దీసివేసి తాత్త్వికరూపముం ధరించియుంట నెచ్చటఁ దాను బైలు పడవలసివచ్చునో యని యాకార్యమునుండి విరమించెను. ఇంతలోన నా యింటి యజమానురాలు భోజనమునకై పసులకాపరిని బిలుచుటచే నాతఁడు నీతెరువరిని వీడ్కొని వెళ్లెను. అంత నీ బాటసారియు;

"ఇతని గొంతు నవ్వడి యిదివఱలో నే విన్నట్లు దోఁచుటయేగాక ముఖము తీరును దృష్టపూర్వముగనే గోచరించుచున్నది. ఈతఁడును పూర్వపరిచితునివలె సంభాషించుచున్నాఁడు. నా మాఱువేసముంగూడ వీడ్చియుంటినే! వీఁడిక నా గుట్టు బయల్పఱచునేమో! ఇటనుండి తప్పి వెడలిన నంతయు చాలును. ఏమిసేయుదును? ఎట్లు దప్పించికొనఁగలను? తెలియక యిటఁ జిక్కికొంటిని. ఎట్లును ఈ రేయి నిటఁ గడపవలసియేయున్నది."

అని తలఁచుచు నా భీతిచే నిదురించక యుండెను. ఇట్లుండ నర్ధరాత్రమునఁ బశ్చిమ దిశనించుక మబ్బు క్రమ్మెను. ఇంతలోన నుత్తరమున నొక మెఱుపు మెఱసెను. అంతలోనఁ దూర్పున నొక గాలి వీచి యచ్చటచ్చటం జెదరియుండిన మేఘముల నొక్కటిగాఁ జేర్చెను. ప్రథమమున సన్నని చినుకులతో నారంభించిన వర్షము క్రమ క్రమమున నతిశయించి కుంభములతోఁ గ్రుమ్మరించిన లాగున జడి వానకురియసాగెను. ఎటుఁజూచిన నేకార్ణవముగఁ దోఁచుచునట్లుండెను. కప్పలును

'బెక బెక'యని యారావము గావించుచుండెను. ఎట్టి ధైర్యవంతునకును చిత్త చాంచల్యము గల్గు భంగి నుఱుములు ఉఱుముచుండినవి. మన బాటసారియు నాచలి కాఁగఁ జాలక [illegible] లేచి మోకాళ్ల బొమ్మ గప్పికొని ఆసీనుఁడై యుండెను.

ఇంతలోనన కొంతవర్షాడంబరము తగ్గఁ జొచ్చెను. అప్పుడా యింటి యజమానుఁడొక తాటియాకు గొడుగుం దాల్చి పసులకాపరి తన వెంట వచ్చుచుండ బయలునకువచ్చి ఆ యూరి కాపుల నెల్లఁ బ్రోవుసేసి చెఱువు నొద్దకుం బిలిచికొని వెడలెను. అప్పట్టున నటఁ గలుజుల వెంట నీరు ప్రవహించుచుండెను. కొందఱు కాపులు తాము తెచ్చిన గసవు మోపుల నా కలుజు త్రొవల యడ్డముగ వైచిరి. పైనుండి యింకను వెల్లువ వచ్చుచుండుటఁ గొన్ని త్రొవల సందులు మాత్రము విడిచి తక్కినవాని నెల్ల మూయించెను. మన బాటసారియుఁ దానెప్పుడును బల్లియలలో నివసించినవాఁడు కాఁడు కావున అదియాతనికి వింతగఁ దోఁచుటచే శీతబాధంగూడ లెక్కసేయక వారి వెంటం జని యచ్చటి చర్యలం దిలకించుచుండెను. ఆతని కదియొక యుత్సవమువలెఁ దోఁచుచుండెను. అప్పుడు వర్షము చక్కఁగా వెలిసెను. వెలుతురును గోచరించుచుండెను. అక్కడికి వచ్చిన కాపులలోఁ గొందఱు చేఁపల కొఱకు వలలు వేయువారుగను, గాలములు వేయు వారుగను నుండిరి. పసులకాపరియు యజమానుని తోడ నుండుచుఁ గలుజులకు మోపులు వేయించుట మున్నగు కార్యములయందాసక్తుఁడై యుండెను.

ఆ తరుణమునఁ దూర్పున నించుక తెల్లవాఱెను. కాకులు గూయసాగెను. కోళులును ఇండ్లపై నెక్కి శబ్దింప మొదలిడెను. పాంథుఁడును ఇదియే యదనని యెంచి, వారికేరికి నెఱుకపడకుండ నటనుండి కదలిచనెను. ఇటుఁ గార్యములెల్లం బూర్తియగుటచేఁ గాపులును వారి వారి యిండ్లకరిగిరి. పసుల కాపరియు నాతని యజమానుఁడు నింటి కరుగుదెంచిరి. పాంథుఁడు లేనందున యజమానుఁడును నాశ్చర్యపడెను. అప్పుడు పసులకాపరి యిట్లనియెను.

పసుల:—స్వామీ! నా పలుకులు కొంతవఱకు యథార్థమగు నని మీ కిప్పుడైనం దోఁచుచున్నదే!

యజ:—ఈ విషయము నీ వెట్లు కనిపెట్టితివి?

పసుల:—మావా రానగరమున గొప్పపసులమంద నిడికొని యున్నవారని మనవిచేసి యుంటినిగదా! వారిం గూడ నేను నప్పుడప్పుడును బోవుట కలదు. ఆ తరుణమున నితని నెన్నియో తడవలు చూచియుంటిని. దాననే వీని గుణములు నాకుం దెలియును.

అని వారిరువురు నిట్లు సంభాషించుచుండి యానల వారి వారి పనుల కరిగిరి.

పదునాల్గవ ప్రకరణము.

మంగళిక వైపుణ్యము.

వింధ్యారణ్య మధ్యమున నిద్దరాండువాండ్రొక్క-నాంటి మధ్యాహ్న సమయమున దారి నడచుచుండిరి. వారిలో ముందు నడచు నామె సర్వ లక్షణ శోభితయై-యుండెను. ఆమె మనసున దుఃఖమధికముగ నుంట నామె ముఖమును జూచిన వెంటనే విశదమగు లాగున నుండెను. సుందరు లేడ్చినను నవ్వినట్లే యుండునను నటుల నామె మోమునందలి వైవర్ణ్యముగూడ నా యంగనా మణికొక తీరగు గాంతి నుత్పాదించుచుండెను. అటులం జింతాకుల యగు నామె;

“ఆహా! కాలమెట్టి విపరీత పరిణామి యాయెను! పరాక్రమ నిధికిం బుత్రినై, ప్రతిపక్ష శిక్షకులగువారికిం దోడం బుట్టువనై, శూరాతి శూరుండగు మహారాజున కిల్లాలనయ్యును ఇప్పు డిట్లశరణనై కుందుచున్నదానను. మహాత్ముండగు భర్తయే లేనితఱి నీ వ్యర్థ జీవితమేల? సౌమంగల్య హీనయగుచును ఇట్టి నీచపు బ్రదుకు బ్రదుకుటకన్నను జచ్చుటయ మేలగును. దుఃఖ మాజీవవేదనాకరము. దాని నీబాధ కోర్చుటకన్న క్షణమాత్ర పీడావహమగు మరణ మెంతయు నుత్తమము. పతి ప్రాణమనియును బత్నిశరీరమనియును శాస్త్రములు ఘోషించుచున్నవి. అట్టి యెడ ప్రాణహీనమగు కళేబరము భాతి భర్తృహీనయగునే జీవించుట యుచితమగునది కాదు.”

అని తలంచుచు నీమె ముందువైపున నడచిపోవుచుండెను. ఈమె కించుక వెనువైపున వచ్చు నామెయు “ ఔరా ! ఏమి

నా యదృష్టము ! గూఁటినుండి తప్పిన పిట్ట తనంతటన వానలలోఁజిక్కుకొనియెను. ఈమెకామరణవార్త దెల్పఁగూడదని భావించి దాచికొనియుండియు నాసంకల్పమెల్లను వ్యర్థమాయెను. నాపడినపాటు లెల్లనట్టేఁ గలియులాగున ఆనీచుండు సుదర్శన శర్మ నిన్న నాయగ్రహారమున ఈవిషయముం జెప్పెను. అది మొదలీమె యాహారము గ్రహించుట లేదు. నిద్రించుటలేదు. విశ్రమించుట లేదు. ఎల్లప్పుడును ఇట్లే సంచరించుచున్నది. ఈమెతోడ నడచి నడచి నాకాళ్లెల్ల నొచ్చుచున్నవి. మిట్ట యనక పల్లమనక ఛాయయనక రప్పయనక యీమె ననుసరించి నడుచుట దుర్భరముగ నున్నది అయినను నన్నా యాశాపిశాచిక వెన్నాడఁ బ్రేరేపించుచున్నది. ఇఁక నీమెం దారికి ద్రిప్పి కొనుట యెట్లు? ఒక తెన్నునకు వచ్చెఁగదా నా యుద్యమమును కుపక్రమింప వీలగును? ఏమి చేసిన నీమె కీవ్యసనము మానఁగలదు? ఎంత యాలోచించినను నాబుదికి ఏయుపాయమును పొడఁగట్టకున్నది.

అయినను సతీతిలకమగు నీమెను ఒక తుచ్ఛునకు అర్పింప నెంచుట దోషావహమని తలఁతును. నాయకార్య కరణమున ఈశ్వరుఁ డప్పుడప్పుడును తగుశిక్షవిధించుచున్నను మరల మరల ఇట్టి దురుద్యమమునకుం బూనుట యసమంజసము. పవిత్రమగు నావును గటికవాని కమ్ముఁజూచువారి పగిది నేనిట్టి అకార్యమున కుపక్రమింపనగునా? అపకారియగు వానికిం బ్రతీకార గవేషణ మావశ్యకమగుచుండ దాని మాని ఇట్టి యకృత్య మొనర్చిన లాభమేమి? ఆపాపికొఱకు నేనెన్నితడవలో దుష్ప్రవర్తన మొనర్చియుంటిని. అపవాదముల పాలైతిని. ఇహపర

విదూరుండ నైతిని. ఈవిషయ మొక్కింతయేనిం దలంపక, యక్కటిక మించేని లేక, నాకంత యుపకారము గావించిన వానికొఱకా నే నీనీచకార్యము సేయందలపెట్టుట!

ఇట్లని యూరకున్నమాత్రము రాఁగల లాభమెద్ది? గౌరవములేని యిట్టి యగస్త్యభ్రాతలు పెక్కురుండుట కన్నను యుక్తిశాలియై వానిగాంచిన వాఁడొక్కఁడున్నను సరియగు. రాజాశ్రయ మున్ననేకాని అట్టిది సఫలము కాదు"

అని యాలోచించుచు ముందుఁబోవు నా స్త్రీని వెంట నంటిపోవుచుండెను. ఈమెముఖము చూచినంతనే తృణచ్ఛన్న కూపమనుట వ్యక్తపడులాగున నుండెను. సరళహృదయ య య్యా వ్యసన మధ్యగత యగుటచే ముందుబోవు నాయువిద యిది గుర్తింపలేకపోయెను. ఆమె నిక్కముగ నీమె యుప కారిణియేయని తలంచెను.

మొదటి స్త్రీ:—తరళికా! మార్గ మధ్యమున నన్నాదరించి నీ యకారణ వాత్సల్యమును వెల్లడి పఱచితివి. ఆ ఋణమును నేనెట్లు తీర్చి కొనఁగలను? నాకిపుడంత కుఁడు సమీపించి యున్నాఁడు, నే నిఁక మనఁజాలను. నా యనంతరమున కన్యాకుబ్జమున కరిగి రాజ్యశ్రీ మృతినందెనుగాన యుక్తమగు వారి రాజు గావించి కొనవలసినదని నాయాజ్ఞయని నా మంత్రులతోఁ జెప్ప వలయును. ఇంత మాత్ర ముపకృతి గావించిన నదియే పదివేలు.

తరళిక:—అన్నియు నెఱిఁగిన నీ వింటు పామరులవలె వ్యసన పడుట పాడిగాదు. పుట్టినవారి కెప్పట్టున నైనను మర

ణాము సంసిద్ధము. ఇది తెలిసియు నీవిట్లు చింతించుట
కదు పొరబాటు. ఎంత వగచినను మరణించినవారు
తిరిగి రాఁజాలరు.

రాజ్యశ్రీ:—భార్యకు భర్తతోడిదలోకంబు. విధవయగు నా
జన్మ మెందుకనకు? నే నెవరి కొఱకు మనవలయును?
"మృతే మ్రియేత యానారీ సాస్త్రీ జ్ఞేయా పతివ్రతా"
యను నార్యోక్తి చొప్పున నా పాతి వ్రత్యమును
వెల్లడి సేయుదానను.

తరళిక:—అను మరణ మశ్లాఘ్యమని నేఁ జెప్పసాహసింపలేదు.
భర్తవెంట నొక్కచితిపై నారోహించినచో అయ్యు
దియే సహగమనమగును. ఎచ్చట నెప్పుడో మృతి
నందిన భర్తకుగాను ఇచ్చట నిప్పుడు మరణించుట
యుక్తముకాదు.

రాజ్యశ్రీ:—భర్త సమీపమునఁ గాకున్నను తత్పాదముల
ధ్యానమును సేయుచు ఎచ్చట మరణించినను నను
మరణమే యగును.

ఇది వినిన తరళికయు బదులేమియు నాడఁజాలక మౌన
మవలంబించెను. రాజ్యశ్రీయును అంతకంతకు అతిశయించుచు
పైపైఁ బొరలివచ్చు వ్యసనము నాఁపికొనఁజాలక ఇట్లని విల
పింపసాగెను.

"అహా! నాథా! అరి భయంకరుఁడవగు నీ విట్లు అకాల
మరణమునందుట కాలపరిణామమే కాని అన్యముకాదు. నీ
మాటల కెన్నడును ఎదురాడని నన్ను విడనాడి ఇట్లొంటరిగా
నేఁగుట భావ్యమగునా! నీ పాద పరిచర్యంగాని ఒండెద్దియును

ఎఱుఁగని నా మెడ నేయుపరాధముం జూచి నను పీడితివి. బ్రదికిన దినములలో ఇచ్ఛకము లాడుచుండి మరణించినది తెలిసి, ఇంకను ఈకఠినాత్ముఁరాలు జీవించియుండుట యేటి న్యాయమని తలఁపకుము. ఇదె వచ్చుచున్నదాన. నే రాకున్న నన్య కాంతా విముఖుఁడవగు నీ కచ్చట సుఖమెట్లు కల్గును? మీరట కష్టపడుచుండనే నూరకుండు దాననే! చెలి! నాకిటఁ జితిం జేర్చుము. అం దగ్ని నిడుము. దానిం దరికొల్పుము.

ఔరా! మహారాజ కులోత్పన్ననై, సకల జన సంస్తూయమానుఁడగు వారికిం బత్నినైన నా యాజ్ఞ ఇప్పుడు క్రియాశూన్యమయ్యెనుగా! గౌరవ శూన్యలగు వారి మాటల నెవ్వరు పాలింతురు? గతభర్తృకనై, గౌరవ హీననై మనుటకన్నను చచ్చుటమేలు. మరణింప నున్న నామాటల నెరులు వినకుండిన దాన నాకేటి లోటును గలుగఁబోదు. ఇదె పడియుండు నీ పుల్లల నేరి చితిం జేర్చి అందగ్ని నిడి ప్రజ్వరిల్లఁ జేసెదను గాక అర్ధాంగి నగుట తన్మూలమున నెల్లరకును విశదము కాఁగలదు."

తరళిక:—స్వామినీ! నా నుడులిట్టుఁ బెడచెవిం బెట్టుట తగనిపని. ఆత్మ హత్యకంటె నధికమగు దోషము వేఱులేదు. జీవ కారుణ్యము ముఖ్యమని వచియించు శాస్త్రము లెల్లను అన్యహింసయే తగదనుచుండ ఆత్మహత్య యెట్లుచితమగును?

రాజ్యశ్రీ!—ఇయ్యది యాత్మ హత్యయని పల్కుట సాహసము. శాస్త్ర సమ్మతము గాని దాని రాజ్యశ్రీ యెన్నడు ఆచరింపఁ గడంగదని తెలుఁగుము.

తరళిక:—అమ్మా! నిన్నెట్టులైనను ఈ యుద్యమమునుండి మర
ల్పవలసినట్టుల స్నేహపాశము నను నిర్బధించుచున్నది.

రాజ్యశ్రీ:—అది నీ కసాధ్యము. న్యాయ పరతంత్రనగు
నేను నీ వాక్యములకు లోఁబడఁజాలను. స్నేహము
నిన్నిట్లు పురికొల్పుచున్నదనుట నేను నెఱుఁగుదును.
దాన రాజ్యశ్రీయను వనిత యొక్కర్తుక యీ లోక
ములో నుండెనను వార్తయె మఱచి పొమ్ము. అగ్ని
ధారా పూర్వకముగఁ బరలోకమున కేఁగిన నా భర్త
కు ఆత్మ సమర్పణము గావించికొంటిని. అతని వస్తు
వాతఁడు గ్రహింపఁ నెంచిన నే నడ్డుపడఁజాలుదునే!
దాన దత్తాపహార దోషమును సంక్రమించును.

అని యామె అచ్చటి కాష్ఠములం జేర్చి చితి నొక
దాని నిర్మించి తన యొద్దనుండు చెకుముకి రాతిచే నగ్నిం బుట్టిం
చెను. అంతఁ దానా యగ్నిం బడఁ బోవుచు భర్తయొక్క యా
కృతిని మానసములోన ధ్యానించి నిజప్రయత్నమున నుండెను.
ఆ తరుణముననే హర్షవర్ధనుఁడును, విభాకర మిత్రుఁడును,
మంగళికయు నటకువచ్చిరి.

"అమ్మా! హూణహరిణ కేసరి యని ప్రసిద్ధి గాంచిన
ప్రభాకర వర్ధనుని గర్భమున జనించి యిట్లగతికవై కానన
మునఁ బడి మరణించిన నింక నుపయోగ శూన్యుఁడనగు నా
బల మెందులకు? మిత్రపత్ని కంటికెదుర మృతి చెందుచుండ
నామెను రక్షింపనేరని యీ జన్మమేల? వేయిమంది పరి
చారికలు చుట్టి ముట్టి యుండ నుత్సాహముతో వచ్చుచుండు
నీ విట్లొంటరిగ నడచవచ్చి ఈ యడవిలోఁ బడి చావనుండ

చూచుచుండు నానేత్రము లుండి ఫలమ్మేమి? నిన్నిటుల [illegible]ములపాలు చేసిన నా కీహర్షవర్ధన [illegible]నే? ప్రయోజన శూన్యుఁడనగు నా కీవిభాకర నామము మాత్రము చాలదా! మిత్రునిఁ గాని మిత్రపత్నినిగాని కాపాడఁజాలని నా కీమిత్ర నామము జంటించి కొనుట వ్యర్థమే కదా! ఇట్టి యమంగళము జరుగుచుండ నిషేధింపఁజాలని నా కీమంగళిక యను నామము నిరర్థకమే కదా! సోదరీ! ఇది న్యాయము కాదు. బిడ్డా! నీకిది పాడిగాదు. అమ్మా! ఈ సాహసము నీతి విదూరము. నిలు నిలు మిది చాలును. అఁగు మాఁగు మిఁక నిట్లు సేయఁదగదు. తాళు తాళు మిఁక నిట్టి కార్యముల మానుము."

అని యిటు పేరాక్రోశించుట విని యదరిపడి రాజ్యశ్రీదేవి వెనువైపునఁ జూచెను. హర్షవర్ధనాదు లచటికి వచ్చుటకు విస్మితయై చిత్రార్పిత ప్రతిమవలె కొంత వఱకుండి;

"హా! సోదరా! ఎదురవచ్చు నీపై నెంతయో యాదరము చూపు మాబావ పరలోక సుఖాపేక్షి యయ్యెఁగా! అయ్యో! ఒక్కెడ సోదరీ వైధవ్య వ్యథయును ఇంకొక వైపున సోదర మరణ దుఃఖమును ఇట్లిరువంకల వ్యసనము గలుగుటచే నీ శరీరము శుష్కించి శల్యావశిష్ట మయ్యెనుగా! నీయీయాకారముం జూచియుఁ బవులని నాగుండియ శిలయో యయఃపిండమో వజ్రమో యైయుండ నోపును. ఆహా! భిక్షుకవర్యా! మీమాట చెవి సోఁకినంతనే అతివినమ్రుఁడై మిమ్మెదుర్కొని కొనివచ్చు మా మిత్రము లోకాంతరమున కరిగెఁగా! సర్వసంగ పరిత్యాగులరయ్యు మిత్రప్రీతిని మాత్రము విడఁజాలకుండిన మీకిప్పుడు దుర్భర వ్యసన ముదయించెనుగా!

ఇంక మీ సేవగను నీవగిమ వీడుట దుస్సాధ్యము. ఇంతకును నాఁటి మీమాట పాటింపమి నిట్టి పాటు గల్గెను. చెలీ! పరిచారికలం బరమప్రీతలఁ గావించు నా పరమ కారుణికుఁడు పరలోకమున కరిగెఁగా! ఇంక మీ దీనదుఃఖము నెట్లు నిస్తరింపఁగలరు? ఇంతకును ఎవ్వరు మాత్రమేమి సేయఁగలరు? మీరెల్లరును నాకాజ్ఞ యొసఁగుఁడు. పరలోక వాసియగు నా పతికి పరిచర్యలుసేయ నరుగుదును."

హర్షః:—చింతార్ణవగతుఁడనగు నన్ను నింకను నలియఁ గొట్టకుము.

రాజ్యశ్రీ:—అట్లని నా సహధర్మచారిణీత్వమును వీడుట న్యాయమగునా?

మంగళిక:—దుఃఖాకులవగుటచే నీ మదికిది పొడఁగట్టకున్నది. శ్రాద్ధాదుల మూలమున భర్తను సంతుష్టుం గావించి వ్రతోపవాస కర్శితవై మని యుంట చచ్చుట కన్నను శత గుణం బధికమగును.

రాజ్యశ్రీ:—నీ వెంత చెప్పినను నాకు దీనికంటె వేఱు ధర్మము౦దు లాగునఁ దోఁచుటలేదు.

విభాకర:—అమ్మాయీ! పెద్దవాఁడను. నీభర్త యొక్క మిత్రుఁడను. సన్న్యాసిని. నా మాట త్రోసి పుచ్చక యాచరింపవలసినది నీకు విధియగును. నీవిప్పు డాచరింప నెంచినది యాత్మహత్యయే యగును. నీ చెలియాడిన లాగున మనియుండుటయే యుక్తము. ఇందఱి నొక్క పెట్టున దుఃఖసముద్రమున ముంపఁ జూచుట పాడికాదు. నీ భర్తకును నాకును ఆకృతులు భేద

ములుగాని హృదయ మొక్కటియే. కావున నేనాడు
నది నీభర్తకును అభిమతమగునదనియే యెంచుము. నా
యాజ్ఞ మీఱిన నాయానగలదు.

ఇది వినిన రాజ్యశ్రీయును బదులాడ లేక ఇంచుక యాలోచించి తుదకు మది నొక్క తీరునఁగుదుటఁ బఱచికొని తన నాఁటి ప్రయత్నమునుండి మరలెను. ఇంతవఱకును రాజ్యశ్రీ ననుసరించి వచ్చుచుండిన యా యాఁడుదియు హర్షవర్ధనాదులు సంభాషించుచుండఁ దానిటులఁ జింతింపఁజొచ్చెను.

"ఏమి యీ చిత్రము! ఈ మంగళిక యెట్లు చెఱఁ దప్పెను? శశాంక గుప్తుం జంపి హర్షవర్ధనుఁ డీమెం జెఱ నుండి విడుదల గావించియుండునా? లేక యేదే నొక తంత్రమునఁ దప్పించికొనివచ్చియుండునా? అబలయగు నీమె యంతటి సాహసమునకుఁ దివురునని తలఁపను. ఏది యెట్లున్నను నా చిరకాల కాంక్షితము వమ్మయ్యెను. ఇంక వీరు నను జూడక మున్నే ఇటనుండి పలాయనము గావించుట యుచితము."

అని యెంచి మెల్లె మెల్లగ నా ప్రదేశమునుండి వెడల నుపక్రమించెను ఎచ్చట వా రనుమానింతురోయని వెనువైపునఁ దిరుగక వారి కభిముఖయై యుండినట్లు వెనుక వెనుక నడుగు లిడుచుఁ బోవుచుండెను. మంగళిక మాత్రము తానిచ్చటికి వచ్చినది మొదలుగ ఈ వ్యక్తిపై దృష్టియునిచి యుండినది కావున దీని పలాయనపరాయణతను గనిపెట్టి హర్షవర్ధను నవలోకించి యిట్లనెను.

మంగళిక:—ఆర్యా! మహాత్ముల సెలవు గైకొనక చల్లఁగ జాఱఁ జూచుచుండు నా వ్యక్తింబట్టి బంధింపుఁడు.

అంత మీరెఱుఁగని కొన్ని యంశములు మీకు వ్యక్తము కాఁగలదు.

ఇది విన్న రాజ్యశ్రీ మంగళిక యిట్లాడుటకు కారణమేమని యాలోచించుచుండ నా వ్యక్తియు నీ మాటలు విన్నంతనే యించుక వేగముగా నడుగు లిడఁజొచ్చెను. ఇది గనినంత హర్షవర్ధనుఁడును విభార మిత్రుఁడును ఆవ్యక్తి పై నించుక సంశయించిరి.

రాజ్యశ్రీ:—చెలీ! వీరన్యులని భావింపకుము? మన వారియెడ మనకు సంశయమేల? నను మరణమువలన నివర్తింపఁ జేయ నెంచిన నీ కోర్కెని వీరు పూర్తి గావించిరికదా! అట్టి వారి యెడ నీకీభీతియేల?

రాజ్యశ్రీ పలికిన యీ మాటలఁ బెడ చెవినిఁబెట్టి ముందుకంటె నింక కొంత వడిగా నడుగు లిడఁజొచ్చెను. మంగళిక మాత్ర మప్పటప్పటి కావ్యక్తియొక్క యడుగుల వేగమధికమగుట గుర్తించుచుండెను.

మంగళిక:—దేవా! ఆలసింపకుఁడు. దూరగతమైన మీకుం బట్ట నలవిగాకుండును. నాకుం జూడనిది పుంవ్యక్తి యనియే తోఁచుచున్నది. దేవిగారి విరోధివర్గములోని వాఁడని తలఁచుచున్నాను.

రాజ్యశ్రీ:—చెలీ! నాకీమె దారి నెంతో సాయమొనరించెను. అట్టిదాని యెడ నీ విట్లు పొరబాటుగు నభిప్రాయమును బొందుట న్యాయముకాదు.

మంగళిక:—అమ్మా! మిమ్ము వంచించి శశాంక గుప్తునొద్దఁ జేర్చుటకుఁ దోడ్పడునుగాని మీ క్షేమమునకు సాయ

పడునది కాదు. గోముఖవ్యాఘ్రమై స్త్రీ వేష సంఛన్నుఁడగు పురుషాపశదు నెట్లు నమ్మెదరు? వీఁడా శశాంకగుప్తుని చెఱనుండి తప్పించికొని వచ్చిన జయచంద్రుఁడేయగును.

ఈ మాటలు వినినంతన యా వ్యక్తియు వెను దిరిగి పర్వులిడ నారంభించెను. అంత నేనుఁగుపై కుర్కుకు సింగము వలె హర్షవర్ధనుఁ డావ్యక్తి పయింబడి పట్టికొనియెను. ఈ సందర్భమున శిరమున నతికించికొని యుండిన యావ్యక్తియొక్క మాయ వెండ్రుకలు రాలిపడెను. ఇదిగనిన రాజ్యశ్రీకి నాశ్చర్యము నొండాయెను. ఈ విషయము గనిపెట్టిన మంగళిక బుద్ధి కుశలత కెంతయు మెచ్చికొనెను. హర్షవర్ధనుఁడు నెంతయు నలుకబూని యాతనిం బంధించి, జుట్టుపట్టి వీరియొద్ద కీడ్చికొనివచ్చెను.

మంగళిక:—ఓరీ! జయచంద్ర పాతకా! దేవిగారి శశాంకగుప్తునొద్దఁ జేర్పనెంచిన నాఁటి రాత్రి నా దెబ్బ జ్ఞప్తి యున్నదా! గోపవేషమున నాపల్లెనుండ నీవరు దెంచి ననాఁడే నిన్నా యూరి వారికింబట్టి యీ నెంచితినిగాని దయతలఁచి విడిచి పుచ్చితిని. నీచున కెంతమాత్ర ముపకృతి యొనర్చినను దానికిం బ్రతిగ మన కాతఁ డపకృతియే కావించును. కాఁబట్టియే కదా మా దేవి గారి కపకారము గావింపసమకట్టి యిట్టి వేసమూని వచ్చితివి! నీ వాపల్లెను వీడినది మొదలు నేనును నిన్నన్వేషింపఁదలఁచి యా యూరు వదలితిని. అచ్చటచ్చట నిను వెదకుచు నీ ప్రాంతమున నీ వీమె ననుసరిం

చుట గనిపెట్టి మీ కెఱుక రాకుండ మీ వెంటనే
వచ్చుచుంటిని. నీ వాచరింపనున్న దుర్ణయముల
నప్పుడే యూహించి తెలిసికొంటిని. హర్షవర్ధన మహా
రాజిచ్చట నుండుట నాకు మున్నే తెలియును గావున
ఈమె యుట్లగ్నింబడ నుద్యోగించుట దెలిసి వీరిం దోడి
కొని వచ్చితిని. నే వీరితోడ సంభాషించుచుండినను
నీపైఁగల దృష్టిని మాత్రము వీడకుంటిని. ఈ లాగున
నుండ నీవు దప్పనెంచిన నెట్లు సాధ్యమగును?

రాజ్యశ్రీ:—నాఁడా పాడువడిన యింట నిను సాధించి
నంతనే పురుషవేషము ధరింపమని యాదూలకుందగు
నుడుపుల నాకొసఁగి, నాకుఁ దోడ్పడుటకై పురుష
వేష ధారిణులగు నేవురఁ బరిచారికల నేర్పఱచియు
న్నట్టు వచించి వెడలిన నీవు గోపాలక వేషము ధరింప
నేమికారణము?

మంగళిక:—ఆలాగున నీచే ననుజ్ఞాతనై వెడలిన దాన నీ నీచుని
వెన్నాడి నాచేతి కత్తితో నొక దెబ్బవైచితిని. ఇంత
లోన నీతని సహచరుఁడు చంద్రకేతువను వాఁడు వెను
వైపుననుండి యురుగుదెంచి నను బంధించెను.

రాజ్యశ్రీ:—నీచుఁడు వాఁడు చోరునివలె వెనుకనుండి వచ్చి
బంధింపకున్న వీరవనితవగు నీవు వారికిఁ జిక్కకుందువు.
సరి. తర్వాతియుదంతము నెఱిఁగింపుము.

మంగళిక:—అంత వీరిరువురును నా తోడఁ గన్యాకుబ్జనగ
రము వెలుపలి కరుగుదెంచిరి. అచ్చటఁ గొందఱు
భటులును నొక పల్లకియు నింతకు మున్నే వీరు సిద్ధ

పఱచియుంట నన్నుం దారోహింపమనిరి. ఒక్కదానను బెక్కురతో విరోధించుట పాడికాదనియు సమయము చూచి తప్పుట సరియగునని తలంచి యందెక్కితిని. వీరును నను దేవిగారనియే యెంచి యుండిరి. ఈరహస్యము శశాంకగుప్తునితో సంభాషించువఱకును బయలు పెట్టనైతిని. అప్పుడును నా పరిచారికాత్వము దెలిసినఁ దన కనురూపం గానని నను విడిచి పుచ్చునని యే యట్లు పలికితిని. అప్పటికిని ఆ నీచుఁడు నన్ను గామింతుననన వానిం దిరస్కరించితిని. వాఁడాగ్రహించి నన్ను కారాగారమున బాధించెను.

రాజ్యశ్రీ:—ఆహా! నాకొఱ కెన్ని కష్టముల పాలైతివి! నిక్కముగ సఖివన్న నీవయగుదువు. ఆవలి వార్తం దెల్పుము.

మంగళిక:—దైవము నా కనుకూలించుటచే నాకుఁ దెలియని యొక్కరుఁడు పొరబాటున నన్నుఁ దన వానిగా భావించి యొక్కనాఁటి నిశీథమున నటనుండి తప్పించెను.

ఇది వినిన జయచంద్రుఁడు తనమది నిట్లని తలఁచెను. "ఆహా! ఈమెకుఁ దెలియని యానూత్నుఁ డెవ్వఁడు? ఆతఁడే నా భావయగును. నను విడిపింప నరుదెంచినవాఁడు పొరబాటున నీ బిడను తప్పించియుండ నోపును. నా కాహారము నందిచ్చు వాఁడు "నా భావనను విడిపింపఁ బ్రయత్నించుచున్న వాఁ"డని నుడివియుండెను.

రాజ్యశ్రీ:—మంగళికా! ఆవలి వృత్తాంతముం దెల్పుము.

మంగళిక:—నేను నటనుండియే కళింగ దేశమున నొక యగ్ర

హారమున కిరిగి అందా యగ్రహారపు టధికారియింట పసులకాపరినై యుంటిని. ఆవలి వృత్తాంత మింతకు మున్నే వచించితినిక దా!

రాజ్యశ్రీ:—చెలీ! అలనాఁడు నన్నితని బారినుండి కాపాడి నదిగాక నేఁడును ఇతనిపాలఁబడకుండ ననురక్షించితివి. నీ ఋణమును నే నెట్లు తీర్చికొందును!—జయచంద్రా! నీవా యగ్రహారమున కెట్లు వచ్చితివి!

జయచంద్రుఁడు:—ప్రాణములమీఁదికి వచ్చినప్పు డింక దాఁప నేల? మంగళిక మూలముననేఁ దోఁడి తెచ్చినది దేవికాదని తెలిసి ఆ యాగ్రహమున రాజు నన్నంధకార దుర్గమునఁ జెఱనిడెను. నేనట దైవానుకూల్యమునఁ జిక్కిన యొక యినుప ములికిని ఆధారము గావించికొని ఆ చెఱసాల వెనువైపునఁ ద్రవ్వుచుంటిని. ఇటులఁ గొంత కాలము సేయునప్పటి కొక్కఁడు దూరఁదగునంతకంత యేర్పడినది. దేవునిపై భారము వైచి సాహసించి ఆ కంతనుండి క్రిందికిదూఁకి చెఱఁదప్పితినిగదాయని సంతస మందితిని. ఆ ప్రదేశము దట్టమగు చెట్లచేఁ గ్రిక్కిరిసి యుండునది కావున నాయరణ్యమార్గమున బయలుదేఱి తిన్నఁగా వెళ్ళుచును ఆపల్లియలో ఈమెను సంధించితిని. పురుషవేషమున నుండుటచే ఈబిడను గుర్తింపనైతినిగాని గొంతుసవ్వడిమాత్రము ఎట్చటనో వినినలాగుననున్న దని ఇంచుక సంశయించితిని. మరల నన్నెవ్వరుకనిపెట్టె దరో యని భీతిసెంది, ఈమె కెఱుక రాకయే వెడలితిని. అచ్చటచ్చటఁ దిరుగుచుండ మిముఁగని వంచనచేనపహ

రించి మా రాజును కర్పించి ఆతనిమన్ననలం బడయనెంచి ఈ యాఁడు వేసము బూని సమయము నిరీక్షించుచు మిమ్మనుసరించివచ్చు చుంటిని.

విభాకర:—అమ్మాయీ! బాధవిముక్తిం గాంచిన నీవు ఇచ్చటికి ఎట్లు రాఁగలిగితివి?

రాజ్యశ్రీ:—పరిచారికల సహాయము గలిగి కొంత కాలము కన్యాకుబ్జమున నుంటిని. వారి మూలముననే అటఁ గుట్రలు సేయుచున్న దుష్టచతుష్టయముల జాడఁ గనుఁగొంటిని. అంత వారింబట్టి అమాత్యు నధీనము గావించితిని. పూలమ్మినచోటఁ గట్టెలమ్ముటకు ఎవ్వరిష్టపడఁగలరు? మంచి సమయమున సంతసము నిచ్చుచుండిన యా నగర మప్పుడంత వెగటుగఁ దోఁచెను. ఆవల నాయూరినుండి వెడలి అచ్చటచ్చటఁ దిరుగుచును ఈ మాయావిరోధు వడసితిని. పతింబాసి మన నొల్లక చావనుండు తఱిమీచే రక్షింపఁబడితిని.

అవల విభాకర మిత్రుఁడు చెంతనుండు తన యాశ్రమమునకు రావలయునని కోరుటచే నాతని యానతి చొప్పున నెల్లరు నచ్చటి

పదునేనవ ప్రకరణము.

ఆత్మమిత్రుఁడు.

నభోమండల విద్యోతమానమగు ఖద్యోతబింబము ఆతపమున లోకముల నెల్ల దవులఁ బెట్టునటులఁ దోఁచుచుండెను. ఎల్లరును నీడను జేర నత్యంతము ప్రియపడు చుండిరి. ఆకులెల్ల మాడి నేలరాలనవనీరుహము లవకేశులయ్యెను. పక్షులుగూడఁ దమగూండ్లను వీడి వెలికిరా జంకుచుండెను. జలాధారములు శుష్కీభూతము లగుచుండెను. చెట్టును జెట్టు నొరయుటచేఁ గలిగిన యగ్ని చెంతనుండు వెదుళులపొదలం దవిలి మండుచుండ 'ఫెళ్లు, ఫెళ్లు' మని ధ్వని వినసాగెను. ఒక్కింతయైన గాలిలేకుండుటచే నాకు నాడకుండెను. అట్టియదనున నహిపుర ప్రాంతకాంతారమున నొక స్కంధావార మమరియుండెను. పటకుటీరములు బెక్కట నుండెను. స్కంధావారములోని యధికారి వర్గమంతయును బయలునకు రాకుండెను. సూర్యరశ్మి యించుకైనం జొరనేరనిమొక్క పొదయందుఁగొందఱు సైనికులుండిరి. వా రొండొరులతో నీలాగున సంభాషించుచుండిరి.

"వారు మనల విశ్వసించుట నాకాశ్చర్యము పెంచుచున్నది."

"మన నటన లందులకుఁ గారణము. కావున నా విషయమున జాగరూకులమై మెలఁగవలయును."

"సరి. ఇఁక నాతని వధించు టెట్లు?"

"మెల్లగ మాటలాడుము. ఎవ్వరేని వినిన నపాయము వాటిల నోపు."

"అట్లేల సంశయించెదరు? ఈ యుగ్రా తపమున నేరును రాఁజాలరు. కావున నో యక్షమిత్ర సేనాపతీ! వాని సంహారమున కుపాయము సెలవిమ్ము."

"మీరీ రేయి నాసీచుఁడు భండియుండు పట కుటీరము వెనువైపునఁ బల్లము త్రవ్వి లోనంజొచ్చి నిద్రితుఁడగు వానిం గడతేర్పుఁడు."

"నిద్రించుచున్నవానిం జంపుట యయుక్తముకదా!"

"ఓయీ! అశ్వత్థామ యంతటివానికే దోషము గలుగనప్పు డాచింత మనకేల? సేనాపతి యానతిచ్చిన లాగునఁ జేయుదము."

"మిత్రుని వాక్యము శ్లాఘాపాత్రము. దాన నామాటల విశ్వాసముంపుఁడు."

"మేము నల్వురమును అటులే కావింతుము."

వీరిటు మాటలాడుచుండ వీరికించుక సమీపముననుండు నొక పొదయందిద్దరు యువకులాసీనులై యుండి వీరిమాట లాలించి ఈ లాగున సంభాషించికొనిరి.

"మిత్రమా! వింటివే వీరిమాటలు! అదేలకో నాకుమాత్ర మీ యక్షమిత్రునిపై ఆదినుండియు సంశయ ముదయించి యున్నది. వీని యీ వంచనలఁ దెలియని సరళ హృదయుఁడగు భండి వీరినెంతయు విశ్వసించియున్నాఁడు. నామము నిర్దిష్టమగుటచే వీఁడొక్కఁడు మాత్ర మెఱుకపడెను. తక్కినవా రెవ్వరై యుండ నోపుదురు? ఇప్పుడీ యాపదనుండి భండిం గాపాడు నుపాయ మాలోచింప వలయును."

"నేనొక్కఁడ వారింగడ ముట్టింపఁగలను. మీసాంగత్య మహిమను నాకంతటి శక్తియులవడి యున్నది."

"ఏ యుపాయముచే నీకార్యము పూర్తి గావింతువు!"

"కార్యము కొనసాగునంత దనుక మాత్రము గుప్తముగానుండ వలయునుగదా! వారిమాటల మన మాలకించినలాగున మన మాట ధ్యెరులు నాలింప నోపును."

"కానడి యేవంక నుండిన నేమి? ఇలుఁ జేయుటయ కదా ప్రధానము!"

అని యిటు వీరు మాటలాడికొనుచుఁ గొంతసే పచ్చట విశ్రమించి సాయం సమయమున వారివారి గుడారముల కేఁగిరి.

పదియాఱవ ప్రకరణము.

చంద్రకేతుని విచారణ

"మిత్రమా! నాప్రాణములఁ గాపాడ నరుగుదెంచితి వని తెలియక నీ విషయమునఁ గ్రూరత్వమును బూనితిని గదా యని చింతిలుచున్నాను."

"అపరాధి యని యెంచికదా మీ రట్లాచరించితిరి!"

"ముందు వెనుకలాగయక నిను బంధించినది దోషమ నియే భావించువాఁడను."

"అట్టి యెదనున నాలోచించుచుండుట తగని పని. మీ రప్పట్టున నాచరించినది యుక్త తరమ యగును. ఎదుటి వా రపరాధులేయైనను దేవరవారికి వారింబట్టి యర్పింపక నేను స్వతంత్రించి యక్కార్యము గావించినది ఈశ్వర సమ్మతము గానేరదు. కాఁబట్టియే దైవము నా కా శిక్షగావించెను."

" నీమిత్రుఁడు నాచెవిని 'వీఁడును వీని యనుచరులును శశాంగుప్తుని పక్షమువారు. నామిత్రుఁడు మంగళేశ్వరుఁడు వీరివలన నీ కాపద గలుగకుండ రక్షించె'నని యూఁదువఱకు నీవే ద్రోహివని యెంచి యుంటిని. ఆవల నా పడినయది పొరబాటని యూహింపఁ గలిగితిని. అజ్ఞాన కృతమగు దానికిఁ బశ్చాత్తప్తుఁడ నైతిని. అపరాధ మొక్కఁడను సందియ మొక్కఁడను గలుగుట లోక సహజము. ఇంతకును నీ వా ప్రదేశమున లేకుండిన నాకు సంశయ ముదయింపఁ జాలదు. త్రాటి నీడం గూరుచుండి పాలు ద్రావినను మద్యము గ్రోలెననియే జను లెంతురు. ఎవ్వరెట్లెంచినను నిజము నిలుకడమీఁదఁ దెలి

యక పోవునా? ఎప్పటికైనను సత్యము విజయము గాంచ కున్న నీ లోకము సర్వమును శూన్యమ యగుఁగాదె?—అది యటుండనిమ్ము. అడుగ మఱచితిని. నీ యుదంత మెఱుకవఱచి నాకు మహోపకారము గావించిన నీ మిత్రము నేఁటి యుదయమున మన కెఱుక లేకయ వెడలుటకు మాత్రము నే వగచుచున్నాఁడను."

"నాకు నయ్యది వింతగనే యున్నది."

"ఇట నుండిన నేదే నపాయము గల్గునని సంశయించి ఎచ్చటికే నరిగియుండ నోపును."

"మీచే రక్షితులమగుమా కపాయము గలుగునను శంక జనింప నవసరము లేదు. ఏదే ననుల్లంఘనీయమగు ఘన కార్యము తటస్థించి యుండునుగాని వేఱుకాదు. చంద్రకేతుని పక్షమువార లెవ్వరే నీతని కపాయము గల్గింతురను భీతి నాతఁ డరిగి యుండునని తలఁచు చుంటిరి కాఁబోలు! వాని పక్షము వా రానల్వురును జచ్చిరి. ఇంక నెవరును లేరు. కావున నట్టివలవని సంశయము పడనక్కఱలేదు.

"నాఁటి రేయినుండియు నే నేరిని నమ్మకుంటిని. వారిని వీరి ననవేల? ఒక్కొకపుడు నన్నే నేను నమ్మఁజాలకున్నాఁడను."

"మీరిఁక నిట్టి భ్రాంతిని వీడుఁడు. పేరు మార్చికొని మాఱు వేసము పూనియుండినందున వానిం దెలియఁజాలకుంటిని గాని లేకున్న వాడప్పుడే యమసదనమున కరిగియుండఁడా?"

"వాఁడపుడు తామ జెఱనుండి విడిపింపఁ బడితినని గదా వచియించెను! అట్లు కారాగారమున బంధింపఁ బడు

టకుఁ గాని విడిపింపఁ బూనుటకుఁ గాని కారణ మేమి యుండ నోపును ?"

"విచారణ సమయమున నది బయల్పడునని యెంచె దను."

"అప్పుడు మాత్రము అది బయలు వడకుఁ బ్రసక్తి యేమి కలదు ?"

అంకులకుం దగు ప్రసక్తి మనము గల్గించికొనవచ్చును లెండు."

"అట్లే కానిమ్ము. క్రమముగ నారయుదము."

అని యిటు భండియు మంగళేశ్వరుఁడును సంభాషించు చుండ నొక భటుఁడువచ్చి కుమార చక్రవర్తి యరుదెంచుచుం డుటం దెలిపెను. అంతవారు నాతని కెదు రేఁగి తోడ్కొని వచ్చిరి. సేనాపతియుఁ గుమారు నర్హావిధిం బూజించెను. కుమారు ననుమతిని దాను నుచితాసనమున నుపవిష్టుఁ డాయెను.

కుమార:—సేనాపతీ ! ఈ నూతన పురుషుఁ డెవ్వఁడు ?

భండి:—ఈతనిది ఘూర్జరదేశము. మంగళేశ్వరుఁడని యీతని నామము. ఇతఁడును, ఇతని మిత్రుఁడు మఱియొకఁ డును శత్రువిజయము గావింపనున్న మనకుఁ దోడు వడ నెంచి మనసేనలోనం జేరియున్నవారు.

కుమార:—ఈ కాలమున జిరపరిచితులం గూడ నమ్మ వలను గాకున్నది. అటులుండ నపరిచితుల నెట్లు విశ్వసించు చుంటివి ?

భండి:—వీరిద్దఱి మూలమున నాకుం గల్గనున్న గొప్ప యాపద యొకటి తప్పెను. కాఁబట్టియే వీరిని విశ్వసించితిని.

కుమార:—ఈతని మిత్రుఁడతఁ డెచ్చట ?

భండి:—నిన్నటినుండియు నతఁడు గానవచ్చుట లేదు.

కుమార:—అట్టులా ! అయిన వీరి విశ్వాస పాత్రత ఇంచుక సంశయాస్పదము.

భండి:—అటుగాదు. కారణమేమియు నుండక యాతఁ డాలాగున నంతర్హితుఁడుగాఁ జాలఁడు.

కుమా:—కారణ మేముండునో కనుఁగొనఁ గల్గితివా !

భండి:—ఇచ్చటఁ జరిగిన యొక కుట్రయే కారణ మగునని నే నూహించెదను.

కుమా:—ఆఁ! కుట్రయా !

ఇది వినిన మంగళేశ్వరుఁడును ఈతని యప్పటి ముఖ భావముల నవలోకించి ఆశ్చర్యపడియెను. కారణమేదియో తెలియక విస్మయ పడుచు ;

"ఈతనిఁ జూడ నేదోయొక కుట్రం గనిపెట్టుట కెంతయో పాటుపడియుండ నోపునని తోఁచెడిని. లేకున్నఁ గుట్ర యనుమాట చెవిసోఁకఁగనే ఇట్టి మార్పునెందనేల? ఈతఁడు స్థానేశ్వరమున కరిగి యుండె వనికదా చక్రవర్తి వచియించి యుండెను ! అచ్చటనేమైనఁ గుట్రలు జరిగియుండునే! అట్లైనం దానికిఁ గారకు లెవ్వరు ? రాజ్యవర్ధనునిచే నోటువడిన హూణులేమైనం గుట్రల నాచరించి యుందురా! అది సరిగాదని తోఁచెడిని. ప్రభాకర వర్ధనునిపేరు విన్న నదరుచుండియు, రాజ్యవర్ధనుని మూలమున ననేకవిధముల బాధలుచెంది బ్రదికియుండిన నంతియు

చాలునని యెంచిన యాహూణు లింతటిపని కుపక్రమింపఁ జాలరు. ఇంక మాళవ దేశవాసు లెవ్వరేని యిట్టి యకార్యమునకుఁ గడంగిరా!—అయ్యదియు యుక్తమని గోచరింపదు. మాళవదేశ వాసులెల్లరును హర్షునందెంతయును భక్తిం గలిగి యున్నవారని వినియుంటిని. దాన నా శంక యనవసరము. ఈ వంగదేశపు రాజగు శశాంక గుప్తుఁ డీలాటి యక్రమమున కుద్యమించి యుండును. ఇది సరియనియే నాకుఁ దోఁచుచున్నది. ఇంతకును గ్రమముగ నదివిదితము కాఁగలదు. ఇంతలోన తొందరపడనేల?" అని యాతఁడు చింతించుచుండెను.

కుమార:—అదియెట్టి కుట్రయో తెలుపఁగలవా?

భండి:—శత్రు పక్షచరులుకొందఱు నన్ననుసరించి సేనలలో గొప్ప పదవులనంది, నను సంహరింపఁ దఱివేచియుండిరి. ఒక్కనాఁటిరేయిని నేను నిద్దురఁ బోవుచుండ నా గుడారము క్రింద గోతిని ద్రవ్వి లోనం దూర నుద్దేశించుచుండ వారి కుట్రలఁ గనుగొనిన నాయీ మిత్రుఁడు వారిం బరిమార్చి నన్నాయాపదనుండి తప్పించెను. కుట్రకుం గారకుఁడగు వాఁడు మాత్రము బంధితుఁడై యున్నాఁడు. ఈతని మిత్రుని పలాయనమునకును ఆతఁడే కారకుఁడగునేమో యని సంశయించుచున్నాను.

కుమార:—అతని యునికి మనకు లేశమైనం దెలియునా?

భండి:—శశాంక గుప్తుని పరివారమునఁ జేరినవాఁడు. చంద్రకేతువని యాతని పేరు—స్వామీ! మీరడిగిన విషయమేమొనదియు వివరింపకుంటిరే!

కుమార:—నే నటు స్థానేశ్వరమున కరుగునప్పటికి శశాంక గుప్తుని పక్షమువారు కొందఱు రహస్యాలోచనము గావింప నున్న వారనుట తెలిసికొంటిని. ఇంతలోన శబరనాయకుఁడును ఆతని యనుచరులును ఈ విషయమున నాకుఁ దోడువడ నెంచి వచ్చిరి. నేనును వారిం బిలిచికొని శత్రుపక్షము వారు మంతన మాడనున్న చోటికి వెడలితిమి. అది యొక యటవీ మధ్యము. అచ్చటనుండు నొక పాడువడిన యాలయమున వారు రహస్యాలోచన గావించెదరని మాకు మున్నే తెలిసి యుండుటచే నా యాలయమునకుఁ జెంతనుండు నొక పొదం దాఁగియుంటిమి. శశాంక గుప్తుని పక్షమువారగు భీమసింహ మలయకేతువులను వార లిర్వురును గనకలతికయను నొక వారాంగనయు నక్కడి కేతెంచిరి. వారలతోడన సేనాపతియును వచ్చెను. వానిఁ గాంచిన యా వేశ్యయు ఆతని కోడలివలె నటించుచు ; ఈ పురుషు లిర్వురును కుమారశబరనాయకులనియు, వీరు శశాంకగుప్తున కనుకూలురై రనియు, మీ రాజును ఈశబరనాయకుని యధీనమున నున్నవాఁడు గావున నీరాజ్యమును వంగదేశపు రాజున కర్పించి, రాజ పక్షమువారేరేనుండిన వారింబట్టి బంధించి వీరి యధీనము గావించునది యనియు, ఇప్పుడు నీ యధీనముననుండు సైన్యమే ఈ మాత్రము పనికిఁ జాలెడిదనియు, అప్పుడు నీకు నమాత్య పదవి నొసఁగెదరనియు, నీవటుఁ గావింపకున్న నిది

వలలోనన వారికి జిక్కియుండు నీకుమారుని శిరము ఖండించి వైతురుగావున నాకుఁ బ్రతిబిక్ష యొసంగు మనియుఁ బ్రార్థించెను.

భండి:—ఏమి చిత్రము! మీ యెదుటనే మీ వేషములు వైచి కొనుటయా! ప్రేక్షకుల యెదుట వారి చరిత్రము నభిన యించు లాగున నున్నది, ఆవలియుదంతము సెలవిండు.

కుమార:—సేనాపతి మాత్రము వారిమాటలనమ్మి చేయునది లేక వారికి లోఁబడఁ బోవుచుండ నావంచకత్రయముం బట్టి బంధించితిమి. సేనాపతి కిది కుట్రయగుట నెఱిఁ గించితిమి. ఆవల విచారణ గావించితిమి. శశాంక గుప్తుని ప్రేరణచే తా మట్లాచరించినటుల వచించిరి. అంత వారిం జెఱనిడి అచ్చట శాంతిని నెలకొల్పి తిమి. నీకీ యుద్ధమునఁ దోడ్పడ నెంచి నేను వచ్చితిని. శబర నాయకుఁడును నిజసైన్యముతోడ సాహాయ్యము నకై వచ్చుచున్నవాఁడు.

ఈ మాట లాలకించుచుండిన సంగళేశ్వరుఁడును విస్మి తుఁడై ఈలాగునఁ దనమదిందలపోయఁ దొడఁగెను. "ఇది యేమి విపరీతము! స్థానేశ్వరపు సేనాపతి యంత తెలివిలేని వాఁడే! ఎవ్వఁడీ మలయ కేతువు? భామిని భర్తయా! అతఁ డిట్టి యకార్యమున కేలపూనును నామసామ్యముంబట్టి నే నిట్లిశంకం జేయుట సరికాదు. మలయతు వేడ? శశాంకగుప్తుఁ డేడ? వీరికి మైత్రికుదురుటేడ?" అని యెంచి తనమనసు కుదుట పఱచి కొనెను.

కుమార:—భండీ! ఇఁక నీవా బంధితునిం బిలువ నంపుము. వానింగూడ విచారింతము.

భండి:—అటులే కావించెదను.

అంత భటు నొక్కనిం జీరి చంద్రకేతువుం బిలచికొని రమ్మనెను. ఆతని యానతి చొప్పునఁ దత్క్షణమే వాఁడు చంద్రకేతువుం దోడి తెచ్చెను. ఇన్ని దినములుగ నిర్బంధముననుండియును ఇంచుకేని లజ్జావ్యసనములఁ బొందక యథా పూర్వముగఁ గాన నగుచుండెను.

భండి:—ఓ యీ! నీవాస్తవ నామ మెద్ది?

చంద్ర:—ఒక్కనికి రెండు పేళ్లుండుట మీ రాజ్యమున నలవడియుండ నోపును.

మంగళేశ్వరుఁడు:—అగును. బంధితులు రాజున కెఱుక వడక చెఱనుండి తప్పి వచ్చుటయు మా రాజ్యములోని యలవాటేయగును.

ఈ మాటలు వినినంతన వాని మానస మదుర నారంభించెను. అంగములుఁ వడంకఁ జొచ్చెను. కన్నులు దిద్దిరం దిరుగసాగెను. ఇంతకు మున్నుండిన ధైర్యమంతయుఁ బటాపంచమయ్యెను. మంగళేశ్వరుఁడు మాత్రము ఆతని యపుడప్పటి మార్పులఁ గని పెట్టుచుండెను.

కుమార:-సత్యమాడుము. లేకున్న దండన మింకయును నధికము కాఁగలదు, మూఁగవానివలె నూరకుండిన నీ సేనాపతి నిన్నూరక విడువఁడు.

మంగళేశ్వరుఁడు:—ఈతఁడు సామ వాక్యములకు లోఁబడు వాఁడు గాఁడు. అంత్యోపాయముం దక్కనన్య మీతని

యొడ నుపయోగ కారికాదు. తన పేరు మాత్రము చెప్పిన నంతయు సత్యము పలికిన ట్లెంచుచున్నాఁడు. రాజ్య(శ్రీ)దేవియని చెప్పి మంగళికం దెచ్చి రాజున కర్పించి యసత్య మాడినందులకుగా శశాంక గుప్తుని చే రాజకీయ కారాగారమున నుంపఁబడి, యటనుండి తప్పి వచ్చెనని యీతని చరిత్రము మన మెఱుఁగమని యెంచియున్నాఁడు.

ఈ మాటల వినినంతన ఆ సభలోని వారెల్లరు నాశ్చర్యపరవశులైరి. చంద్రకేతువునకును ఇది యీతని కెట్లు తెఱుకవడియెనని విస్మయము జనించెను. ఇంకను దాఁ నూరకుండిన బాగుండదని యెంచెను. నిజము చెప్ప నోరు తెఱచెను. ఇతలో నసత్య మేదేనిఁ బల్కి- ఈ యాపదనుండి తప్పుట కగునా యని యాలోచించెను. తుదకు సత్య మెఱిఁగించుటయే సరియని తలఁచెను.

చంద్ర:—అయ్యా! నా రహస్యమును మీరెట్లో కనిపెట్టితిరి. ఇంక మీ యొద్ద దాఁపఱిక మేల? నేను శత్రుప్రేషితుఁడనుగాను. ఈతఁడు చెప్పిన లాగునఁ జెఱనుండి తప్పినవాఁడనే. నేనటు విడివడు నపుడు నా తోడ నల్వుర శిక్షితులఁ దప్పించితిని. వారితోడ నెటకేనరిగి తల దాఁచికొన నెంచితిని. ఇట్లుచ్చటచ్చటం దిరుగుచుండ మార్గమున మీ సేనలం గంటిని. మిము సంహరించి తన్మూలమున శశాంక గుప్తుని మెప్పువడసి యథాపూర్వముగ నా పదవులఁ బొందఁ దలఁచితిని. దాననే నా యనుచరులతోడ మీ యొద్దం జేరి

తిని. దైవము విపరీతమగుటచే నా యాసలు వృథ యాయెను. అయినను సత్య మొక్కటి వచించెద వినుఁడు. నా బొందిని నూపిరి యుండువఱకును రాజ ద్రోహిని కాఁజాలననుట మాత్రము నిశ్చయము.

భండి:—ఇప్పటికైనను బుద్ధి తెచ్చికొని నీ యీ యభిప్రాయమును మార్చికొనినచో బాగు పడెదవు.

చంద్ర:—అతని యుప్పుదిని యాతని విషయమున ద్రోహ మాచరించు నంతటి నీచుఁడఁగాను.

మంగళేశ్వరుఁడు:—ప్రాణములం దీయ నెంచిన వాని రక్షింపఁ జూచు వాఁడొకఁడు. స్వల్పాపరాధములఁ గొండంతలుగా భావించి, తనకై యెదుటివాఁడు పడిన పాటుల లెక్క సేయక, అపరాధమున కంటె నధిక మగు దండన గావించు కఠినాత్ముఁ డొకఁడు. వీరిలో నెవరు గొప్పవారో, నీ వెవ్వారి నాశ్రయించుట బాగగునో యాలోచింపుము.

కుమార:—మంగళేశ్వరుఁడాడిన చొప్పునఁ జక్కఁగ నాలోచించి కొనుము. నీ కింకను గొంతకాలము వ్యవధి నిచ్చెదము. అంతవఱకును నిర్బంధమునుండి తప్పఁజాలవు.

అని యాతని భటుల వెంట నంపెను. పిమ్మట నెల్లరును దమ సేనల నడిపించికొని గౌడపురాభిముఖులైరి.

పదునేడవ ప్రకరణము.

గణదాసాదుల విచారణ.

పూర్వకాలమున విదేహ దేశమున, నగరరత్నమని ప్రసిద్ధిగాంచిన దీ కన్యాకుబ్జమే. ఇది పరమజ్ఞాని యని వాసిగాంచిన జనక మహారాజు మున్నగువారిచేఁ బరిపాలింపఁబడిన పవిత్ర క్షేత్రమని యెల్లర మెప్పును బడసియుండెను. అది వీరాతివీరులగు మహారాజులచేఁ బరిపాలిత పూర్వమయ్యును గుప్తరాజుల యీర్ష్యా మూలమునఁ గొన్ని దినములనుండియు నరాజకమైయున్నది. మంత్రులు ఎంతయో జాగరూకత గల్గి యారయుచుండినను ప్రజలకు మాత్రము రాజు లేఁడను చింతవాయకుండెను. అమాత్యులు నిజబుద్ధి వైభవమున ఁజక్కఁగ నేలుచుండినను రంధ్రాన్వేషులగు శత్రు పక్ష చరులు కొందఱు అప్పుడప్పుడును గుట్రలు సేయుచుండిరి. రాజు మరణించిన యనంతరము రాజ్యశ్రీదేవి గానుపింపమికిఁ బ్రజలెల్ల మిక్కుల వ్యసన పడుచుండిరి. ఆవలఁ గొంత కాలమునకు ఆమె రహస్యముగాఁ జెఱఁబడి యుండి యందుండి తప్పుట జనుల కెఱుకవడెను. కుట్రకుఁ గారకులగు వారిని ప్రధానులు చెఱ నునిచియుండిరి. రాజపత్నిని వెదకుటకు మంత్రులు చారులను అచ్చటచ్చటికిని బంపియుండిరి.

అగ్నింబడనున్న రాజ్యశ్రీదేవిని హర్షవర్ధనాదులు రక్షించుటయు, వారీ రాజధానికి రానున్నదియుం దెలిసిన యమాత్యులు సంతుష్టస్వాంతులై పట్టణ మెల్లెడల నలంకరించు లాగున నాజ్ఞ చేసిరి. వీధు లెల్లను దోరణములచేతను జలువ

పందిళులచేతను నలంకృతములై విలసిల్లుచుండెను. దేవాలయ ములలో దేవున కభిషేకాదులు జరుగుచుండెను. బీదసాదలు దమ కధికారివర్గమువారు చేయు నుపకృతుల కెంతియు నలరుచుం డిరి. దేవాలయములయందలి మంగళ వాదిత్రముల మ్రోఁతలు మిన్ను ముట్టి చెలంగుచుండెను. వేదఘోష మెల్లెడలను బర్వి కర్ణరసాయనముగఁ దోఁచుచుండెను. రాజ బంధువులు దమ యరాజకత దీరనున్నదికదా యని మిక్కిలి సంతోషించి, రాజ్య లక్ష్మియే యేతెంచ నున్నదో యనఁ దనరు రాజ్యశ్రీ దేవి గారి రాక విని ఆనంద పరవశులై జయజయ ధ్వానములు సేయుచుండిరి. దేవిగారును హర్షవర్ధనుఁడును రాజ మిత్రుఁ డగు విభాకర మిత్రుఁడును ఏదారి నరుదెంచెదరో యని అన్ని దిక్కులం బ్రతీక్షించుచుండిరి. భర్తృమరణ వ్యాకులయగు నామె ప్రకటముగా రానిష్ట పడలేదని హర్షవర్ధను నొద్దనుండి వర్తమాన మరుదెంచుటచే మంత్రులు గుప్తమార్గమున వారిని నగరు లోనికి రప్పించికొనిరి.

మఱునాఁటి యుదయమున దేవిగారు నగరులోనం జేరి రని తెలిసినంత జనులెల్లరును విస్మితులయిరి. ఆదినమున రాజాస్థానమున మంత్రి సామంతాదు లాసీను లయియుండిరి. రాజసింహాసనమునఁ గీర్తిశేషుఁడగు గృహవర్మయొక్క చిత్ర పటముంచి యుండెను. హర్షవర్ధనుఁడును విభాకర మిత్రుఁడు నుచితాసనముల నాసీనులై యుండిరి. రాజ్యశ్రీయు మంగ ళికయు నచ్చటికి వచ్చి యుండలేదు. ప్రజలెల్లరును రాజుగారి మరణమే రాణిగా రాస్థానమునకు రాకుండుటకుఁ గారణమని తలఁచిరి. హర్షవర్ధనుఁడును మఱఁది యొక్క చిత్రపటమును

గాంచినంతనే అత్యంత విషాదాకులుండయ్యెను. విభాకర మిత్రుండును దనచెలికాని యకాల మరణమునకుం జింతించి యెట్టకేలకు ధైర్యమవలంబించెను. హర్షవర్ధనుండు నించుక తెప్పిరిలి కుట్రలోం జేరిన బంధితుల నచ్చటికి రప్పింప నాజ్ఞ చేసెను. మంత్రులును భటుల మూలమున వారిని రప్పించి హర్షవర్ధను నెగుర నిలిపిరి. బంధన శాలాధికారియగు గణదాసుండును, ఆరక్షక భటాధి కారియగు పాంచాలుండును, పురపాలక సంఘాధ్యక్షుండగు మిత్రగుప్తుండును, మండలాక్ష పటలికుండగు గంభీరవేదియు ఖడ్గహస్తులగు రాజభటులచేం బరీతులై యచ్చట నిలిచి యుండిరి. పాంచాలాదులు వ్యసనమున నున్న లాగున గోచరించుచుండిరి. సిగ్గుచేం దలల వంచికొని యుండిరి. గణదాసుండు మాత్రము ధైర్యము వీడకుండినట్లు గానంబడు చుండెను. హర్షవర్ధను ననుమతినిం బ్రధానామాత్యుండు వారి యపరాధముల విచారింప మొదలిడెను.

ప్రధానామాత్యుండు:—గణదాసాదులార! మీరు రాజకీయ విషయమునం గుట్రలు పన్నుచుండిన లాగునం దెలియ వచ్చెడిని. మీరే సత్యము వచియించినచో క్రమ శిక్షయగును. లేకున్న దండన యతిశయించును.

గణదాసుండు:—అమాత్యవర్యా! మాపైనారోపించిన యీ నేరము సరియగు నదికాదు. మేము రాజకీయ విషయమున నెట్టి కుట్రలును జేయలేదు. మారాజగు గృహవర్మగారి విషయమున మే మత్యంతము భక్తి గల వారమనుట లోకమున కెల్లను విదిత మగునదియే.

ప్రధానా మాత్యుఁడు:—రాజు మరణింపఁగనే దేవిగారిని నీవు చెఱనిడి యుండలేదా?

గణదాసుఁడు:—నే నామెం జెఱ నుంచినది యథార్థమే.

ప్రధానా మాత్యుఁడు:—అది యపరాధ మగునుగదా?

గణదాసుఁడు:—రాజుగారు మరణించిన పిదప లబ్ధవిజయుఁడగు మాళవ నాథుడేఁ మనకు రాజాయెను. అట్టియెడ నాతని మాట దాఁటుట రాజద్రోహమగును.

ప్రధానామాత్యుఁడు:—క్రమ యుద్ధ మొనర్చినవాఁడుగదా విజయి యగును! కపటమున మనరాజును సంహరించిన ఆ నీచుఁడెట్లు విజయము గాంచెనని యెంచితివి?

గణదాసుఁడు:—కపట మించుకేని లేక ఏ యుద్ధమునను జయము గలుగఁ జాలదు. అప్పటి నా యభిప్రాయము ననుసరించి ఆతఁడు విజయియే యగును.

ప్రధానా మాత్యుఁడు:—మీరా యటవీ మధ్యమున నాచరించిన రహస్యాలోచనము కుట్రలోఁ జేరినదికదా!

గణదాసుఁడు:—అది యపరాధమునఁ జేరఁజాలదు. నాయధీనమున నుండు వస్తువు అన్యునకు విక్రయింప నెంచుట దోషమెట్లగును?

ప్రధానా మాత్యుఁడు:—రాజకీయ కారా గారమున నున్న వారు నీ యధీనమైన వారని యెట్లు తలఁచితివి?

గణదాసుఁడు:—మాళవనాథుని మరణానంతరము రాజ్యవర్ధనుఁడు రాజాయెను. ఆతని శశాంక గుప్తుఁడు వంచనచేఁ జంపెను. అంత మనదేశ మరాజక మయ్యెను. అట్టియెడ నెవని యధీనమున నుండు దానికి వాఁడే

యధికారియగును. ఈ కారణమున నా తలఁచినది పొరబాటు కానేరదు.

హర్ష:—అట్లుండినచో అస్మ న్ముద్రాంకితమగు నా కల్పిత లేఖను రావింపనేల ?

గణదాసుఁడు:—నా యనుచరులు సంశయింప కుండుటకై ఆలాగున నాచరించితిని కాని మీ కది యెట్లు తెలిసెను ?

హర్ష :—లేఖావహులగు నిర్వుర సంభాషణము వినిన యొక్కరుఁడు మంగళికా మూలమున నా సోదరి యాపదఁ దప్పించి యీ వివరముల నంతయును నాకె ఱిఁగించెను.

జయ చంద్రుఁడు:—నా దుర్బుద్ధి పాయుటకు ఆతఁడే పరమాచార్యుఁడు. ఆతని యూరును పేరును విన(గోరెద. దయ తలఁచి, ఆ మహానుభావుం జూపిన వానికి నమస్కార మొనర్చి నాయాచరించిన పాపములనుండి యుత్తీర్ణుఁడ నయ్యెదను.

హర్ష :—అతఁడిప్పుడు భండితోడ యుద్ధమున కరిగియున్నాఁడు. అతఁ డుజ్జయినీనగరవాసి. గాలవుఁడని యాతని నామము.

ప్రధానామాత్యుఁడు:—జయ చంద్రా! నీ కాతఁడు పరమాచార్యుఁ డేలాగున నగును?

జయ చంద్రుఁడు:—నేనే యా లేఖావహులలో నొక్కరుఁడను. అతఁ డాలాగున దేవిగారిం దప్పింప కున్న శశాంకగుప్తు నొద్ద, నామెం జేర్చియుం

గును. అంత వంగదేశాధీశుఁడు నాపై నాగ్రహింపకుండు. అప్పుడు నాకుఁ గారాగృహ ప్రాప్తి యుండదు. మరల మరల నే నిట్టి యకార్యములనే యాచరించి పెక్కు పాపముల సంపాదించికొని యుందును. అట్టి కష్టములెల్లను ఆమహానుభావుని సత్కార్యాచరణ మూలమునఁ గదా నాకుఁ దప్పెను. మఱియు నీతఁ డామెం దప్పించుటచేఁగదా మంగళికకేను బరిచిత పూర్వుఁడ నైతిని. తన్మూలమునఁ గదా నే దేవిగారి నపహరింప నెంచినపుడు వింధ్యారణ్యమున నామెచేఁ గనిపెట్టఁ బడితిని. అదికారణముగ నాదుర్బుద్ధి మానెను. కాఁబట్టి మంగళిక నాకాచార్యకయగును. గాలవుఁడు పరమాచార్యుఁడునగు.

ప్రధానామాత్యుఁడు:—నీ వొనర్చినది చెడ్డది యైనను మా దేవిగారు చెఱనుండి విడివడుటకు నీవు కారకుఁడ వగుటచే స్తవనీయుఁడ వగుదువు.

జయచంద్రుఁడు:—నే నామె యెడఁబెక్కు తప్పులు గావించిన వాఁడను. స్తుతికి ననర్హుఁడను. స్వార్థపరుఁడనై ఆమెను శశాంకగుప్తున కధీనము గావింప నెంచిన పాపిని. కావుననే యంధకార గుహావాస శిక్షను ఈశ్వరుఁడు నాకు విధించెను. అంతటనైన బుద్ధి తెచ్చికొనక అచ్చటి నుండి తప్పిన పిదపఁగూడ నీమెను ఆ నీచు నధీనము సేయ నెంచిన నీచుఁడను. నే నొనర్చిన యపరాధములకు నను జిత్రవధ గావించినను జాలదు. అట్లుండ నీ హర్షవర్ధన చక్రవర్తి దయార్ద్ర హృద

యుఁ డగుటచే నను మన్నించెను. అభిమానించి తన యాప్తవర్గమున నన్నొకనిఁ గావించికొనియెను.

విభాకర:—పశ్చాత్తాపము గల్గినంతనే ప్రాఁత పాపములడఁగిన వగు. దాన నీ వెంతయుఁ గొనియాడఁ దగిన వాఁడ వేయగుదువు.

ప్రధానామాత్యుఁడు:—గణదాసాధులార! మీ యొనర్చిన వ్రాతయును అపరాధములే యగుచున్నవి. రాజుగారు మరణింపఁగనే ఈ రాజ్యము రాణిగారి యధీన మాయెను. కావున నామెను జెఱుచుచుట రాజద్రోహమే యగును. ఆమె నన్యున కర్పింపఁ జూచుట అంతకంటెను శతగుణాధికంబగు నపరాధ మగుచున్నది. కాఁబట్టి మిమ్ముదండింపఁ బోవుచున్నాను.

గణదాసుఁడు:—రాజాభిమానులమగు మమ్ము రాజద్రోహులని మీ రెంచుట సరికాదు. దండ్యాదండ్య విచారము సేయఁదగు మీరలే కఠినశిక్ష విధింప నెంచిన మిమ్మెదిరించు వారెవ్వరు? తల్లియే విషము పెట్టఁదలఁచిన నింక రక్షకు లేరుందురు? అది యకార్యమని తోఁచినచో మే మేల యాచరించి యుందుము. మా యప్పటి యధ్యవసాయము గుర్తింపక మీ రీలాగున నెంచుట న్యాయమగునా? ఇచ్చటి వారెల్లరును మీ కనుకూలురే యగుదురు. ఇంక మా మాట లాలకింపు వారెవరు? మీ యిష్టము చొప్పున జరిపి కొనుఁడు.

విభాకర:—అమాత్యా! ఏ విషయమునను తొందరపాటు పనికిరాదు. చక్కఁగ నారసియే సర్వమును జేయనగును.

ప్రధానామాత్యుఁడు:—అట్లయిన మీరేమి సేయుమనెదరు?

విభాకర:—మీ రాణి నాచరించినది దోషయుక్తమే యయినను వీరియధ్యవసాయము చొప్పున నది పాపము కానేరదు. మీరాదిం బడిన యభిప్రాయము పొరబాటగునది. కావున దాని మార్చికొని దేవిగారి యెడల భక్తిం జాటించినఁ జాలును. అట్లయినచో వీరిని దండింపక యూరక విడువవచ్చును. ఇది నాకుఁ దోఁచిన తెఱఁగు. ఇంతకును హర్షవర్ధన మహారాజు నభిమతము భంగి నాచరించుటయే యుక్తము.

హర్ష:—మీ రాడినదియే నాకు నభిమతమగుచున్నది.

గణదాసుఁడు:—ఇంక మే మెప్పుడును ఇట్టి యకార్యముల నాచరింపము.

గంభీరవేది:—నా జీవిత కాలము లోపల నెప్పుడును రాజద్రోహమను మాటయే తలపెట్టను.

మిత్రగుప్తుఁడు:—మన రాణిగారి యెడల నెప్పుడును సదభిప్రాయమే కలిగి యుండెదను.

పాంచాలుఁడు:—రాజభక్తి నెన్నఁడును విడనాడను.

అంత హర్షవర్ధను ననుమతి నమాత్యుఁడు వారి విడచి పుచ్చెను. ఆవల సభ చాలించి యెల్లరును వారి వారి యునికి పట్లు కరిగిరి.

పదు నెనిమిదవ ప్రకరణము.

భిన్నాభి ప్రాయములు

"ఆహా! ఈ దినమే సుదినము! మా స్వామి మరణించుటచేతఁ గలిగిన పరితాపము ఈ శుభ వీక్షణమున నించుక యుపశమించుఁగాక. రాజ్యశ్రీ దేవిగారిపై నీ రాజ్యభార ముంచిన నాభారము తీరినట్లగును. వర్షము రాకకై యెదురు చూచుచుండిన చాతకము తీరున ఇన్నిదినముల నుండియు నేరి యాగమనమునకై నిరీక్షించుచుంటినో యాదేవిగారు ఇప్పుడరుదెంచి నందులకు నాయంతరంగము సంతస మందుచున్నది. దేవిగారు. రాజ్యము పరిపాలించెదరు కదా యను నానంద మిప్పు డభివృద్ధమైనను ఆమె యనంతర మీ రాజ్యమున కెవ్వరు రాజగుట యనుచింత యొక వైపునఁ బొడము చున్నది. ఎంత ధనముండిననేమి? ఎందఱు బంధువులుండిననేమి? సంతతి హీనులగతి నిహీనమయగు! ఔరా! మౌఖరీవంశజులగు వారి సంతతి యంత మందెనుగదా! బీదలు కాపాడ లేక విసిగి కొనుచుండినను, ఈశ్వరుఁడు వారికి బిడ్డలఁ బెక్కుర నొసఁగును. సంపదచే నిండియుఁ దమ యనంతర మాద్రవ్యము ననుభవించుటకుఁ గుమారుఁడు లేకుండెఁ గదాయని వంతనందు వారికి ఒక్కఁ కుమారునైన నీక చింతలపాలు సేయుచుండును. ఈశ్వరేచ్ఛం గడచుట కేరికిఁ దరము? అయ్యది చేతితోఁ ద్రోసిపుచ్చినఁ బోవునది కాదు. ఇంతకును ఆమహాత్ముఁడు హర్షవర్ధనుఁడుండ నింక నేనేల చింతపడవలయును? విభాకర మిత్రుల యభిమతమును ఇట్లేయని తోఁచుచున్నది.

అబ్బా! ఏమి యీమె పట్టుదల? ఎందఱెన్ని చెప్పినను నన్నిటి నీమె పెడచెవిం బెట్టుచుండెను. రాజ్యభారము వహింప నీమె నంగీకృతం గావింప నెంత కష్టపడవలసె. మూర్తిమంత మగు మా యదృష్టదేవత యరుదెంచెనో యన నా ప్రభాకర మిత్రుఁలు వీరివెంట నిచ్చటికి వచ్చుటచే మాయాశలు వ్యర్థము గాకుండె. ఆ మహానుభావుఁలు లేకున్న నీ కార్యము కొనసాగి యుండనేరదు. సోదరుఁడగు హర్షవర్ధన మహారాజు మూలమునను గానిపనిని ఆయతిశ్రేష్ఠుఁలు సరివఱచిరి గదా! అట్టి మహామహుల నెంత కొనియాడినను దనివి తీరదు."

అని యొక నాఁటి యుదయమునఁ గన్యాకుబ్జమున నొక మేడపై నాసనోపవిష్టుఁడగు ప్రధానామాత్యుఁ డాలోచించుచుండెను. ఇతని చెంత మఱియొక యాసనముపై నింకొక పురుషుఁ డాసీనుఁడై యుండెను. ఈ పురుషుని మోమించుక వాడు వాఱియుండెను. ప్రధానామాత్యుఁడు నాతనింజూచి విస్మితుఁడై;

ప్రధానామాత్యుఁడు:—ప్రభాకరా! దేవిగారు రాజ్యపరిపాలన మొనర్ప నంగీకరించిరి. రాజ్య మరాజకముగా నుండదు. ఇట్టియెడ సంతసించుటకు మాఱు ఇట్లు వ్యసనము నందఁ గారణమేమి?

ప్రభాకరుఁడు:—విఘ్నము లెల్లంగడిచి యామె సింగపుగద్దియపై నారోహించినఁ గదా సంతసింప వలయును!

ప్రధానామాత్యుఁడు:—నీ మాట నా కాశ్చర్యము గలుగఁజేయుచున్నది. పాలించుటకు దేవిగారు నంగీకరిం

చిరి. ప్రజలు నధికారి వర్గమును ఒక్కటిగఁ జేరి యీ కార్యమున కెంతయు సంతోషము పొందియున్నారు. ఇట్లుండ దీని కిక విఘాతములు కలుగునను శంకను వీడుము.

ప్రభాకరుఁడు:—ప్రజలు నధికారి వర్గమును దేవిగారి పట్టాభిషేక సందర్భమున నేకాభిప్రాయులైనఁ గదా చింతిలకుండ వలయు. అదియే దుర్లభమని నా యాశయము.

ప్రధానామాత్యుఁడు:—ఈ విషయమునం గొంద అతృప్తులగుదురనియా నీవు తలంచుచుంటివి ?

ప్రభాకరుఁడు:—అగును.

ప్రధానామాత్యుఁడు:—ఆ విషయముల వివరించి చెప్పుము.

ప్రభాకరుఁడు:—గణదాసునిపై గౌరవ ముంచి యుండు కొందఱాతని పక్షమును సమ్మతించిరి.

ప్రధానామాత్యుఁడు:—గణదాసుని పక్షమేమిటి?

ప్రభాకరుఁడు:—మహారాజ మరణము మొదలు ప్రజాస్వామ్య ముండ వలయునని యాడుచున్న వారలు.

ప్రధానామాత్యుఁడు:—ఈ మాత్రమునకై చింతయేల ? ఆతని లోఁబఱచి కొనినచో ఆ చిక్కు వీడఁగలదు కదా!

ప్రభాకరుఁడు:—అంతియ కాదు. గంభీరవేది మున్నగువారు సంతతి హీనయగు దేవిగారి కంటెను హర్షవర్ధనునకుఁ బట్టము కట్టుట న్యాయమనుచున్నారు. కొందఱు నిరంకుశ ప్రభుత్వ ముండవలెననియుఁ గొందఱు ప్రజాప్రతినిధి సభకు లోఁబడి రాజుండ వలెననియు

నాడుచున్నారు. ఇట్లు అధికారివర్గ మంతయు భిన్నాభిప్రాయములు గలవారలగుటచే జనులును బెక్కురు పెక్కు విధములగు నభిప్రాయములం బొంది యున్నవారు.

ప్రధానామాత్యుఁడు:—శశాంక గుప్తుఁడు రాజు కావలయునని యేరునుం గోరనందున నదియే మనకు శుభసూచకము.

ప్రభాకరుఁడు:—ప్రసక్తమయిన దాని నుపశమింపం జూచుట భావ్యము, కాఁబట్టి ఇట్టివానితో తృప్తిచెందుట లాభకారి కాదు.

ప్రధానామాత్యుఁడు:—ఇట్టి చిక్కులు వేనవేలు కల్గినను వాని నతి శీఘ్రమునఁ జక్కపెట్టఁ గలను. ఇదె వారిం బిల్వనంపెదను.

అని గణదాసాదులం బిలచుటకు భటుల నంపెను. వారును శీఘ్రముననే బిలచి కొనివచ్చిరి. అమాత్యుఁడును వచ్చినవారి నాననోప విష్టులం గావించెను.

ప్రధానామాత్యుఁడు:—గణదాసా! రాణిగారి సింహాసనాసీనం జేయవలయునని నిన్న మనమెంచి యుంటిమికదా! వలయు సంభారముల నెల్ల సజ్జీకరించితివా!

గణదాసుఁడు:—దేవిగారికిం బట్టము గట్టుటకంటె ప్రజాస్వామ్యముం గల్గియుండుట మేలని నామతము.

గంభీరవేది:—శాసకుఁ డొక్కఁడు లేకుండినచోఁ బ్రజలలో శాంతి కలుగనేరదు.

పాంచాలుఁడు:—రాజునకు నిరంకుశాధికార మొసఁగినచో ప్రజలు కష్టముల పాలు గావలసివచ్చును. కావున రాజు ప్రజా ప్రతినిధి సభకు లోఁబడి యుండట మేలు.

గంభీరవేది:—ప్రజా ప్రతినిధి సభకు లోఁబడిన రాజుండుటయుఁ బ్రజా స్వామ్యము గల పాలన ముండుటయు సమములే యగును.

మిత్రగుప్తుఁడు:—ఎట్లైనను సంతాన హీనయగు మనరాణికిఁ బట్టము గట్టు టుచితము గాదని నే నెంచుచున్నాను.

పాంచాలుఁడు:—రాజ బంధువులలో నేరికైన నామె దత్త స్వీకార మొనర్చి కొనినచో వాని రాజుం గావించి కొననగు.

గణదాసుఁడు:—భర్తయనుమతి లేనప్పు డాస్వీకారము చెల్లుటెట్లు? కావుననే ప్రజాస్వామ్య ముచిత మగునని నే నుడువు చుంటిని.

గంభీరవేది:—హర్షవర్ధనుని రాజు గావించినచో ఆ చిక్కు తీరును గదా!

పాంచాలుఁడు:—అతఁడు నిరంకుశాధికారి యగును. కావునఁ బ్రజా ప్రతినిధి సభకు లోఁబడి యుండఁజాలఁడు.

గణదాసుఁడు:—మీరేమి చెప్పినను బ్రజాస్వామ్యము నందలి సుఖము తక్కినదానఁ గల్గనేరదు.

గంభీరవేది:—మీ రెంత వాదించినను రాజు లేకుండుట యయుక్తమనియే నా విశ్వాసము.

గణదాసుఁడు:—నీమాట లెప్పటికిని వినఁదగదు. నీవొననినఁ గాదను వాఁడవు.

పాంచాలుఁడు:—నీ యాలోచన చొప్పున నడచికొనినచోఁ
దప్పక చెడవలసినదియే యగును:

మిత్రగుప్తుఁడు:—గణదాసునిమాట లెన్నటికి నంగీకార్యములు గాఁజాలవు.

గణదాసుఁడు:—మీ మాటల వినినవారు బాగు పడుదురని యామీ యెన్నిక!

ప్రభాకరుఁడు:—అయ్యలారా! పెద్దలు మీరిటు కలహమున కుపక్రమించుట సరియగునా?

గణదాసుఁడు:—రాజ్యమొక్కనియధీనము గావించి మన మెల్లరము నాతని నిరంకుశాధికారమునకు లోఁబడి కష్ట మనుభవింప వలయునని యానీ యిష్టము.

ప్రభాకరుఁడు:—మీరిటు తగవు లాడుట మాని యొక మార్గమునకు రావలయునని యంటి నంతయే కాని వేఱు కాదు.

ప్రధానామాత్యుఁడు:—గణ సాదులారా! రాజు లేకుండిన రాజ్యము బాగు పడఁజాలదు. అట్లని మిమ్ము నిరంకుశాధికారము క్రిందఁ గష్ట మనుభవింపవలయునని నేఁ జెప్పుటలేదు. కేవల మస్వతంత్రుఁడై రాజు మన చేతిలో నుండుచు మన మాచరించు నక్రమము లెల్లం జూచుచుండవలయు ననియుఁ జెప్పుటలేదు. ప్రజలఁ గన్న బిడ్డలఁబోలెఁ గాపాడు రాజుండినచోఁ ప్రజాస్వామ్యపు ఫలముచే కూఱు. ప్రజలతోఁ గలిసి యుండక పోయిన నా రాజువలన మన కేమేలును గలుగ నేరదు. కావున నాతఁడు గర్వహీనుఁడై మనతోఁ జేరియున్న,

ప్రజాప్రతినిధి సభతో నాలోచించి మన కనుకూలము లగు కార్యము లొనర్చును. స్వాతంత్ర్య విహీనుఁడైన రాజు రక్షణ యోగ్యుఁడుగాఁ జాలఁడు గావున మన యోగక్షేమములకుం దగురీతి నారయఁ గల రాజుండినయెడలరాజుస్వతంత్రముగాఁబరిపాలించుటచేఁ గలుగు ఫలమును మనకుఁ గలుగును. వీని కను గుణముగ నుండునట్టి యాలోచనము చేయుట మన విధి. అయ్యది తేపు విచారింతము.

అని వారికి సమాధాన మొసఁగెను. వారును ప్రధానామాత్యుని వీడ్కొని వారి వారి యిండ్ల కరిగిరి.

పందొమ్మిదవ ప్రకరణము.

ఐక్య సూచన.

" ఆహా! సర్వాంగ సుందరియై, యన్వర్థాభిధానయగు నా మానిని మంగళిక యిట్టి దౌర్భాగ్యవంతునకా యబ్బును! మామిడి మొలక నాటునపుడే పండ్లపంపకమున కుపక్రమించు వానిం బోలె నాలతాంగి ఇచ్చటి కరుదెంచినంతన తనచేయిc జిక్కినటుల భావించి సంకల్ప సహస్రము లాచరించెను. వివాహితయగు కాంతనుగూడ విడనాడు నంతటి సాహసమునకును వెనుదీయని వానివలెc గాన్పించెను. తుట్ట తుదకుc బిట్ట గూcటినుండి యట్టె లేచిపోయెను. సిగ్గులచేటగునని యెంచి ఆ వృత్తాంతమున నెవ్వరితోడం జెప్పక పోయినను నీతని వగపుంగని సంశయించిన కొందఱీ మూలమున నిదియంతయును దెలియనాయెను. అను వ్రతయై, ఆతcడే దైవమని భావించు కులకాంత నలక్ష్యముసేయు వానికి వగపుగాక సుఖమెట్లుకల్గును?

ఔన—నమ్మి యింటికివచ్చిన యతిథికి విసము పెట్టి చంపిన వానికి సుఖమెట్లు కలుగును? లోక పాలుర యంశను గదా నృపాలుcడు జనించువాcడు? అట్టివాని హింసించిన వాcడు దైవ విరోధియే కాcగలcడు. దైవము వ్యతిరేకించి నచో నేకార్యమును గొనసాగనేరదు. పాపము లన్నింటి లోన రాజద్రోహ మెక్కుడగునది. అట్టి మహా పాతకము నించుకేని జంకు గొంకు లేక అవలీలగ నాచరించెను. వీని రాజ్యలోభమును స్త్రీ లోలతయు నెన్ని హత్యలకు మూలమాయెను?

పరమ సాధ్వీమణియగు నా రాజ్యశ్రీ దేవిం జెఱుపఁజూచెను. జయచంద్రాదు లామెం దఱిమినపు డాబిడ యెంతవగచెనో! పతివ్రతకంట నొక్క యశ్రుకణము రాలిననే కుల నాశన మగును. అట్లుండ నామెపడిన వ్యసన మీతని నూరకవీడునా? దాని ఫల మవశ్య మనుభవింప వలసినదియే. '

కుక్క యెంగిలి దినవలయు నన్న నయ్యదియు దుర్లభ మైనటుల, రాజ్యశ్రీ 'లభింపకున్న నామె దాసి యయినం జిక్కినఁ జాలునని యెంచిన నాబిడయుఁ జేయి దప్పెను. నీచ కార్యము లాచరించువాని కీశ్వరుఁ డిట్లే శిక్ష యొసంగును. దేవిగారు నెన్నియో తడవ లిట్టియకార్యము లాచరించుట క్షేమావహము గాదని మందలించియును ఆమె మాటలఁ బెడ చెవిం బెట్టెను. ఇంక మూర్ఖుని ఛందాను రోధమున వశపఱచి కొనుట యుక్తమని యెంచి యామెయు నీతని యకృత్యముల కేప్రతిషేధమును గావింపకున్నది. అలాగున నుండు కొలఁదియు నాతని దుశ్చర్యలు అధికములగుచున్నవే కాని తగ్గుట లేదు. నీచ కార్యము లాచరించు నీతనికి భార్యయగుటచే నెట్టి వ్యసనము పాలు గావలసియుండునోయని నిన్న 'వ్యసన పడుచు నామె కంటఁ దడిపెట్టి కొనియుండుట చూచియుఁ గూడనివాని పగిది నటించి యంతిపురినుండి యాతఁడు వెడలిపోయెను.

అమాయిక యగు మా దేవియు నొక్కొక తఱి నాతఁడు గపట స్నేహము నెఱప నరుదెంచిన నాతని వంచనం దెలియలేక విశ్వసించుచున్నది. దాననే కదా మంగళికయుండిన యీ కర్పూరసౌధమునకుఁ దన భర్తయొక్క మోహము నెఱుక పఱుప నర్ధరాత్రమున దూతికయై అరుగు లాగున

నాయెను. దాసియైనను నామంగళిక ఈమెకుందగు బుద్ధులఁ జెప్పి పంపెను. ఎవ్వరెంత చెప్పిన నేమిఫలము! మరల నాతఁడు హాసన్ముఖుఁడై యెదుర నిలచినంతనే అన్నియు మఱచును. ఆదినుండియును ఇట్టి నీచవర్తనుని బెదరునఁ దన యధీనము గావించికొనక సరళ హృదయయై ఆతని యిష్టము చొప్పునఁ బోవుచుండుటచేఁ గదా ఇన్ని కష్టములు కల్గెను! మించిన దానికి వగవఁ బనిలేదు. ఇంకనైనఁ ద్వారికిఁదెచ్చికొను విధ మారయుమని నా బోంట్లు నుడివిన భర్త యిష్టమున కన్యథా నటించుట పతివ్రతలకు భావ్యము కాదని వచించును."

అని యిట్లు లోకనాఁటి సాయం సమయమున వంగ దేశాధిపు నంతఃపుర పరిచారిక యొక్కతె తలపోయుచు నంతి పురిలోన నుండు రాణి యెదుట నిలచియుండెను. అంతకుఁ గొంత మున్ను శశాంక గుప్తుఁ డచ్చటికివచ్చి మిక్కిలి మక్కువ గల వానివలె నిచ్చకము లాడి వెడలియుండెను. తన్మూలమున సాధు శీలయగు నామె యెంతయు నలరుచుండెను. ముఖమును మిక్కిలి వికాసము గల్గియుండెను. ఆమె తన యెదుట నిలువఁ బడియుండు నా పరిచారికం గాంచి యిట్లనెను.

రాణి:—చెలీ! నేఁటి నీ మోముతీరు చూడఁ గాంతి దక్కి యున్నది. కారణమేమియో తెలుపుము.

పరిచారిక:—అమ్మా! హర్షవర్ధనుని సేనలు మన నగరమును ముట్టడింప వచ్చుచున్నవఁట. కుమారుని సేనలును భిల్ల సైన్యమును వానికిఁ దోడ్పడియున్నవఁట.

రాణి:—ఈవిషయము నీ వెట్లెఱుఁగఁ గల్గితివి?

పరిచారిక:—మన పురమున నెల్లెడల నిదేవార్త వినవచ్చుచున్నది.

రాణి:—రాజుగారెంతకును న్నిచ్చటికివచ్చి యుండ నీ వృత్తాంతము తెలుపరైరి. కారణమేమియో తెలియరాదు.

పరిచారిక:—దేవిగా రెచ్చట భీతిలెదరో యని చెప్పియుండరని భావించెదను.

రాణి:—మన సేనాపతి భీమసింహుఁడుండ మన నగరమన్యుల చేతిలోఁ బడ నేరదని నేనెంచెదను.

పరిచారిక:—దేవీ! సేనాపతియు నూరలేఁడఁట. ఇంక నెట్లుకానున్నదియో యెఱుఁగను!

రాణి:— సేనాపతి యూరలేక యెచ్చటికి నెళ్లెను?

పరిచారిక:—రాజుగారే యాతని నెచ్చటికో యంపిరఁట.

రాణి:—అట్లైన మనకు జయము గలుగుట సంశయమే యని యెంచెదను.

పరిచారిక:—దైవ మనుగ్రహించిన జయము గలుగుటకు లోపముండదు.

రాణి:—దైవమునకే యనుగ్రహ ముండిన సేనాపతి నిట్టి సమయమున నూరనుంచక తెఱుమునే!

పరిచారిక:—మనకు జయము గలుగ వచ్చు ననుటకుఁ గొన్ని కారణములు గలవు.

రాణి:—వాని వివరింపుము.

పరిచారిక:—భిల్ల సైన్యములు నాగరక శూన్యములు. కుమారుని సేనలును హర్షుని సేనలును నూతన స్థలమునకు

వచ్చుటచే నంత తీవ్రముగ యుద్ధమాచరింపఁ జాలవు.
కావున మనకు జయము గలుగవచ్చునని తలఁచెదను.

రాణి:—ఎట్లైనను మన సేనల నడపు వారొక్కరుండవలదా! ఇప్పటి మన రాజుగారి హితులెల్లరును భోగలాలసులే కాని యొక్కరైనను యుద్ధమున నిలువఁదగినవారు గారని యే నెంచెదను. ఇంక రాజుగారు తామే నడపి నచో నేమో చెప్పఁజాలను.

పరిచారిక:—రాజుగారప్రమత్తులై యుండినఁగదా సేనల నడపఁ గలుట!

రాణి:—అట్లేల యనెదవు?

పరిచారిక:—మంగళిక చెఱనుండి తప్పినది మొదలు వారి చిత్తమొక్క తీరున మాఱియున్నది. దానన ట్లాడవలసె.

రాణి:—ఆమె చెఱనుండి తప్పెనా? రాజుగారీవిషయము నాకేల తెల్పలేదు.

పరిచారిక:—చెప్పిన సిగ్గులచేటగునని మౌన మవలంబించిరి.

రాణి:—రాజుగారియెడ నించుకేని గౌరవ ముంపక ఇట్లు చులకనగా నాడుట నీకు సరికాదు.

పరిచారిక:—దేవీ! క్షమింపుము. ఏది యెట్లున్నను రాజుగారి మన సిప్పుడ న్యాయత్తముగా నున్నది. కావున సేనలు నడపుటకు వారికిప్పుడు సాధ్యమగునదికాదు. ఇంత కును గానున్నది కాక మానదు. అందులకై చింతిం చిన నేమి ఫలము? ఈశ్వరాజ్ఞలేని దేదియు జరుగఁ జాలదు. కాఁబట్టి దైవముపై భారము వైచియుండుట భావ్యము. పౌరుషము ముఖ్యముకాదు. దైవబలము

లేకున్నఁ బురుష ప్రయత్నమెంత యున్నను నేమి యుప యోగము? అతనిఁగాదని యణుమైనం గదల దనుట సత్యము. కాఁబట్టి యిప్పటి యీ చింతలమాని దైవ చింత చేయుచుండిన మేలగును. అతఁ డనుగ్రహించిన బ్రహ్మాండము నెల్లఁ దృణముగాను, తూలరాసుల నెల్ల గొప్ప కొండలపిండుగాను జేయఁగలఁడు.

రాణి:—అట్లైన నే నిప్పట్టున నగ్నిగృహమున కరిగి దేవ పూజలఁ గావింతును. నీవును పూజా ద్రవ్యములం గైకొని నా వెంటరమ్ము.

పరిచారిక:—అట్లే కానిమ్ము.

అని యందుండి వెడలి పూజాద్రవ్యములం గొనివచ్చెను. రాణి స్నానముచేసి శుచియై యగ్ని గృహమున కేఁగెను. అచ్చట దేవ పూజ సలిపి దైవమును ధ్యానముచేయుచు నిమీ లిత నేత్రయై నిలువఁబడియుండెను. శశాంకగుప్తుఁడు నంతః పురమున కరుదెంచెను. అచ్చట రాణింగానక పరిచారికల మూలమున నగ్ని గృహముననుండుట తెలిసి యచ్చటికి వచ్చె ను. కన్నులు మూసికొని యట్లు దైవమును ధ్యానించు నామెం జూచి విస్మితుఁడాయెను. పరిచారిక నందులకుఁ గారణ మడుగఁ దలఁచెను గాని ఎచ్చట నామె ధ్యానమునకు భంగము కల్గె డినో యని యూరకుండెను. రాణియుఁ దన చిత్తమును ఆభగ వంతుని యందు లయింపఁజేసియుండ నామె మది కీవిధమునఁ బొడఁగట్టెను.

ఎదుట నగ్ని గుండము. తన్మధ్యమునఁ గనక సింహాస నము. సింహ పీఠికా మధ్యమున సహస్రార యుక్తమై జ్వలిం

చుచుండు నొక చక్రము. చక్ర మధ్యమున మెఱయుచుండు రత్న కిరీటమునుగల యొక దివ్య పురుషుఁడు. అతని రెండు హస్తముల రెండు బంగరు గిన్నియలు. అందొక దానఁ బలు వన్నెల పూవులును వేఱొక దాన జ్వాలలు పైకెగయు నగ్ని యునుండెను. అతఁడట్లే నవ్వుచు నెదుర వచ్చుచుండెను.

ఇంతలోన నాతఁ డదృశ్యుఁడయ్యెను. ఇప్పుడా స్థల మొక యంధకార బంధురమగు గుహా మధ్యము. అందొక మూల శశాంక గుప్తుఁడు భయ కంపితుఁడైయుండె. రాజ్య వర్ధనుఁడు ఖడ్గపాణియై వానిం జపవచ్చుచుండెను. వాని యా కారముఁజూడ నతి భయంకరముగ నుండెను. అట్లు వచ్చినా రాజ్యవర్ధనుఁడు శశాంక గుప్తుని కంఠమును గత్తితో నఱుకు ట కుపక్రమించుచుండ వా రిరువురు నదృశ్యులయిరి.

ఇప్పుడది గుహామధ్యముగాఁ దోఁచక పూర్వమువలె నగ్ని గృహముగా నుండెను. మున్నుఁబోలె నగ్ని గుండమున సింహ పీఠికపై సహస్రార చక్ర మధ్యమున దివ్య పురుషుఁ డుండెను. పూర్వమునఁబలె నాతనిచేత బంగరు గిన్నె లేకుండెను. ఒక్క చేత నెత్తుటఁ దోఁగియున్న శశాంక గుప్తుని శిరము నింకొకచేత వాని మొండెమును గోచరించుచుండెను. అంత నా సాధ్వీమణియు భీతయై యిట్లు విలపింపసాగెను.

"హా! నాథా! మీరే గతియని నమ్మియుండు నన్ను వీడిపోవు టుచితమే! అయ్యో! రక్తసిక్తమగు మీ యాఖండిత శిరమును జూచి నేనెట్లోర్వఁగలను. నాఁడు నా వాక్యము లాల కించినచో నిట్టి దుర్గతి పట్టియుండదుగదా! ఓ యజ్ఞ పురుషా! ఇంతకు మున్ను నవ్వు మోమునఁ గాన్పించినవాఁడ వింతలోన

నక్కటిక మింతయైన లేక యిట్లు చేయనగునే! నా నాథుని శిరమును దేహముతోడ నతికించి పునర్జీవితునిగాఁ జేయుము. లేకున్న నన్నైనను సంహరింపుము."

ఈ మాటలాలకించిన శశాంకగుప్తుఁడు విస్మితుఁడగుచు;

"కాంతా! నేఁడేల యిట్లు భ్రమించుచున్నదానవు! నే నిదె నీ యెదుట నున్నవాఁడను, ప్రేయసీ! కనులు విచ్చి చూడుము."

అని యిట్లు భర్త వాక్యములు చెవి సోఁకినంత మీలిత నేత్రయై యెట్ట యెదుట నాతనిఁ గాంచెను. మొట్టమొదట సంశయించెను! ఆవలఁ దన శరీరము దాఁకి చూచికొనియెను. తానప్పుడు నిద్రావస్థయందు లేదని దృఢముగ నెంచెను. కన్నులు మూసికొనెను. పూర్వమువలె సహస్రార చక్రాదులు గాన్పించకుండెను. అంత మరలఁ గన్నులు విప్పిచూచెను. యథాపూర్వముగ భర్త యగుపడుచుండెను. అంతఁ దానింతకు మున్నుఁ గాంచిన దంతయును భ్రాంతిమూలమగున దని యెంచెను. భర్త సుఖియై యుండుట కెంతయు సంతసించెను. శశాంక గుప్తుఁడు నామె సోదార్చి యంతి పురము నకుఁ బిలిచికొని వచ్చెను. సఖీజనము లనేక విధముల శైత్యోపచారములు చేయుచుండిరి. ఈ విధముగ నా రేయి యెల్లం గడచెను.

ఇరువదవ ప్రకరణము.

వింతజాబు.

ఒకనాఁటి యుదయమున స్థానేశ్వరమున నల్లకల్లోలముగ నుండెను. ఆకులురగుచు రాజభటులు వీథుల వెంట వేవేగఁ బర్వులిడుచుండిరి. ఆరక్షక భటులచ్చటచ్చట నిలచి నిజభటుల కేమియో యాజ్ఞాపించుచుండిరి. అధికారి వర్గమునఁ జేరినవా రనేకులు గుస గుస లాడికొనఁ జొచ్చిరి. ప్రజలనేకులు నిదమిత్థమ్మని తెలియ నందునఁ గలవర పడసాగిరి. కొందఱు సందు గొందుల నిలచి యీ గందర గోళమునకుఁ గారణ మారయుచుండిరి. కర్ణాకర్ణికగాఁ గొంతవఱ కావృత్తాంతము తెలిసినవారు చెఱసాల యొద్ద కరుగుదెంచిరి. ఒకరి వెంబడి నొకరుగ క్షణములోన నా ప్రదేశమెల్ల నిండెను. వచ్చిన వారిలో వృత్తాంత మెఱిఁగినవారు గొందఱును, పోవు వారిం జూచి విషయ మిదియని తెలియకున్నను వెంబడించు వారు గొందఱుగను నుండిరి. ఇసుము సల్లినను రాలనంతటి జనాక్రాంతమగు నా ప్రదేశమున వేత్రహస్తులగు రాజభటులు ప్రజలఁ జిందర వందరలై చెదరిపోవునట్లు బెదరింపుచుండిరి. జనుల యుత్కంఠాతిశయము భటుల తర్జనముల లెక్కసేయకుండెను. బహు ప్రయత్నమున నటమూఁగి యున్న మూఁకను రాజభటులొక యోరన నిలుపఁజాలిరి. అంత నమాత్యుఁడు కారాగారాధిపతి నిట్లు విచారింపఁ దొడఁగెను.

మంత్రి:—కరభకా! ఈ చెఱయుండుండిన భీమ సింహాదు లెటకుఁ బోయిరి?

కరభ:—అమాత్య శేఖరా! నే నెఱుఁగ నప్పా డెటు బోయిరని తెలుపఁ జాలుదు?

మంత్రి:—నీ యెఱుక లేనిదే ఇదిజరిగెననుట యెట్లు సంగత మగును?

కరభ:—బంధితులు తప్పుట నే నెఱుఁగననుట సత్యము. అయి నను నా యాచరించిన తొందరపాటొండుగలదు. దానిం జెప్పెదను.

మంత్రి:—అది యెట్టిది?

కరభ:—నిన్న మాయింటికొక్క యువకుఁ డరుదెంచియుండెను. అతఁడు కుమార రాజుగారి కంతరంగ మిత్రుఁడఁట. వాఁడు వారి సంతకముతో నొక లేఖం దెచ్చెను. దాన నాతని విశ్వసించి నాయింటం జేర్చి కొంటిని. నిన్న రేయి నాతఁడు ఈ యూరంగల విశేషము లడుగఁ జొచ్చెను. చెఱసాలం గుఱించి చెప్పునప్పుడు దక్కఁ దక్కిన సమ యములం దంత యవధానముతో వినకుండెను, దాన నే నాకీ సంశయము గలిగెను.

ఈ విచారణ జరుగుచుండ గుమి గూడి వినుచుండిన జన మధ్యమునుండి యొక్క పూల చెండు మంత్రి పాదముల చెంతఁ బడెను. అయ్యది విసరి వైచిన దెవ్వరనుట తెలియ నందున మంత్రియు విస్మితుఁడై చూచుచుండెను. ప్రజలు నా పడిన వస్తువుం జూడ నొక్కరిపై నొక్కరు పడుచుండిరి. అచ్చటఁగల రాజ భటులు నెంతయో కడంగియు దాని నణఁపఁజాలకుండిరి. అప్పుడొక యువకుఁడా గుమి నడుమనుండి వచ్చుచుండెను. వచ్చు వాఁడచ్చట జనుల కోలాహల మణఁపఁ

దలంచి, హుంకరించుచు, గర్జించుచు, బెదరించుచు చుండెను.

మంత్రి:—సంవాహకా! ఏమియీ యట్టహాసము!

సంవాహ:—దేవా?, విచారణకు భంగముగ నీ జనులు కోలాహల మొనర్చుటచే దాని నణంప నీ మూఁకలోని కరిగియుంటిని. నా యీ యట్టహాసము చేతనే రాజభటులకు నలవిగాని హిరిరచ్చ యడఁగెను.

కరభ:—నే నింతకు మున్ను నుడివిన యాతని మోముతీ రీతని యందుఁ గానుపించుచున్నది.

సంవాహ:—అట్లైన నిన్నే మఱచించినవాఁడ నేనని భావించెదవే!

మంత్రి:—ఈతఁడు నా సేవకుఁడు. రూప సామ్యమున నిట్టి భ్రాంతి నందకుము.

కరభ:—మోము జూడ యేకాక మాటల సవ్వడియు నా సంశయమును రూఢము సేయుచున్నది.

ఇది వినిన మంత్రియు నిజ మానసమున నిట్లని వితర్కింపఁ దొడఁగెను. "ఏమి యీకరభకుని యజ్ఞానము! సంవాహకునిపై నిట్టి భ్రమ నెందుచున్నాఁడే! తనపైఁ దప్పు రాకుండుటకై యిట్టి యుక్తిఁ గల్పించి యుండునే! అట్లొంచుటకు నే నిప్పు డాతనిపై నెట్టి నేరమును మోపి యుండలేదు గదా! వీఁడు శత్రు పక్షమునఁ జేరి నన్ను వచింపవచ్చి యుండునే! అడు గడుగున నీతఁడు నిజ బాంధవులం జూడవలయునని యేఁగుచున్నాఁడు. దాన వీనిపై నించుక సంశయము జనించుచున్నది.

ఏమి యీ వెఱ్ఱితనము! నా కెంతయు విశ్వాస పాత్రుఁడగు నీ సేవకునిపై నిట్టి సంశయము నందుటయా! వీఁడు

నా యొద్దకు వచ్చి విశేష కాలము కానందున వీని విశ్వసింపక సందేహింపవచ్చునే! ప్రప్రథమమున నెన్ని విధముల బరీక్షించి యుంటిని. అట్లుండ నిట్లు పొరఁబడుట యయుక్తము. బందుగులంగన నేఁగుచుండినంతట నిట్లని మానింపవచ్చునే! నేనును నా చుట్టములం జూడఁ బలుతడవ లరుగుట కలదు. ఇత్యాది విస్రంభ పాత్రతకు లోటుకాదు.

అట్లయినఁ గరభకుని మాట లసత్యమని తలఁతునే! అతఁడెన్నఁటికి ననాలోచితముగ నాడు వాఁడుగాఁడు. దీన నెద్దియో యొక విషయమున్నట్లు గోచరించుచున్నది. నిన్నటి నుండియు నీతఁడు కొంత కాలము నా యొద్దనుండినఁ దక్కనపుడెల్ల నెచ్చటనో యుండెడివాఁడు. అట్టి తరుణమున నీవంచన మాచరించియుండుననియే తలఁచెదను. మఱియు నీతఁడు స్నానపానాదులలోఁ గలసిమెలసి యుండక పోవుటయు నీతనియందలి సందేహమును బలపఱచుచున్నది.

ఆహా! ఈ దిన మేనేల యిట్టి భ్రమ నొందుచున్నాఁడను? నమ్మిన బంటుపై నేరము మోపఁ జూచుచున్నవాఁడ. అట్లని కరభకునిపై నసత్యదోష మారోపించుటయా! ఇది దోషారోపణ మెట్లగును? మర్మజ్ఞుఁ డెవ్వఁడే నాతని వంచించిన భ్రమించి యిట్లాడియుండును. ఈ మాత్రమున కీతని యందు దోషము నెట్లారోపించుట?

ఆతరుణమున సంవాహకుఁడు నాక్రిందిపూలచెండుం దీసి;

సంవాహ:—ఆహా! ఈ చెండెంతపరిమళించుచున్నది? ఇదియే మహానుభావుఁడు విసరివైచెనో తెలియరాకున్నది. ఆతఁడు మంత్రి శేఖరుని పాదపూజ గావింప నెంచి

జనులు నిబిడముగానుంట నా పని సాగమి నిట్లు విసరి
వైచి యుండనోపు.

ఈ మాటలాలించిన మంత్రియుఁ దన వితర్కములు చాలించి యా చెండు వైపునకు మోము ద్రిప్పెను. ఇంగితజ్ఞుఁడగు సంవాహకుఁడు నా చెండును మంత్రిచేతి కిచ్చెను. అయ్యది నలిగియుండుటచే సడలియుండెను. తన్మధ్యమునం గమ్మ యొక్కండు న్నట్లు గోచరించుడు దాని విప్పి యా లేఖం గాని సంవాహకు నెద్ద నిచ్చి చదువమనెను. మంత్రి యనుమతి నాతఁ డిట్లు చదువఁ దొడఁగెను.

అయ్యా! నా యునికి మనుకులు మీరు విచారింపఁ బ్రయత్నించుట వ్యర్థము. నేనే మీ కారాగారములోని బంధితుల విడుదలకుఁ గారకుఁడను. వారు నిప్పుడు మనపక్షము వారలే. నేనుమ మీ మిత్ర పక్షమునం జేరినవాఁడనే. మీ యెఱుక పైనన ఈ విడుదల చేసి యుండవచ్చునుగాని నా చాపల మట్లొనర్పకుండం జేసెను. దాన నా యీ యపరాధమును క్షమింప వేఁడువాఁడను మే మెల్లరమును మీ రాజ్యమునకు మేలు చేయనెంచు వారము కాని యన్యులముకాము. ఇందు కరభకున కించుకయు సంబంధము లేదు. ఇట్లు మీ భృత్యుఁడు.

ఈ జాబుం జదివినంతన యందఱును విస్మితుఁ లైరి; మంత్రియుఁ గరభకునిపై నపరాధము లేనట్లు విస్పష్టమగుటచే తను, సంవాహకునిపై సంశయమే లేనందునను ఆ విచారణ నుపసంహరించెను. పత్రికా మూలమున బంధితులును, బంధవిముక్తిం గావించినవాఁడును ననుకూలురగు నటులఁ దెలియవచ్చుటచే నొక విధమున సంతృప్తుఁడై నాఁటి సభ చాలించెను.

ఇరువది యొకటవ ప్రకరణము.

స్వప్న సందర్శనము.

గౌడ నగరపు వెలుపటి మైదానమున నొక సేనావార ముండెను. అందుఁ గలవార లెల్లరును గాఢ నిద్రాసక్తులై యుండిరి. శిబిరములందుండు వారెల్లరును, పచ్చిక బయళ్ల గొందఱును, చెట్ల నీడలం గొందఱును, ప్రసుప్తులై యుండిరి. అచ్చటి శిబిరములలో నొక్కటి యత్యంత రమణీయముగ నుండెను. అయ్యది చీనాంబరములచే నలంకృతమై యుండెను. దానివాకిట నిర్వురు కావలి వారు చేత ధనుర్బాణముల ధరించి నిలువఁబడియుండిరి, నిలఁబడిన వారెంత ప్రయత్నించియు నిద్రకాఁగఁ జాలక యట్టెకునికి బడుచుండిరి. కావలి కాయుట వారి వృత్తియగుటచేఁ బాపము, వారేమి సేయఁగలరు! మేల్కాంచినపుడు మాత్రము దమ సేవావృత్తి నెంతయు దూషించికొనఁ జొచ్చిరి. ఇట్లు కునికి పడుచు మేల్కొనుచు నిద్రా జాగ్ర దవస్థలమధ్య నుండి కష్టపడుచుండిరి.

గుడారము లోవైపున నొక శయ్యయుండెను. అందొక్కఁడు పరుండి కన్నులు సగమమూఁతవడ స్వప్నావస్థయందుండెను. వాని యాకారమును భూషణాదులం జూచిన నాతఁడొక రాజనుట విస్పష్టమగుచుండెను. అతని చెంత నొక దీప స్తంభముండెను. అయ్యది మిక్కిలి వెలుఁగు నిచ్చుచుండెను. వాని యెడమ వైపున నొక బల్ల యమరియుండెను. దానిపై నొక చిన్న రత్న కంబళము పఱచియుండెను. అందొక కాచ

పాత్రలో ద్రాక్షారసము నిండి యుండెను. శయనించిన యీతఁడు మేల్కొనినపు డెల్ల నా మద్యమును ద్రావి మరల శయ్యపైఁ బరుండి యర్ధనిద్రాపరవశుఁడై యుండెను. వాని చెంత మూవురు నేలపైఁ బరుండి గాఢనిద్ర ననుభవించుచుండిరి. దీపస్తంభములోని చమురయిపోవుటచే నాదీపము ప్రకాశహీనమై యుండెను. జాగ్రత్సుషుప్త్యవస్థా మధ్యగతుఁడగు నా శయ్యాగతు నెదుట నించుక దూరమున నొక యాకృతి నిలువఁబడి నట్లాతనికిఁ గోచరించెను. అయ్యది రక్తమాంసము లించుకయు నులేక శుష్కీభూతమై కేవల శల్యావశిష్టమై యుండెను. అది యంత పొడవుగాక పొట్టిదై యుండెను. చేతి వ్రేళులు లోన మాంసములేమి వట్టి తిత్తులవలెఁ దోఁచుచుండెను. అయ్యది మంద గమనమున నడచు లాగుండెను. దాని రూపు గాంచిన నొక యాఁడుదని మాత్రము దెలియనగు చుండెను. మెడయందు నులిమిన గుఱుతులు గొన్ని గోచరించు లాగుండెను. చెట్టునందలి సన్న గొమ్మలు గాలికిఁ గదలు లాగున దాని రెండు చేతులును నల్లల నాడుచుండెను. అయ్యది తిన్నఁగ నడచుచుఁ దన వైపుననే వచ్చుచుండెను. అంత నీశయ్యాగతుఁడా యవస్థయందే నోరు దెఱచి యఱచుటకుఁ గడంగెను కాని నోటనుండిమాట రాకుండె. లేచి శయ్యయందుఁ గూర్చుండెను. మరలఁ బరుండెను. ఇప్పుడా విగ్రహము గోచరించుటలేదు కాని పూర్వము తనకు లోఁబడ కుండుటచే మెడ నులిమి యగడ్తలోఁ బాఱవైచిన శోణావతి యను నొక యువతి జ్ఞప్తికి వచ్చెను. వెంటన యాతని యంగములు వడఁకఁజొచ్చెను. గుండియలు దట తటఁ గొట్టికొనఁ దొడఁగెను.

మరల నాతఁడు శయ్యా యందాసీనుఁడాయెను. తనకుఁ దెలి యకయే లేచి యిటునటుఁ బచారు సేయ మొదలిడెను. యథా పూర్వముగ శయ్యం గూర్చుండెను. కొంత వడికటఁ బరుండెను.

ఇటుల మున్నుఁ బోలె జాగ్రత్సుషుప్త్యవస్థలలో నుండు నాతని కనతి దూరమున మరల నొక విగ్రహము గోచరించెను. . ఇయ్యది యించుక వాఁడు బాఱియున్నను మున్ను గోచరించిన దానివలె నుండక పొడవుగ నుండెను. శరీరము నిమ్మపండు వంటి చాయం గనరియుండెను. ఆ విగ్రహము దివ్యాంబరాభరణాలంకృతమై ప్రకాశమానముగఁ దోఁచెను. చేత నొక ఖడ్గమును బూనియుండెను. దాని నేత్రముల నుండి యగ్ని కణము లురులునటులఁ బొడఁ గట్టుచుండెను. క్రూర దృష్టిం దన్ను దహింపనున్నదో యని యాతని మదికిఁ దోఁచెను. చేతియందలి కత్తిని జళిపించుచుండెను.

ఈ యాకృతిం గాంచి నంతనే శయ్యాగతుఁడగు నీతనికి రాజ్యవర్ధనుఁడు జ్ఞప్తికి వచ్చెను. అనాఁడాతఁడు విందునకు వచ్చినప్పుడు దా నొనర్చిన యకృత్యములు స్మరణకు వచ్చెను. ఆ విగ్రహ మట్లు తిక్రోధమునఁ దన్నుఁ జూచుచుఁ దనవైపునకే వచ్చుచున్నటుల గోచరించెను. అంత నీతఁడఱచుట కెంచెను గాని భయభ్రాంతుఁ డగుటచే నోటి నుండి మాట రాలేదు. కాళ్లు సేతుల విలవిలఁ దన్ని కొనఁజొచ్చెను. అట్టి యవస్థ నించుక సేపుండు నపుడు, ఆ విగ్రహము పెదవులఁగదల్పుచు ;

"శశాంక వర్ధనా! నన్నా నాఁ డేమఱుబాటున జంపిన ఫలము వృథగాఁ బోవునని యెంచితివే!. ఇదె నేనిను నమిలి

మ్రింగివైవ వచ్చుచున్నాఁడను. ఇప్పు డెట్లు తప్పించి కొనఁ గలవు ?”

అని మాటాడినట్లు తోఁచెను. వెంటనే యాతఁడు సాహసించి మాటాడ నుపక్రమించెను గాని మాటలు తడఁబడఁ జొచ్చెను:

“ఆఁ,ఆఁ.రా.. జ్య..ద్ధ...చ...చ్చి...యి ...చ....చ్చి.... యి.”

అని యన్యుల కవ్యక్తమగు లాగుననఱచెను. నేలపై నిద్రించుచుండిన యా మూవురును లేచి రాజు కలవరించుచున్నాఁడని తలఁచిరి. చెంతనుండు దీపస్తంభము నందలి వత్తి నెగ ననఁద్రోచి అందుఁ దైలమును బోసి ప్రకాశము గల్గు లాగొనర్చిరి. రాజును దట్టిలేపిరి. అతఁడు నించుక సుషుప్తి నుండి లేచి;

“రాజ్యవర్ధనా! చచ్చితి చచ్చితి. నను గాపాడుము. నాకింకను బ్రదుక వలయునను కోర్కి గలదు. నీ విట్లు నను మ్రింగఁ జూచుట నీతికాదు.”

అని మరల మాటాడక పరుండి యుండెను. చెంత నుండిన యా యంగరక్షకులు మూవురును రాజు నతి ప్రయత్నమున మేల్కొల్పిరి. కూర్కినుండి విడివడిన యారాజున కప్పటికిని రాజ్యవర్ధనుని ప్రేతము కంటి యెదుట నున్నట్లే కన్పట్టు చుండుటచే మరల;

“ఓయీ! నీ వేఁగుము. నీయీ ఘోరాకృతి చూడ నా కెంతయు భయము గలుగుచున్నది. నీకిదె వేయినమస్కృతు లర్పించు వాఁడను.”

అని యీలాగు ననదరుచుండ నా శశాంక గుప్తు నతి ప్రయత్నమున లేపి కూర్చుండఁ బెట్టిరి.

"దేవా! ఇది దేవరవారి శిబిరము. మేమిదె మీయంగ రక్షకులము. మీకీ నాఁడేల యింతటి చిత్తచాంచల్యము గలెను. లెండు. లెండు. ఏదో దుస్స్వప్నము మీకు దోఁచినట్లు మేము తలఁచుచున్నాము.

పిదప రాజును మేల్కాంచి యంగ రక్షకులఁ జూచి;

శశాంక:—"రాజ్యవర్ధనుని ప్రేతము వచ్చియుండెనే! అది యెచ్చటికిఁ బోయెను?"

అంగ:—దేవర వారెద్దియో దుస్స్వప్నముంగని యిట్లు కలవరించుచున్న వారలంతయే కాని వేఱుకాదు.

శశాం:—అట్టులా! అయిన నిటకా ప్రేతము రాలేదా?

అంగ:—లేదు.

శశాం:—నే నింతకు మున్నును జూచియుంటినే?

అంగ:—అది దుస్స్వప్నము వలనఁ గల్గిన భ్రాంతి మూలము.

శశాం:—నే నిప్పుడు మేల్కాంచి యున్నాఁడనా!

అంగ:—స్వామీ! మీ రిపుడు మేలుకొనియే యున్నారు.

శశాం:—మీ కిది బాగుగఁ దెలియునా?

అంగ:—ఆహా! మా కిది చక్కఁగాఁ దెలియును.

శశాం:—వాఁడు గాక పోయినను నొక స్త్రీ వ్యక్తిని మీరి చటం జూచితిరా!

అంగ:—ఇం దెవ్వరును రాలేదు.

అంత శశాంక గుప్తునకు నించుక ధైర్యము దోఁచఁగఁ గనులు విచ్చి చుట్టునుం గలయఁ జూచిన నింతకు మున్నుఁ

బడిన దండయు దుస్స్వప్న మూలమగుఁ గలవరమే యనుట నిర్ధారణ చేసికొని యెను.

శత్రు సైన్యము కోట వెలుపట మైదానమున నుండుట చారుల వలనం దెలిసి మఱునాఁటి యుదయమున యుద్ధమున కుపక్రమించుటకు వలయు సన్నాహములు గావించుటకుగాఁ గొందఱ సైనికుల రప్పించి కార్యాలోచన సేయుచుండెను.

ఇరువది మూఁడవ ప్రకరణము.

సంశయ నివారణము,

గణదాసుఁడు:—అమ్మా! మా యపరాధముల మన్నింప వేఁడి
కొనుచున్నారము.

రాజ్యశ్రీ:—మీవి యపరాధములలోఁ బరిగణింపఁ బడవని
నాఁడే విభాకరమిత్రులాన తిచ్చిరి కదా!

గణదాసుఁడు:—అది కాదు. మరల నజ్ఞానకృతమగునది యొక
యపరాధము

రాజ్యశ్రీ:—అది యెట్టిది?

గణదాసుఁడు:—మీరీ రాజ్యము పాలింపందగరనుట.

హర్ష:—ఏకారణమున?

గణదాసుఁడు:_సంతాన హీనలగుటయే దానికి మూలకారణము.

ఈ మాట వినినంతనె రాజ్యశ్రీ యొక్క చిత్త మొక విధమగు మాఱుపాటు నొందెను. కాని దాని వెలిపుచ్చక యథాపూర్వస్థితికిఁ దెచ్చికొనియెను. ఇట్లే హర్షవర్ధనుని చిత్తమును మాఱుపాటు నొందనాతఁడు నది వెలికిఁ దోఁచనీక సరిపఱచికొని;

హర్ష:—గణదాసా? ఇంక మీ యభిమత మెట్టిది?

ప్రధానామాత్యుఁడు:—ఇంతకు మున్నువారు పడిన యభి
ప్రాయ భేదములం దెల్పుచున్నారు కాని వీరి యిప్పటి
యభి మతముకాదు.

రాజ్యశ్రీ:—ఇప్పుడొక యభిప్రాయమును మాత్రమే కదా
తెలిపితిరి? తక్కిన వెవ్వి?

ప్రధానా మాత్యుఁడు:—ప్రజా సత్తాకమగు రాజ్యము గావల యునని కొందఱును, నిరంకుశాధి కారము గల రాజుం డవలయునని కొందఱును, ప్రజాప్రతినిధి సభకు లోఁబడిన రాజుండ నగునని కొందఱును, హర్ష వర్ధన మహా రాజు రాజుగావలెనని కొందఱును, రాజకుటుంబములోని వారి నేరినైన దేవిగారు స్వీకార మొనర్చికొని వారి రాజుఁ గావింపవలెనని కొందఱును, భర్తయనుమతి లేని స్వీకారము చెల్లదని కొందఱును, ఇట్లెవరి కెట్లు దోఁచిన నట్లాడు చుండిరి.

హర్ష:—అవల నెట్లు తీర్మానము చేసిరి ?

ప్రధానామాత్యుఁడు:—అంత నెల్లరం జేర్చికొని యవలోకి తేశ్వరు నాలయమున కరిగితిని. అచ్చటి దేవునిం బ్రార్థించితిని. అర్చకముఖమున నా దైనము దేవి గారిని సింహాపుగద్దియం గూర్చుండ నియోగించెను. హర్ష వర్ధన చక్రవర్తిని రాజ్యము పాలింప నానతిచ్చెను. అప్పు డెల్లరును నేకగ్రీవముగ దాని నంగీకరించి నాతోడ నిచ్చటికి వచ్చిరి.

వీరిట మాటలాడుచుండ భండియుఁ గుమారుఁడును శబరనాయకుఁడు మున్నగువారు నటకు వచ్చిరి. వచ్చినవారును నమాత్యాదులచే యథోచితముగ సత్కరింపఁ బడిరి. అంత భండియు హర్ష వర్ధనుం జూచి యానందించుచు;

“ దేవా! దేవరవారి యాజ్ఞ చొప్పున శశాంకగుప్తుని సంహరించితిని. అతని తనయుని వంగదేశాధిపతిం గావించితిని. వాని మనకు సామంతునిగా నొనర్చితిని. ఈ యుద్ధమున మంగ

శేశ్వరుఁడను నొక యువకుఁడు మన కెంతయుఁ దోడ్పడెను. ఆహా ! ఆతని పరాక్రమము నేమని చెప్పఁగలుదును !
హర్ష :—ఆ యువకుఁ డిప్పు డేడ నున్నాఁడు?

అంత భండియుఁ దనపరివారమున నెల్లెడలం గలయఁ జూచెను. ఎచ్చటను నాతని పొలకువ గాన్పింపలేదు. అంత నతఁడును గుమారుఁడును అత్యంతము విస్మితులైరి. ఆసమయమున మంగళిక యచ్చటికి కరుదెంచి;

మంగళిక:—ఆర్యులార! హర్ష సమయమున మీ మానసముల నెట్టి సంశయములు నుండఁగూడదని మా దేవిగారి యాశయము. కావునఁ గొన్ని యంశముల నేనిపుడు వివరింపఁ బోవుదానను. దత్తావధానులరై యాల కింపుఁడు.

దివాకర మిత్రులవారి యాశ్రమమునుండి కన్యాకుబ్జమునకు వచ్చుచుండ భండిగారికిం దోడ్పడఁ బురుష వేషముల ధరించి దేవిగారును నేనును హర్షవర్ధన దివాకర మిత్రుల యానతివడసి యేఁగితిమి. అట చంద్రకేతుననుచరులు మన యీ సేనాపతిగారిం జంపనెంచుట తెలిసి వారి నాఖడ్గమునకు బలియొనఁగితిని.

భండి:—ఆహా ! నేనింతవఱకు నిది తెలియలేనైతిని. మీ సాహస మవాఙ్మానస గోచరము.

హర్ష :—తర్వాతి యుదంతముం దెల్పునది.

మంగళిక:—దేవిగారు చంద్రకేతుని బట్టి బంధించి చెఱ నుంపించిరి. ఇచ్చటి ప్రజలు తమరాకకై సంతోషింతు రని వెంటనే వా రీయూరికి వచ్చిరి. నేనుమాత్ర

మటనుండి బంధితుని విచారించునపుడు వానిగుట్టు రట్టుపఱచితిని. ఇంతలోన నాసోదరి భామిని "తన భర్తయగు మలయకేతువు భీమ సింహాదులతోఁ జేరి కుట్రలు సల్పుచుండుటచే వారితోడ నీతఁడును జెఱఁ బడియె" నని వర్తమాన మంపెను. నేనును సేనాపతిని వీడ్కొని కన్యాకుబ్జమునకు వెడలు దానివలె నటించి స్థానేశ్వరమున కరిగితిని. నా యూహాబలమున వారిం దప్పించి వా రెప్పుడును శత్రుపక్షమునఁ జేఱకుండున ట్లొనర్చితిని.

హర్ష:—ఈ విషయ మమాత్యుఁడు నాకుం జెప్పెఁగాని వారెవ్వరై నదియుఁ దెలియక విస్మయము గల్గియుంటిని. సరి. ఆవలియుదంతముం జెప్పుము.

మంగళిక:—బంధితులు చెఱఁ దప్పినందులకుగా మంత్రి కారాగారాధికారిని విచారించుచుండ ఆజనమధ్యముననుండి లేఖాయుతమగు నొక పూలచెండును విసరి వైచితిని. తన్మూలమున మంత్రికి సంశయము వీడెనుగాని పురుష వేషమున మంత్రి నాశ్రయించి యుండిన నాసోదరిని జూచి కారాగారాధికారి సంశయించెను. ఆవల రూప సామ్యమే యందులకుం దగు కారణ మని యెంచెను. అంత నటనుండి వెడలి గౌడనగరమునకు వచ్చి మన వారికి యుద్ధమున సహాయముగానుండి యనంతరమున వీరితోడ నిటకు వచ్చితిని. దేవిగారి యానతిని మీ సంశయముల వారించితిని.

అంతట నెల్లరును విస్మయానంద పరవశులైరి. మంత్రి సామంతాదులు రాజ్యశ్రీదేవిని సింహాసనోపవిష్టం గావించి పట్టాభిషేక మొనర్చిరి. హర్షవర్ధన చక్రవర్తిని బరిపాలనాధికారిగ నేర్పఱచిరి. ఆ పుణ్యసమయమున వేదఘోషములు విస్తృతము లగుచుండెను. మంగళవాద్యత్ర నిస్వనము లాకసముం దాఁకి మాఱు వల్కుచుండెను చక్రవర్తియు నచ్చటికి వచ్చినవారినెల్ల సర్వవిధం బహూకరించెను. ఇతఁడు కవిత్వప్రియుఁ డగుటం దానును గవియగుటచే నీతనిసభం బెక్కురు కవు లెక్కుడుగ సమ్మానింపఁబడుచుండిరి. హర్షవర్ధనుఁడు నప్పుడప్పు డనేకోత్సవములు సేయుచు బౌద్ధ భిక్షువులను జైన సన్న్యాసులను బ్రాహ్మణులను సమానముగాఁ గౌరవించుచు రాజ్యశ్రీదేవిగారి నత్యంత సంతుష్టం గావించుచుండెను.

PRINTED AT THE ARTISAN PRESS, WALLAJAH ROAD, MADRAS.—1926.

13982